

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 5-10-2025 | పేజీలు: 12 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 170 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి మ.3.04 తదుపరి చతుర్దశి, నక్షత్రం: శతభిషం ఉ.8.01 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం:మ.1.57-3.26, దుర్ముహూర్తం: సా.4.22-5.10, అమృతఘడియలు: రా.10.51-12.20, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.09, సూర్యాస్తమయం: 5.57 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రతిపక్షంలో ఉండగా మీ కష్టాలు స్వయంగా చూశాను. రోడ్లు గుంతలతో అధ్వానంగా ఉండటంవల్ల మీరు సంపాదించిన దానిలో సగం రిపేర్లకే ఖర్చు చేయాల్సి వచ్చేది. అడ్డగోలు జరిమానాలు మిమ్మల్ని కుంగదీశాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లన్నీ బాగు పడ్డాయి. రూ.3,450 కోట్లు ఖర్చుపెట్టి 23 వేల కిలోమీటర్ల పరిధిలో రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టాం. గత ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్‌ను రూ. 25 వేలకు పెంచితే, మేం రూ.3 వేలకు తగ్గించాం. మీలో పేదవాళ్లే ఎక్కువ. మీకు ఎంత చేయాలో అంతా చేస్తాను. రవాణా శాఖ పరిధిలో అందించే సేవలన్నింటినీ సులభతరం చేస్తా. ఇందుకు బదులుగా ప్రయాణికులకు ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల గురించి చెప్పండి. పర్యాటక పరంగానూ ప్రభుత్వానికి సహకారం అందించండి.

\- చంద్రబాబు



'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం నిధుల జమ కార్యక్రమంలో రూ.436 కోట్ల నమూనా చెక్కును ఆటోడ్రైవర్లతో కలిసి ప్రదర్శిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు లోకేశ్, రాంప్రసాద్ రెడ్డి తదితరులు

సర్కారీ క్యాబ్ యాప్

ఉబర్, ఓలాలకు దీటుగా తెస్తాం.. ఆటో డ్రైవర్లకు బిజినెస్ ఇస్తాం

ఇక ఆటోస్టాండ్ల వద్ద పడిగాపులు పడక్కర్లేదు

సంక్షేమం కోసం వారే సభ్యులుగా ప్రత్యేక బోర్డు

ప్రభుత్వ పథకాలకు ప్రచారకర్తలుగా మారండి

పర్యాటకపరంగానూ సహకరించండి

ఆటో ఎక్కినవారికి ప్రభుత్వ మంచిని తెలపండి

గత ప్రభుత్వంలో ఎన్నో కష్టాలు పడ్డారు..

దుష్టులను రానీయొద్దు.. వైకుంఠపాళీ ఆడొద్దు

కొత్తవారు వస్తే ఏదో ఇస్తారని చూడొద్దు

ఆటోడ్రైవర్ల సేవలో.. పథకం ప్రారంభించిన సీఎం

2,90,669 మంది ఆటోవాలాలకు రూ.436 కోట్ల ఆర్థిక సహాయం జమ

విజయవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆటోడ్రైవర్లకు బిజినెస్ ఇచ్చి, వారిని ఆదుకునే బాధ్యత తీసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి ఆన్‌లైన్ యాప్స్‌ను తీసివేయలేం. కానీ ఆటోవాలాలు, క్యాబ్‌వాలాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా 'సర్కారీ క్యాబ్' బుకింగ్ యాప్‌ను రూపొందిస్తాం. ఈ యాప్ ఆర్థికంగా ఊరట కలిగిస్తుంది. ఆటోస్టాండ్ల వద్ద రోజంతా పడిగాపులు పడాల్సిన అవసరం ఇకపై ఉండదు. ఈ యాప్ నిర్వహణ కోసం కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేస్తాం. అందు లో ఆటో, క్యాబ్ డ్రైవర్లే సభ్యులుగా ఉంటారు" అని సీఎం తెలిపారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం వారినే సభ్యులుగా చేసి త్వరలో ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. శనివారం విజయవాడలోని సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 'ఆటో డ్రైవర్ల సేవలో..' పథకాన్ని ఆయన

మిగతా 11వ పేజీలో...

భారమైనా భరిస్తాం..!

ఆటో డ్రైవర్లకు 15 వేల ఆర్థిక సాయం అభినందనీయం

'స్త్రీశక్తి'తో జరిగే నష్టం గురించి క్యాబినెట్‌లో మాట్లాడా

రోడ్లపై గుంతలు, గ్రీన్‌ట్యాక్స్ సమస్యలూ పరిష్కరించాం

'ఆటోడ్రైవర్ల సేవ'లో సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మీ సంక్షేమం మా బాధ్యత


డ్రైవర్ల సమస్యలన్నీ పరిష్కరించాం

గ్రీన్ ట్యాక్స్ 3 వేలకు తగ్గించాం..

రోడ్లకు మరమ్మతులు చేశాం

ఆటోలపై కొటేషన్లు చదివి డ్రైవర్లను ఉత్తేజ పరిచిన లోకేశ్

11



నటులు కులదైవాలా!



తెలుగుదేశం సభ్యుడు నందమూరి బాలకృష్ణ అన్న మాటలను కాదు - నిండు సభలో ఆయన ప్రవర్తించిన తీరును తప్పు పట్టాలి. చలువ కళ్లద్దాలను తలపైకి పెట్టి, రెండు జేబులలో చేతులు పెట్టుకొని ఆయన మాట్లాడటం సభా మర్యాదలను ఉల్లంఘించడమే! ఒకప్పుడు సభ్యుడు ఎవరైనా ఇలా ప్రవర్తించి ఉంటే సభాపతి తీవ్రంగా మందలించి ఉండేవారు.

గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి సినిమా పరిశ్రమలో కష్టపడి పైకి వచ్చిన చిరంజీవిని అవమానించారని పవన్ కల్యాణ్ సైతం ఎన్నో సందర్భాలలో అన్నారు. ఇప్పుడు ఏర్పడిన తాజా వివాదంతో.. 'ఆరోజు ఏమీ జరగలేదు. జగన్ రెడ్డి మమ్మల్ని బాగా చూసుకున్నారు' అని కొంత మంది జగన్ తరఫున వకల్తా పుచ్చుకొని మాట్లాడారు.

చిరంజీవి అయినా, బాలకృష్ణ అయినా ప్రజలు వారిని అభిమానించేది సినిమా నటులుగానే. అంతకు మించి మహా నాయకులు అని కాదు. తెలుగుదేశం పార్టీ లేకుండా బాలకృష్ణ సైతం సొంతంగా పోటీ చేసి గెలవలేరు. ఇలాంటి పరిమితుల గురించి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు బాగా తెలుసు. అందుకే వారు సంయమనం పాటిస్తున్నారు.

కేవలం తమ కులం వారి మద్దతుతోనే ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవిగానీ మరొకరుగానీ ఆ స్థాయికి ఎదగరు. ప్రేక్షకులు వారిని అందరివారిగానే చూసి ఆదరించారు. అప్పట్లో లేని గొడవలు ఇప్పుడు ఎందుకు? సినిమా బాగా లేకపోతే కులపోళ్లు మాత్రమే సదరు సినిమాను ఆడించలేరు కదా? ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి, బాలకృష్ణకు ఎన్ని ఫెయిల్యూర్స్ లేవూ?

ఆంధ్రప్రదేశ్‌ను పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్య ఈ కుల తత్వమే. ఇది ఎంత దూరం వెళుతోందంటే, తప్పు చేసిన వాళ్లు తమ కులపోళ్లు అయితే చాలు, వారికి అండగా ఆయా కులాలు నిలబడుతున్నాయి.

కొత్త పలుకు

-ఆర్కే విశ్లేషణ 4లో..

జనసేన బలోపేతానికి
త్రిశూల వ్యూహం



ఒక్కో ఎమ్మెల్యేకు ఐదు నియోజకవర్గాల బాధ్యత

పార్టీ శ్రేణులతో ప్రజాప్రతినిధులు మమేకమవ్వాలి

యువత, మహిళల ఆకాంక్షలను అర్థం చేసుకోండి

వారి అభివృద్ధి, సంక్షేమం, రక్షణకు ప్రాధాన్యమివ్వాలి

పార్టీ శాసన సభ పక్ష సమావేశంలో నేతలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు

11

తారలకు 'ఏఐ' విలన్!

కృత్రిమ మేధతో సెలబ్రిటీల రూపంలో విచ్చలవిడిగా కంటెంట్ తయారీ

యాడ్స్ నుంచి అశ్లీల కంటెంట్ దాకా సోషల్ మీడియాలోకి

కోర్టులను ఆశ్రయిస్తున్న నటులు

ఢిల్లీ హైకోర్టులో నాగార్జున, అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యారాయ్, కరణ్ జోహార్ పిటిషన్లు

ఈ తరహా కంటెంట్‌ను అడ్డుకోలేని యూట్యూబ్, సోషల్ మీడియా

అల్గారిథం లోపాల వల్లే: నిపుణులు

మాన్యువల్ రివ్యూతోనే పరిష్కారం: నల్లమోతు శ్రీధర్



హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సినీతారలకు కృత్రిమ మేధ (ఏఐ) విలన్‌గా మారింది. ఇటీవలి వరకు సినిమాల్లో స్పెషల్ ఎఫెక్టుల కోసం వాడిన సాంకేతికత ఇప్పుడు డిజిటల్ మోసగాళ్ల చేతిలో కొత్త ఆయుధంగా మారింది. ఏఐ సాయంతో సినీ సెలబ్రిటీల రూపంలో తయారవుతున్న చిత్రాలు, వీడియోలు

మిగతా 12వ పేజీలో...



సోలార్.. పవర్ ఫుల్!

సౌర విద్యుత్‌కు రాష్ట్రంలో అవకాశాలు పుష్కలం

ఏటా 299 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం

సీమ అత్యంత అనుకూలం

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ నివేదిక

2

'సౌర'.. నిర్లక్ష్యం!

సోలార్ విద్యుత్ కోసం 14 లక్షల దరఖాస్తులు

రాష్ట్రంలో ఇప్పటిదాకా 56 వేల ఇళ్లకే ఏర్పాటు

వెండర్ల చేతిలో 'పీఎం సూర్యఘర్' విలవిల



మాయాలేదు.. గారడీ కాదు

కళ్లకు గంతలు కట్టినా సునాయాసంగా వస్తువులు, అక్షరాల గుర్తింపు


తల్లిదండ్రులతో సాత్విక, ప్రీతమ్ కార్తీక్

- గాంధారి విద్యలో చిన్నారి సాత్విక ప్రతిభ
- భగవద్గీత, రామాయణాన్ని కంఠస్థం చేసిన ప్రీతమ్
- అబ్బురపరుస్తున్న చిన్నారులు

(తాడిపత్రి-ఆంధ్రజ్యోతి)

కళ్లకు గంతలు కడితే మనం తడబడతాం.. నాలుగు అడుగులు వేస్తే తుళ్లిపడతాం. కానీ ఓ 11 ఏళ్ల చిన్నారి మాత్రం కళ్లకు గంతలు కట్టినా ఏమాత్రం ఏ మాత్రం తడబడకుండా వస్తువులను, అక్షరాలను సునాయాసంగా గుర్తుపట్టేస్తుంది. అంతేకాకుండా బొమ్మలు కూడా అందంగా గీస్తుంది. ఇందులో మాయాజాలం ఏమీలేదు, గారడి అంతకన్నా కాదు. అది అభ్యాసంతో వచ్చిన విద్య మాత్రమే. తిరుపతిలో నివాసం ఉంటున్న సురేఖ, అయ్యప్ప దంపతుల కుమార్తె సాత్విక 'గాంధారి విద్య'లో ప్రావీణ్యం సంపాదించింది. కళ్లకు గంతలు కట్టుకుని చదవడం, రాయడం, బొమ్మలు గీయడం, పెయింటింగ్ వేయడాన్ని గాంధారి విద్య అంటారు. ఈ కళలో ఆ చిన్నారి నైపుణ్యం సాధించింది. సాత్విక తమ్ముడు ప్రీతమ్ కార్తీక్ మరో కళలో నిష్ణాతుడు. ఏడేళ్ల వయసులోనే రామాయణం, భగవద్గీతలను కంఠస్థం చేసేశాడు. వాటిలో శ్లోకాలను అనర్గళంగా చెప్పగలడు. దసరా సెలవులకు తమ సొంతూరు తాడిపత్రికి వచ్చిన ఈ చిన్నారుల ప్రతిభ గురించి తెలుసుకున్న బంధుమిత్రులు, స్థానికులు ప్రత్యక్షంగా తిలకించేందుకు ఆసక్తిగా వారింటికి వచ్చారు. అందరి ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని సాత్విక బొమ్మలను, రంగులను, అంకెలను గుర్తు పట్టి చెప్పేసింది. పుస్తకాల్లోని అక్షరాలను చదివింది. బొమ్మలు గీసి, వాటికి రంగులు అద్దింది. సాత్వికలో ఇలాంటి ప్రతిభ ఉందని చిన్నతనంలోనే తల్లిదండ్రులు గుర్తించారు. కర్ణాటకలోని హోస్పేట జిల్లా కూడ్లిగి పట్టణంలో గాంధారి విద్యలో శిక్షణ ఇస్తున్నారని తెలుసుకుని అక్కడికి పంపించారు. స్మెల్, టచ్, స్కానింగ్ ప్రక్రియల్లో శిక్షణ ఉంటుందని, వాటిని కేవలం పది రోజుల్లోనే తమ కుమార్తె నేర్చుకుందని తల్లి సురేఖ తెలిపారు. సురేఖ టీటీడీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయ్యప్ప సివిల్ కాంట్రాక్టర్‌గా ఉన్నారు.



కళ్లకు గంతలతో బొమ్మలు గీస్తూ, చదువుతున్న సాత్విక

ప్రపంచంలో అత్యంత సంపన్నమైన సౌర వనరులు ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. దేశంలోని ప్రతిరాష్ట్రం సౌర విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైనవే. ముఖ్యంగా రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు సౌరవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో ప్రథమ వరుసలో ఉన్నాయి. ఏపీలో అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలు సౌర విద్యుత్ ఉత్పత్తికి అత్యంత అనుకూలమైనవి.

- ఎన్ఐఎస్ఈ నివేదిక



రాష్ట్రంలో సౌర పలకల ఏర్పాటు నత్తనడకన సాగుతోంది. ఈ నెల 3వ తేదీ వరకు 14,24,773 దరఖాస్తులు అందగా, వీటిలో 56,451 దరఖాస్తులకు మాత్రం మోక్షం కలిగింది. మరోవైపు కేరళలో మొత్తం 2,01,548 మంది 'పీఎం సూర్యఘర్'కి దరఖాస్తు చేసుకోగా 1,46,110 మంది ఇళ్లపై సౌర పలకలను ఏర్పాటు చేశారు. దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో 'పీఎం సూర్యఘర్' పథకాన్ని అందిపుచ్చుకున్న రాష్ట్రాల్లో కేరళ ప్రథమ స్థానంలో నిలిచింది.

సోలార్.. పవర్ ఫుల్!

సౌర విద్యుత్‌కు రాష్ట్రంలో అవకాశాలు పుష్కలం

- ఏటా 299 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం
- సీమ జిల్లాలు సోలార్‌కు అత్యంత అనుకూలం
- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ నివేదిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తికి అపార అవకాశాలు ఉన్నాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ(ఎన్ఐఎస్ఈ) నివేదిక తెలిపింది. దేశంలో సౌర విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేసిన ఎన్ఐఎస్ఈ గత నెలలో నివేదికను విడుదల చేసింది. ఏపీలో 299.31 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని పేర్కొంది.

2010లో సోలార్ మిషన్

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని భారీగా ప్రోత్సహించాలన్న లక్ష్యంతో 2010లో తొలిసారి కేంద్ర ప్రభుత్వం 'సోలార్ మిషన్'ను ప్రారంభించింది. 2020కి 20 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఎప్పటికప్పుడు ఈ లక్ష్యాన్ని మెరుగుపరుచుకుంటూ 2047 నాటికి 500 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2014లో ఇది కేవలం 2.82 గిగావాట్లుగా ఉంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,343 గిగావాట్ల పవర్ సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. రాష్ట్రాల్లో వృథాగా ఉన్న భూములను పరిగణనలోకి తీసుకుని, గరిష్ఠంగా 10 శాతం భూమి లో సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా రాష్ట్రాలకు లభించే సౌర విద్యుత్ సామర్థ్యాన్ని ఎన్ఐఎస్ఈ లెక్కించింది. నిబంధనల ప్రకారం మొత్తం భూమిలో 10 శాతానికి మించి సౌర విద్యుత్ ఉత్పత్తికి వినియోగించరాదు. అయినప్పటికీ దేశవ్యాప్తంగా 4,12 ,458 చదరపు కిలోమీటర్ల వృథా భూములను గుర్తించగా వీటిలో 6.69 శాతం భూముల్లో (27,571 చదరపు కిలోమీటర్లు) గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసి, 3,343 గిగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని నివేదిక స్పష్టం చేసింది.

ఏపీలో 3 లక్షల మెగావాట్లు..

ఏపీలో 2,181.27 చదరపు కిలోమీటర్ల వృథా భూములు ఉన్నట్లు ఎన్ఐఎస్ఈ నివేదికలో పేర్కొన్నారు. దీనిలో 10 శాతం వృథా భూముల్లో సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేయడం ద్వారా 299.31 గిగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం భూమిలో 56 శాతం వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. మరో 6 శాతం జలవనరులు, 21 శాతం అడవులు ఉన్నాయి. 13 శాతం వృథా భూములు ఉన్నాయి. వీటిలో 89 శాతం చిన్నచిన్న చెట్లు, పొదలతో కూడిన భూమి ఉంది. ఇది సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు బాగా అనుకూలమైందని, 2,181 చదరపు కిలోమీటర్లను వినియోగించుకుంటే 299.31 గిగావాట్ లేదా 2,99, 312.12(3లక్షల) మెగావాట్ సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని నివేదిక పేర్కొంది. అనంతపురం జిల్లాలో అత్యధికంగా 71,909. 94 మెగావాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలు ఉన్నాయని తెలిపింది.

ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్టుకు కేంద్రంగా ఏపీ!

ఏపీలో ప్రస్తుత సౌరవిద్యుత్ సామర్థ్యం 5,006 మెగావాట్లుగా ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం 5 భారీ సోలార్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి సామర్థ్యం 4,160 మెగావాట్లు. కర్నూలులోని అల్ట్రా మెగా సోలార్ పార్కు 1000 మెగావాట్ల సామర్థ్యంతో ఉండగా, ఎన్‌పీ కుంట అల్ట్రా మెగా సోలార్ పార్కు సామర్థ్యం 978.5 మెగావాట్లుగా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్టు (ఐఆర్ఈఎస్‌పీ)కు కూడా రాష్ట్రమే కేంద్రంగా మారనుంది. 5,230 మెగావాట్ల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. దీనిలో 3 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కావడం గమనార్హం. రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోగలిగితే రాష్ట్ర విద్యుత్తు రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని ఎన్ఐఎస్ఈ నివేదిక పేర్కొంది.

ఎందుకీ నిర్లక్ష్యం!

సోలార్ విద్యుత్ కోసం 14 లక్షల దరఖాస్తులు

- రాష్ట్రంలో ఇప్పటిదాకా 56 వేల ఇళ్లకే ఏర్పాటు
- వెండర్ల చేతిలో 'పీఎం సూర్యఘర్' విలవిల
- సోలార్ పవర్‌లో నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం సూర్యఘర్' పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ పథకం కింద నివాస సముదాయాలపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుని సౌర శక్తిని విద్యుత్‌గా మార్చుకోవచ్చు. స్వీయ అవసరాలకు వాడుకున్నది పోగా విక్రయించుకునే అవకాశం కూడా ఉంది. ఇక, సోలార్ ప్యానళ్ల కొనుగోలుకు సబ్సిడీ కూడా ఉంది. కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.30 వేలు చొప్పున 3 కిలోవాట్లకు గరిష్ఠంగా రూ.78 వేల సబ్సిడీని కేంద్రం అందిస్తోంది. పథకం మంచిదే అయినా ప్రజలకు సరైన అవగాహన కల్పించకపోవడంతో చాలా రాష్ట్రాల్లో ఈ పథకం నత్తనడకన సాగుతోంది. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దేశంలో ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా రూఫ్‌టాప్ సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. అయినప్పటికీ.. రాష్ట్రంలో ఈ పథకం ఆశించిన స్థాయిలో పుంజుకోవడం లేదు. ఈ నెల 3వ తేదీ వరకు 14,24,773 దరఖాస్తులు అందగా, వీటిలో 56,451 దరఖాస్తులకు మాత్రం మోక్షం కలిగింది.


వెండర్ల మాయాజాలం

సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్ల ఏర్పాటులో వ్యాపారులు కీలకంగా వ్యవహరిస్తారు. అలాంటి కీలక వ్యవస్థను పర్యవేక్షించడంలో నెడ్‌క్యాప్, డిస్కంలు పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. రూ.2 లక్షల బ్యాంకు గ్యారెంటీ చూపిన ప్రతి ఒక్కరూ 'పీఎం సూర్యఘర్ వెబ్‌సైట్‌లో వెండర్‌గా నమోదు కావచ్చు. వీరికి సాంకేతికంగా సామర్థ్యం ఉందా?. ఏదైనా సంస్థకు డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నారా?. వంటి విషయాలను ఏవీ పరిశీలించకుండానే వెండర్‌గా నమోదు చేస్తున్నారు. దీంతో రాజకీయంగా పలుకుబడి ఉన్నవారు రూ.2 లక్షల బ్యాంక్ గ్యారెంటీ చూపి వెండర్లుగా రిజిస్టర్ అవుతున్నారు. సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసిన తర్వాత 5 ఏళ్ల సర్వీసు ఇస్తామని వెండరు గ్యారెంటీ ఇవ్వాలి. ఈ విషయాలను ఎవరూ పరిశీలించడం లేదు. వాటిపై ప్రజలకూ అవగాహన కల్పించడం లేదు. రాష్ట్రంలో 3 డిస్కంలు(సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్) ఉండగా ఒక్కొక్క డిస్కం పరిధిలో 500 నుంచి 1000 మంది వరకు వెండర్లు రిజిస్టర్ అయ్యారు. వీరు స్థానిక నాయకులు, విద్యుత్ ఉద్యోగుల సహకారంతో వినియోగదారులను ప్రభావితం చేసి, తమ సంస్థ సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకునేలా వారితో ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయిస్తున్నారు. ఒక రిజిస్ట్రేషన్‌కి రూ.500 నుంచి 1000 వరకు నేతలకు ముడుపులు ముట్టచెబుతున్నట్టు తెలిసింది. ఇలా ఒక్కొక్క వెండర్ 4000 నుంచి 5000 మంది వినియోగదారులను రిజిస్టర్ చేయిస్తున్నారు. అయితే, ఆ స్థాయిలో వీరి వద్ద సామగ్రి, నిపుణులు లేకపోవడంతో ఇన్‌స్టాలేషన్ చేయలేక చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా పథకం అటకెక్కుతోంది. కొంత మంది వెండర్లు తాము రిజిస్టర్ చేయించిన కనెక్షన్లను వేరే సంస్థలకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. అయితే, ఫలానా సంస్థ రూఫ్‌టాప్ ప్యానల్‌ను ఏర్పాటు చేయించుకునేందుకు అంగీకరించి రిజిస్టర్ అయితే, 40 రోజుల వరకు మారడానికి వీలు లేకపోయినా మార్చేస్తున్నారు.

వెండర్లపై పర్యవేక్షణ శూన్యం

పీఎం సూర్యఘర్ పథకం కింద రిజిస్టర్ అయ్యే వెండర్ల అర్హతలు పరిశీలించే వ్యవస్థ లేదు. ఫలితంగా మాస్కులు, ఫైనాన్స్ వ్యాపారం చేసే వారు కూడా సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తామంటూ వెండర్లుగా రిజిస్టర్ అవుతున్నారు. వీరికి సోలార్ ప్యానళ్ల ఏర్పాటుపై ఎలాంటి శిక్షణ ఉండటం లేదు. మరోవైపు రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్ల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కలిగించే కార్యక్రమాలు కూడా జరగడం లేదు. ఫలితంగా 'పీఎం సూర్యఘర్' పథకం లక్ష్యం నీరుగారుతోంది.

లోకం తీరు



నేడు అక్కడక్కడా పిడుగులతో వానలు

- కోస్తా, సీమల్లో పలుచోట్ల ఈదురుగాలులు

అమరావతి/విశాఖపట్నం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కాగా కృష్ణా, గోదావరి, వంశధార, నాగావళి నదుల లోతట్టు ప్రాంతాల ప్రజలు పూర్తిగా వరదలు తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు రాష్ట్రంలో శనివారం ఎండ, వానతో కూడిన విభిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. దేశంలోనే అత్యధికంగా కావలిలో 38.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 2 రోజుల క్రితం తీరం దాటిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో సముద్రం నుంచి తేమగాలులు వీస్తున్నాయి. దీనికి తోడు ఎండ తీవ్రత కొనసాగడంతో వాతావరణ అనిశ్చితి నెలకొని పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని, మిగిలిన చోట్ల ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా అరేబియా సముద్రంలో 'శక్తి' తుఫాన్ తీవ్ర తుఫాన్‌గా బలపడింది.

రంగా వర్సిటీ విద్యార్థుల సత్తా

- జాతీయ స్థాయి పీజీలో 273 మంది అర్హత

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ విభాగాల్లోని పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఐసీఏఆర్, ఏఐఈఈఏ నిర్వహించిన జాతీయ స్థాయి ప్రవేశపరీక్షలో ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 273 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఈ మేరకు వీసీ శారదా జయలక్ష్మీదేవి శనివారం వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఐసీఏఆర్ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ పరీక్ష నిర్వహించారని తెలిపారు.

రూ.50 లక్షలతో దుర్గమ్మవారికి రథం



దేవిచౌక్ అమ్మవారికి తయారు చేయించిన రథం.. (ఇన్‌సెట్లో)దాత కంబాల శ్రీనివాసరావు

తూర్పుగోదావరి జిల్లా గోకవరంలోని దేవిచౌక్ ఆలయంలో మల్లేశ్వరస్వామి సమేత కనక దుర్గమ్మవారి ఊరేగింపునకు విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు సుమారు రూ.50 లక్షలతో రథం తయారు చేయించారు. దసరా ఉత్సవాల్లో పూజలు చేయించి శనివారం రథాన్ని ఆలయం వద్దకు చేర్చారు. సుమారు ఆరు నెలలపాటు పలువురు శిల్పులు శ్రమించి, 4 టన్నుల టేకు, 4 టన్నుల సోమిది కర్ర, 3 టన్నుల ఇనుముతో రథాన్ని చేయించామని చెప్పారు.

- గోకవరం, ఆంధ్రజ్యోతి

జయహో భవానీ!

- ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భవానీ దీక్షాధారులు
- 1.20 లక్షల మందికి పైగా దుర్గమ్మ దర్శనం



ఇరుముళ్లు సమర్పిస్తున్న భవానీలు

విజయవాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. సాధారణ భక్తుల కంటే అమ్మవారి దీక్ష చేపట్టిన (భవానీ) భక్తులు పెద్ద ఎత్తున దర్శనానికి తరలివస్తున్నారు. శనివారం నుంచి అమ్మవారు కనకదుర్గమ్మగా దర్శనమిస్తుండగా, తెల్లవారుజామున మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 1.20 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. కొండ దిగువన వినాయకుడి ఆలయం నుంచి క్యూలైన్‌లోకి ప్రవేశించిన భక్తులకు దర్శనం పూర్తవ్వడానికి గంట సమయం పడుతోంది. అదే హోల్డింగ్ పాయింట్లలో ఉన్న భక్తులకు దర్శన సమయం ఐదారు గంటలు పడుతోంది. ఇరుముడులతో దర్శనం చేసుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకుని దీక్ష విరమిస్తున్నారు. కాగా, శరన్నవరాత్రులు ప్రారంభం రోజు నుంచి శనివారం సాయంత్రం నాటికి మొత్తం 16 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

నేరం ఇక్కడైతే.. బిహార్ హైకోర్టులో స్టే!

- నా అరెస్టులో సునీల్ కుమార్ కీలక పాత్ర
- కస్టోడియల్ హింస కేసులో అరెస్టు నుంచి బిహార్ హైకోర్టు నుంచి రక్షణ పొందారు
- స్టే రద్దుకు నేను ఇంప్లీడ్ పిటిషన్ వేశా
- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు



గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తనను అక్రమంగా లాకప్‌లో పెట్టి కస్టోడియల్ హింసకు గురి చేసింది ఏపీలో అయితే.. నాటి సీఐడీ డీజీ సునీల్ కుమార్ సంబంధంలేని బిహార్ హైకోర్టులో అరెస్టు నుంచి స్టే తెచ్చుకున్నారని ఆ కేసు బాధితుడు, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు పేర్కొన్నారు. శనివారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడారు. నాటి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌తో పాటు సునీల్‌కుమార్ తనను అరెస్టు చేసిన సమయంలో అక్కడే ఉన్నారన్నారు. తన అరెస్టులో సునీల్ కీలక పాత్ర పోషించారన్నారు. ప్రస్తుతం ఆయన బిహార్ పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆయన అక్కడి హైకోర్టులో ప్రొటెక్షన్ పిటిషన్ దాఖలు చేసి, అరెస్టు నుంచి స్టే తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఆ స్టేను రద్దు చేయాలంటూ సీఐడీ దాఖలు చేసిన కౌంటర్‌లో తాను కూడా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. స్టేను రద్దు చేసే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. చివరకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందన్నారు.

60 రోజులు సభకు రాకుంటే సభ్యత్వం రద్దు

కాగా, ఎవరైనా ఎమ్మెల్యేలు వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరు కాకపోతే వారి సభ్యత్వం ఆటోమేటిక్‌గా రద్దయిపోతుందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మరోమారు స్పష్టం చేశారు.

నిధులిచ్చినా నత్తనడకే!

- పోలవరం నిర్వాసితుల పునరావాసంలో జాప్యంపై కేంద్రం అసంతృప్తి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కేంద్రం నిధులు మంజూరు చేసినా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సహాయ, పునరావాస కార్యక్రమాలు నత్తనడకన సాగుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల దేశవ్యాప్తంగా జాతీయ హోదా కలిగిన ప్రాజెక్టుల సహాయ, పునరావాస కార్యక్రమాల అమలుపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. కేంద్రం నిధులు మంజూరు చేసినా నిర్వాసితులకు సహాయ, పునరావాస కార్యక్రమాలను వేగవంతంగా చేపట్టకపోవడంపై ఆ సమీక్షలో కేంద్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏక మొత్తంగా ఒకే దఫాలో పరిహారం చెల్లించకపోవడం వల్ల ప్రభుత్వంపై నిర్వాసితుల్లో అసహనం పెరుగుతోందనే అభిప్రాయాన్ని కేంద్రం వ్యక్తం చేసింది. విడతల వారీగా పరిహారం చెల్లించడం వల్ల పప్పుబెల్లాల్లా డబ్బులు ఖర్చయిపోయి, ప్రభుత్వం ఇచ్చిన సహాయం ఎందుకూ ఉపయోగపడటం లేదని పేర్కొంది.

తొలిదశలో లక్ష ఎకరాల సేకరణ లక్ష్యం..

పోలవరం సాగునీటి ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల కాంటూరులో 1,00,099 ఎకరాలు అవసరం కాగా.. 91,156 ఎకరాలను సేకరించారు. ఇంకా 8,943 ఎకరాలను సేకరించాల్సి ఉంది. తొలిదశలో 38,060 నిర్వాసిత కుటుంబాలకు సహాయ, పునరావాస కార్యక్రమాలను అమలు చేయాల్సి ఉందని అధికారులు గుర్తించారు. ఇందులో 14,371 మంది నిర్వాసితులను కాలనీల్లోకి తరలించారు. ఇంకా 23,689 కుటుంబాలను తరలించాల్సి ఉంది. వీరిలో ఫేజ్1ఏ కింద 6,575 కుటుంబాలను వచ్చే ఏడాది మార్చి నాటికి, ఫేజ్-1బీ కింద 17,114 కుటుంబాలను 2027 మార్చి నాటికి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని జల వనరుల శాఖ చెబుతోంది. 38,060 కుటుంబాలకు నగదు రూపంలో చెల్లింపులు చేయాల్సి ఉండగా, కేవలం 19,953 కుటుంబాలకే చెల్లించారు. ఇంకా 18,107 కుటుంబాలకు నగదు పరిహారం చెల్లించాల్సి ఉంది. వీరిలో ఫేజ్-1ఏ కింద 1,465 కుటుంబాలకు ఈ ఏడాది చివరినాటికి, ఫేజ్-1బీ కింద 16,642 కుటుంబాలకు 2027 మార్చి నాటికి చెల్లిస్తామని జల వనరుల శాఖ చెబుతోంది. 34,360 ఆర్‌అండ్‌ఆర్ గృహాలు నిర్మించాల్సి ఉండగా 15,439 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 18,921 గృహాలు నిర్మించాల్సి ఉంది. ఇందులో ఫేజ్-1ఏ కింద 2,279 గృహాలను వచ్చే ఏడాది మార్చినాటికి, ఫేజ్1బీ కింద 16,642 గృహాలను 2027 మార్చినాటికి పూర్తి చేస్తామని జల వనరుల శాఖ చెబుతోంది. సహాయ పునరావాసం కింద 75 కాలనీలను నిర్మించాల్సి ఉండగా, అవి కూడా నత్తనడకన సాగుతున్నాయి. పునరావాస కాలనీలు 29 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 46 కాలనీలను నిర్మించాల్సి ఉంది. వాటిలో 42 కాలనీలకు టెండర్లు పిలిచారు. మరో నాలుగు కాలనీలకు ఇంకా టెండర్లనే పిలువలేదు. ఫేజ్-1 కింద సహాయ, పునరావాస కార్యక్రమాలకు రూ.1107.62 కోట్లను చెల్లించాల్సి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.5,052.71 కోట్లను కేంద్రం రెండు విడతలుగా అందించింది. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వ ఖజానా సీఎంఎఫ్ఎస్‌లో వేసింది. ఈ నిధులను రాష్ట్ర ఖజానాకు తరలించడంపై కేంద్రం అసహనం వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టు కోసం ప్రత్యేక ఖాతాను తెరవాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో ప్రత్యేక ఖాతాను తెరిచారు. కేంద్ర నిధుల్లో రూ.1830 కోట్లను పోలవరం ప్రత్యేక ఖాతాకు మళ్లించాలి. ఈ నిధులు మళ్లిస్తే .. భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ఆస్కారం కలుగుతుందని జల వనరుల శాఖ చెబుతోంది.



పోలవరం ప్రాజెక్టు

రేపు పోలవరంపై కేంద్రం సమీక్ష

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం సోమవారం సమీక్ష నిర్వహించనుంది. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఢిల్లీలో ఈ సమీక్ష నిర్వహించనున్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రగతిని పర్యవేక్షిస్తున్న పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) వాస్తవ నివేదికను ఆయనకు అందజేయనుంది. హెడ్‌వర్క్స్ పనులు వేగం పుంజుకున్నప్పటికీ.. భూసేకరణ, సహాయపునరావాస కార్యక్రమాల్లో పురోగతి కనిపించడం లేదని కేంద్రానికి పీపీఏ నివేదించింది. నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని పీపీఏ నివేదికను ఇవ్వడంతో.. ఇదే ప్రధాన అంశంగా పాటిల్ సమీక్ష నిర్వహించనున్నారు. సమీక్షకు హాజరుకావాల్సిందిగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తిలను కోరారు. దీంతో ఈ సమావేశానికి హాజరయ్యేందుకు మంత్రి నిమ్మల బృందం సిద్ధమైంది. పోలవరం ఫేజ్-1లో 41.15 మీటర్ల కాంటూరులో సహాయ పునరావాస కార్యక్రమాలను చేపట్టేందుకు రూ.12,832 కోట్లను వ్యయం చేయాల్సి ఉందని అంచనా వేశారు. ఈ పద్దు కింద ఇంకా రూ.6,609 కోటను వ్యయం చేయాల్సి ఉందని పీపీఏ గణాంకాలు వెల్లడించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలసి.. భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల కోసం అడ్వాన్సుగా నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్టును 2027 డిసెంబరునాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నందున, ఫిబ్రవరి నాటికే సహాయ, పునరావాస కార్యక్రమాలను పూర్తి చేయాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. భూసేకరణకు నిధుల విడుదలపై కేంద్రమంత్రి పాటిల్ ఈ సమీక్షలో ఇచ్చే హామీపై రాష్ట్ర ప్రభుత్వం ఆశలు పెట్టుకుంది.



తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులో వర్షపు నీటి ఉధృతి

తిరుమలలో భారీ వర్షం

తిరుమల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వేకువజాము ఐదు నుంచి ఉదయం 8 గంటల వరకు వర్షం పడటంతో శ్రీవారి దర్శనానికి వెళ్లే వారితో పాటు దర్శనం చేసుకుని వెలుపలకు వచ్చిన వారు తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. మరోవైపు తిరుమలలో చలి పెరిగింది. పెరటాశి మాసం మూడో శనివారం కావడంతో తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. కాగా.. తిరుపతిలో వేకువజాము నుంచి ఉదయం 9 గంటల వరకూ మోస్తరు వాన కురిసింది. ఈస్ట్ పోలీస్ స్టేషన్ పక్కనున్న రైల్వే అండర్ పాస్, అలాగే వెస్ట్ చర్చి సమీపంలోని రైల్వే అండర్ పాస్‌లు నీట మునిగి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లక్ష్మీపురం కూడలి నుంచి ఎయిర్ బైపాస్ రోడ్డు వరకూ రోడ్డు జలమయమైంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షాలు కురిశాయి.

ఐఎన్ఎస్ కళింగలో గన్ మిస్‌ఫైర్

- గుంటూరు జిల్లాకు చెందిన గార్డు మృతి



బాజీ బాబా

భీమునిపట్నం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమిలి బీచ్ రోడ్డులో నేరేళ్లవలస వద్ద ఉన్న ఐఎన్ఎస్ కళింగ(నౌకా కేంద్రం)లో గన్ మిస్ ఫైర్ కావడంతో సెక్యూరిటీ గార్డు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లాకు చెందిన షేక్ బాజీ బాబా(44) ఐఎన్ఎస్ కళింగలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. శనివారం ఉదయం డ్యూటీలో ఉండగా ప్రమాదవశాత్తూ గన్ మిస్‌ఫైర్ అయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాజీని కళింగలోనే ఉన్న ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. నేవల్ ఆఫీసరు వికాస్ కుమార్ పోలీసులకు సమాచారం అందించడంతో నార్త్ ఏసీపీ అప్పలరాజు, భీమిలి సీఐ తిరుమలరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అన్న సంతర్పణలో తోపులాట

- గంజి పడి 20 మందికి గాయాలు
- క్షతగాత్రులకు కేజీహెచ్‌లో చికిత్స



గాయపడిన బాలిక

మహారాణిపేట (విశాఖపట్నం), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్న సంతర్పణ సమయంలో తోపులాట చోటుచేసుకోవడంతో పక్కనే ఉడుకుతున్న అన్నం గంజిపడి ఇరవై మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులకు కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నంలోని కలెక్టరేట్ జంక్షన్ నుంచి రెల్లివీధికి వెళ్లే రహదారిలో కొత్తజాలరిపేట వద్ద దసరా ఉత్సవాలలో భాగంగా శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. భోజనాల కోసం క్యూలైన్‌లో తోపులాట జరగడంతో పక్కనే ఉడుకుతున్న పెద్ద అన్నం గిన్నె ఒలికిపోయింది. అందులోని గంజి క్యూలో ఉన్న పిల్లలు, మహిళలపై పడింది. దీంతో 13 మంది పిల్లలు, ఏడుగురు పెద్దలు గాయపడ్డారు. వారిని వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రులను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి సూచించారు. కాగా.. చిన్నారులు గాయపడిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌తో మాట్లాడి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ఐఈడీ పేలి మహిళా మావోయిస్టుకు గాయాలు

చింతూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా సరిహద్దులో పోలీసులే లక్ష్యంగా ఐఈడీలు అమర్చుతున్న క్రమంలో అవి పేలడంతో ఓ మహిళా మావోయిస్టు తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన శనివారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బందేపార గ్రామ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఐఈడీ పేలుడులో గుజ్జమ్మ కుడి కాలికి తీవ్ర గాయం కావటంతో, సహచరులు ఆమెను అక్కడే వదిలి వెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గుజ్జమ్మను చికిత్స నిమిత్తం బీజాపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె మావోయిస్టు పార్టీ మద్దేడ్ ఏరియా కమిటీ ఏసీఎంగా పనిచేస్తోంది.

ఫ్యాప్టో ధర్నాకు ఏపీసీపీఎస్ఈఏ మద్దతు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు, ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఫ్యాప్టో) ఈ నెల 7న చేపట్టిన రాష్ట్ర స్థాయి ధర్నాకి ఏపీసీపీఎస్ఈఏ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీష్, సీఎం దాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాప్టో ధర్నా కార్యక్రమాల్లో ఏపీసీపీఎస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ధర్నాలో పాల్గొన్న డాక్టర్లు

డిమాండ్ల సాధనకు పీహెచ్‌సీ వైద్యుల ధర్నా

- ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

విజయవాడ (ధర్నాచౌక్), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్‌లను తక్షణమే అమలు చేయాలని ప్రైమరీ హెల్త్ సెంటర్లలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో శనివారం వారు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అస్పష్టమైన విధానాలు, తరచూ మారే ఆదేశాలు, జీవోలు, అర్జెంట్ రివ్యూలు, ఇతర విభాగాల జోక్యంతో గ్రామీణ వైద్యులపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. అనేకసార్లు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో గత 10 రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం నుంచి నిరాహార దీక్ష చేపడతామని స్పష్టం చేశారు.

డిమాండ్లు పరిష్కరిస్తాం

- ముందు విధుల్లో చేరండి: మంత్రి సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. గత నెల 28వ తేదీ నుంచి వైద్యులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఇన్ సర్వీస్ కోటా, ఉద్యోగ సర్వీస్ డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. టైం బౌండ్ పదోన్నతులు, ఇతర డిమాండ్ల గురించి చర్చించి, ప్రభుత్వానికి సిఫారసులు చేసేందుకు ప్రత్యేక కమిటీ వేశామన్నారు. ఆమోదయోగ్యమైన డిమాండ్లను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి తగిన నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. ముందుగా.. ఆందోళన చేస్తూ ఆస్పత్రులకు దూరంగా ఉంటున్న వైద్యులు విధుల్లో చేరాలని మంత్రి కోరారు.

స్వస్థ నారీ సశక్త్‌లో 57.11 లక్షల మందికి వైద్యం

- వెల్లడించిన మంత్రి సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ప్రత్యేక శిబిరాల ద్వారా 57.11 లక్షల మంది మహిళలు, చిన్నారులు, వైద్య సేవలు పొందారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 17న ప్రధాని మోదీ మధ్యప్రదేశ్‌లో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నినాదంతో ప్రారంభించిన వైద్య శిబిరాలు గురువారం వరకు జరిగాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు మన రాష్ట్రంలో 26 జిల్లాల్లో కలిపి 16 రోజుల వ్యవధిలో 25,192 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు వివరించారు. రాష్ట్రంలో నిర్వహించిన శిబిరాల ద్వారా ప్రధానంగా 12 లక్షల మందికి బీపీ నిర్ధారణ పరీక్షలు, 11 లక్షల మందికి మధుమేహ పరీక్షలు, 9 లక్షల మందికి హిమోగ్లోబిన్ పరీక్షలతో పాటు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. అలానే 83,451 మందికి వ్యాక్సినేషన్ చేసినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

శాసనసభలో తాను సైకోగాడు అన్న జగన్మోహన్‌రెడ్డి ఒకప్పుడు కడప జిల్లా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు అన్న విషయం బాలకృష్ణ మర్చిపోయారేమో తెలియదు. బాలకృష్ణ తన మానసిక పరిస్థితి సరిగా లేదని వైద్యుల నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్నారని విమర్శిస్తున్న వైసీపీ నాయకులు, ఒకప్పుడు అదే బాలకృష్ణ అభిమాన సంఘానికి తమ నాయకుడు జగన్ అధ్యక్షుడుగా ఉన్న విషయం తెలుసుకోవాలి కదా? అయితే ఒక విషయం మాత్రం వాస్తవం. కాల్పుల సంఘటనలో బాలకృష్ణను కాపాడింది మాత్రం నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డే. బాలకృష్ణ స్వయంగా కాల్పులు జరిపారని నాటి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆర్పీసింగ్ విచారణ నివేదికను ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి అందజేయగా, 'వదిలేయండయ్యా – రాజకీయంగా కక్ష సాధించాలనుకోవడం లేదు. ఎంత కాదనుకున్నా అతను ఎన్టీఆర్ కుమారుడు' అని అప్పుడు పోలీసు అధికారుల వద్ద రాజశేఖరరెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటిలాగా అప్పుడు కులాల కుంపట్లు ఇంతలా లేవు కనుక రాజశేఖరరెడ్డి ఉదారంగా వ్యవహరించగలిగారు.

నటులు కులదైవాలా..!

ఇద్దరు సినిమా వాళ్ల మధ్య ఎప్పటి నుంచో ఉన్న వైషమ్యాల నేపథ్యంలో శాసనసభలో చోటుచేసుకున్న ఒక సంఘటన... ఆంధ్రప్రదేశ్‌లో మరో సమస్యే లేనట్టుగా అదే ప్రధాన సమస్యగా మారడమేమిటి? శాసనసభలో చోటుచేసుకున్న సంభాషణలను రికార్డుల నుంచి తొలగించినా అదే అంశాన్ని పట్టుకొని వేలాడటమేమిటి? హవ్వ... నవ్విపోదురుగాక! ఈ ఎపిసోడ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిస్థితి చూస్తే జాలేస్తుంది. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్నట్టుగా ఆయన నలిగిపోతున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని విడిగా చూడలేం. ఆంధ్రప్రదేశ్‌ను పట్టి పీడిస్తున్న కుల జాడ్యం వల్ల సమస్య కానిది కూడా సమస్యగా మారుతోంది. నిజానికి శాసనసభలో ఆ రోజు తెలుగుదేశం సభ్యుడు నందమూరి బాలకృష్ణ అన్న మాటలను కాదు – నిండు సభలో ఆయన ప్రవర్తించిన తీరును తప్పు పట్టాలి. బాలకృష్ణ శాసనసభకు ఎన్నికవడం ఇది మొదటిసారి కాదు. మూడో పర్యాయం. సభ మర్యాదల గురించి ఆయనకు తెలియదని అనుకోగలమా? చలువ కళ్లద్దాలను తలపైకి నెట్టి, రెండు జేబులలో చేతులు పెట్టుకొని ఆయన మాట్లాడటం సభా మర్యాదలను ఉల్లంఘించడమే! ఒకప్పుడు సభ్యుడు ఎవరైనా ఇలా ప్రవర్తించి ఉంటే సభాపతి తీవ్రంగా మందలించి ఉండేవారు. గతంలో సభ్యులు సభలో వార్తా పత్రికలు చదవడాన్ని కూడా సభాపతులు అనుమతించేవారు కాదు. ఇప్పుడా మర్యాదలు, సంప్రదాయాలు గాలికి పోయాయి. ఎన్టీఆర్ అంతటి వారు కూడా తను వాడిన మాటలకు సభలో ఇబ్బంది పడాల్సి వచ్చింది. చివరకు శాసనసభను బహిష్కరించాల్సిన తీవ్ర నిర్ణయాన్ని అప్పుడు ఆయన తీసుకున్నారు. ఆ రోజు కాంగ్రెస్ సభ్యురాలు నన్నపనేని రాజకుమారి ఎన్టీఆర్‌ను విమర్శిస్తూ ఒక కాగితం చూపించారు. 1983లో తన పార్టీ తరఫున తొలిసారి నెగ్గి ఎమ్మెల్యే అయిన రాజకుమారి సభలో తనను విమర్శించడాన్ని జీర్ణించుకోలేని ఎన్టీఆర్ 'ఆ కాగితాన్ని మడిచి...' అని ఇంకేదో అన్నారు. అంతే, అధికార కాంగ్రెస్ సభ్యులు ఆయనపై విరుచుకుపడ్డారు. క్షమాపణలు చెప్పాలని కోరారు. దీంతో అహం దెబ్బతిన్న ఎన్టీఆర్ విసవిసా నడుచుకుంటూ సభాపతి స్థానం వద్దకు వెళ్లి తన భుజంపై ఉన్న కండువాను పోడియంపై పెట్టి తన స్థానం వద్దకు వెళ్లి, తనకు జరిగిన అవమానానికి నిరసనగా శాసనసభను బహిష్కరిస్తున్నానని ప్రకటించి సభ నుంచి వెళ్లిపోయారు. నిజానికి ఎన్టీఆర్ అంత తీవ్ర నిర్ణయం తీసుకుంటారని తెలుగుదేశం పార్టీ వారెవరికీ తెలియదు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ఎన్టీఆర్ సభకు హాజరు కాకూడదని నిర్ణయించుకోవడంతో చంద్రబాబు నాయుడే ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించారు. ఇది గతం! సభలో పాటించవలసిన నియమాలు, సంప్రదాయాలకు అప్పట్లో అంత విలువ ఉండేది. కాలక్రమంలో సభాపతులు తమ పట్టు కోల్పోతూ వచ్చారు. ముఖ్యమంత్రుల కనుసన్నల్లో పనిచేయడానికి అలవాటుపడ్డారు. ఇప్పుడు అసలు విషయానికి వద్దాం!

ఏమిటీ వివాదం...

నందమూరి బాలకృష్ణ ఆ రోజు చిరంజీవిని ఏమన్నారో స్పష్టత లేదు. కానీ... మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత సభలో సభ్యుడైన జగన్మోహన్‌రెడ్డిని మాత్రం పరోక్షంగా సైకోగాడు అని బాలకృష్ణ వ్యాఖ్యానించారు. నిండు సభలో సహచర సభ్యుడిని సైకోగాడు అనడం, కళ్లజోడును తలపైకి నెట్టుకొని, జేబుల్లో చేతులు పెట్టుకొని మాట్లాడటం కచ్చితంగా అభ్యంతరకరమే. సభాపతి స్థానంలో ఉండిన ఉప సభాపతి రఘురామ కృష్ణ రాజు కూడా దీనిపై అభ్యంతరం చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు. సభా నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు అయినా చొరవ తీసుకొని బాలకృష్ణను సరిదిద్ది ఉండవలసింది. ఇవేమీ జరగకపోగా చిరంజీవిని ఉద్దేశించి బాలకృష్ణ అవమానకరంగా మాట్లాడినట్టుగా ప్రచారం జరిగింది. ఇంకేముందీ, కులాల కుంపట్లు రాజుకున్నాయి. మెగాస్టార్ చిరంజీవికి మద్దతుగా ఆయన అభిమానులు, బాలకృష్ణకు మద్దతుగా ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోయారు. చిరంజీవి తరఫున మాట్లాడిన కొందరైతే ఆయనను ఏమైనా అంటే చంపేస్తామని హెచ్చరించేదాకా ఆవేశపడిపోయారు. కమ్మ–కాపు కులాల మధ్య కుంపట్లు రాజుకోవడంతో ఆ మంటల్లో చలి కాచుకొనే ప్రయత్నాన్ని వైసీపీ వాళ్లు చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వంలోనూ, కూటమిలోనూ తాము ఆరాధించే పవన్ కల్యాణ్‌ది ప్రధాన పాత్ర అయినందున కాపులు ఆక్రోశపడ్డారు. ప్రతిగా కమ్మవాళ్లు కూడా స్పందించారు. ఈ రెండు కులాలనూ విడదీస్తే రాజకీయంగా లాభిస్తుందని భావించిన వైసీపీ నాయకులు తెర వెనుక నుంచి కాపులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సినిమా వేరు– రాజకీయం వేరు అన్నది మరుగున పడింది. ఆంధ్రప్రదేశ్‌లో చాలా కాలం నుంచి రాజకీయాలు, సినిమా కలగాపులగం అయ్యాయి. అదే సమయంలో అధికారం కోసం, ఆధిపత్యం కోసం మూడు కులాల మధ్య పోరాటం మొదలైంది. రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీపై రెడ్ల పార్టీగా ముద్రపడలేదు. కాకపోతే అధిక శాతం రెడ్లు ఆ పార్టీకి మద్దతు పలికేవారు. జగన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకున్న తర్వాత రెడ్లు ఆయనను సొంతం చేసుకున్నారు. అదే సమయంలో మెజారిటీ క్రైస్తవులు కూడా జగన్‌ను తమ సొంతం అనుకున్నారు. తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించిన నాటి నుంచి కమ్మ వాళ్లు ఆ పార్టీని తమ సొంత పార్టీగా భావించడం మొదలుపెట్టారు. పార్టీ నాయకత్వం చంద్రబాబు నాయుడి చేతుల్లోకి వచ్చిన తర్వాత ఆయన తనపై కుల ముద్ర పడకుండా జాగ్రత్త పడ్డారు. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని ప్రారంభించారు. అనుభవరాహిత్యంతోపాటు ఇతరత్రా కారణాల వల్ల రాజకీయంగా ఆయన విఫలమయ్యారు. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి క్రమంగా రాజకీయాలకు దూరం జరిగారు. కమ్మ, రెడ్లతో పోల్చితే సంఖ్యా బలం అధికంగా ఉన్న కాపులను ఈ పరిణామం నిరాశపరిచింది. తమ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి పదవి దక్కకపోవడమేమిటి? అని మదనపడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ జనసేన పార్టీని ప్రారంభించారు. దీంతో కాపులలో మళ్లీ ఆశలు చిగురించాయి. పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చూడాలన్న కాంక్ష వారిలో మళ్లీ చిగురించింది. అయితే 2019 ఎన్నికల్లో సొంతంగా పోటీకి దిగిన జనసేన పార్టీకి కేవలం ఒక్క సీటే లభించింది. రెండు స్థానాల్లో పోటీ చేసిన పవన్ కల్యాణ్ సైతం రెండు చోట్లా ఓడిపోయారు. అయినా ఆయన నిరాశ చెందకుండా పార్టీని కొనసాగించారు. దురదృష్టవశాత్తు ఆయన అభిమానుల వ్యాఖ్యలు, ప్రవర్తన కారణంగా జనసేన అంటే కాపుల పార్టీగా ముద్రపడింది. అదే సమయంలో ముఖ్యమంత్రిగా ఉండిన జగన్మోహన్‌రెడ్డి కమ్మ కులస్తులను ద్వేషించడంతోపాటు ఆ కులానికి చెందిన ప్రముఖులను వేధించడంతో ఆ సామాజిక వర్గం వారంతా గంపగుత్తగా తెలుగుదేశం పార్టీకి జైకొట్టారు. తన బలం–బలహీనత గుర్తించిన పవన్ కల్యాణ్ తెలుగుదేశం పార్టీతో జతకట్టారు. చంద్రబాబుకు కూడా ఈ పొత్తు అనివార్యం అయింది. భారతీయ జనతా పార్టీ కూడా చేతులు కలపడంతో మూడు పార్టీలూ ఎన్డీయే కూటమిగా ఎన్నికలకు వెళ్లాయి. ఆ తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరస్పరం గౌరవించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఒకరకంగా వారిరువురికీ ఇది ఒక రాజకీయ అనివార్యత. ఈ తరుణంలో బాలకృష్ణ వ్యాఖ్యలు సరికొత్త వివాదాన్ని తెరమీదకు తెచ్చాయి. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి సినిమా పరిశ్రమలో కష్టపడి పైకి వచ్చిన చిరంజీవిని అవమానించారని పవన్ కల్యాణ్ సైతం ఎన్నో సందర్భాలలో అన్నారు. ఇప్పుడు ఏర్పడిన తాజా వివాదంతో.. 'ఆ రోజు ఏమీ జరగలేదు. జగన్‌రెడ్డి మమ్మల్ని బాగా చూసుకున్నారు' అని కొంత మంది జగన్ తరఫున వకల్తా పుచ్చుకొని మాట్లాడారు. అప్పట్లో జగన్‌రెడ్డి తన పట్ల అమర్యాదగా ప్రవర్తించి ఉండకపోతే కనీసం చిరంజీవి అయినా అప్పుడే స్పష్టం చేసి ఉండాల్సింది. అదేమీ జరగకపోవడంతో చిరంజీవికి అవమానం జరిగిందనే అందరూ భావించారు.

కుటుంబాలు... కులాల కుంపట్లు...

ఈ విషయం అలా ఉంచితే, ముఖ్యమంత్రి కుర్చీకోసం మూడు కులాల మధ్య మొదలైన ఆధిపత్య పోరు ఇప్పుడు మూడు కుటుంబాల మధ్య కేంద్రీకృతం అయింది. మెజారిటీ రెడ్లు, క్రైస్తవులు, ఎక్కువ మంది ముస్లింలు వైఎస్ రాజశేఖర రెడ్డి వారసుడిగా జగన్మోహన్‌రెడ్డిని మాత్రమే గుర్తించారు. రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిలను కూడా వారు ఆయన రాజకీయ వారసురాలిగా గుర్తించడం లేదు. ప్రతిగా కమ్మవారు నారా చంద్రబాబు కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు. కాపులు తమ సామాజిక వర్గానికి ఏకైక ప్రతినిధిగా కొణిదల కుటుంబాన్ని తలకెత్తుకున్నారు. నిజానికి ఈ మూడు సామాజిక వర్గాలలో రాజకీయంగా ఎందరో ఉద్దండులు ఉండేవారు. ఉన్నారు కూడా! రెడ్లలో నాయకులకు కొదవ లేదు. అయినా జగన్‌రెడ్డి రంగప్రవేశంతో వారంతా ద్వితీయ శ్రేణి నాయకులుగానే ఉండిపోవాల్సిన పరిస్థితి. కాపుల విషయంలో కూడా

> **చట్టాలు మాత్రమే ప్రామాణికం... కులాలు కాదు. మహా అయితే రిజర్వేషన్లు పొందడం వరకే ఈ వెసులుబాట్లు. రిజర్వేషన్ ప్రకారం లబ్ధి పొందిన వారికి ఆ తర్వాత మినహాయింపులు ఉండవు. ఎవరికి వారు తమ మనోభావాలు దెబ్బతిన్నాయని యాగీ చేస్తే ఆ మాటున నేరస్తులు తప్పించుకోరా? అదే జరిగితే సమాజం మనోభావాల పరిస్థితి ఏమిటి?**

ఇదే జరిగింది. నిజానికి కొణిదల కుటుంబంలో ఎవరికీ రాజకీయ అనుభవం లేదు. రాజకీయంగా మూడు నాలుగు దశాబ్దాల అనుభవం కలిగిన నాయకులు ఎందరో కాపుల్లో ఉన్నారు. అయితే చిరంజీవి కుటుంబ రంగప్రవేశంతో వారంతా వెనుకబడిపోయారు. కాపులు తమ నాయకుడిగా పవన్ కల్యాణ్‌ను మాత్రమే చూసుకోవడంతో చేసేదేమీ లేక ద్వితీయ స్థాయి నాయకులుగా ఉండిపోవడానికి వారంతా సిద్ధపడ్డారు. అధికారం కోసం ఈ మూడు కుటుంబాల మధ్య మొదలైన పోరు కులాల కుంపట్లను రాజేస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత మాత్రాన సగటు కమ్మవారికి ఒరిగేదేమిటి? అలాగే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే రెడ్లు అందరూ లాభపడరు కదా? పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అయితే కాపులలో పేదరికం అమాంతం పోదు కదా? ఈ విజ్ఞత లేకపోవడంతో ప్రతిదీ వివాదమవుతోంది. సామాజిక కోణంలో సమస్య అవుతోంది. విచిత్రం ఏమిటంటే, ఈ మూడు సామాజిక వర్గాలలో కులాంతర వివాహాలు జరుగుతుంటాయి. కాపులు రెడ్డి–కమ్మలను పెళ్లి చేసుకుంటున్నారు. కమ్మ వాళ్లు రెడ్డి–కాపులను చేసుకుంటున్నారు. రెడ్లు కూడా అంతే. వియ్యం అందుకోవడానికి లేని అభ్యంతరం కలసి మెలసి సాగిపోవడానికి ఎందుకో అర్థం కాని విషయం. ఈ మూడు కుటుంబాలకు చెందినవారు ఇతర కులాల మద్దతు లేకుండా అధికారంలోకి రాగలరా? కడుపు నింపని కులం కోసం, ఈ మూడు కుటుంబాల కోసం కొట్టుకోవడాన్ని ఏమనాలి?

అనవసరమైన వివాదం...

బాలకృష్ణకు సందర్భ శుద్ధి తక్కువని పలువురు అభిప్రాయపడుతుంటారు. ఆయన ఎప్పుడు ఏం మాట్లాడతారో ఊహించడం కష్టం. ఆయన వ్యాఖ్యలు తన అభిమానులకు నచ్చవచ్చునుగానీ ఇతరులకు ఎందుకు నచ్చుతాయి?

> **అన్ని విధాలా అధోగతి పాలైన రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు అవసరానికి మించి కేంద్రం వద్ద వినయ విధేయతలు ప్రదర్శిస్తూ రాష్ట్రానికి మేలు చేసే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబుకు బాలకృష్ణ వంటి వారు అనవసర వివాదాలను తలకు చుడుతున్నారు. సొంత పార్టీ నాయకులతో పాటు కూటమికి చెందిన వారి వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలను చల్లార్చేందుకు ఆయన ఫైర్ ఫైటర్ పాత్ర పోషించవలసి వస్తోంది. బాలకృష్ణ వల్ల తలెత్తిన వివాదం రాజుకోకుండా ఉండేందుకు జ్వరంతో బాధపడుతున్న పవన్ కల్యాణ్ ఇంటికి పరామర్శ పేరుతో చంద్రబాబు వెళ్లి గంటకు పైగా గడిపారని ప్రచారంలో ఉంది. కాగా, ఆయన చిరంజీవికి కూడా ఫోన్ చేసి సముదాయించి ఉంటారన్న ప్రచారం కూడా జరుగుతోంది. మాట తూలే ముందు సంయమనం పాటిస్తే బాలకృష్ణకే గౌరవం పెరుగుతుంది. శాసనసభలో ఏక వచనంతో ఎవరినీ సంబోధించకూడదు. అది తెలుసో లేదో తెలియదుగానీ బాలకృష్ణ 'వాడు వీడు' అన్న పదాలను వాడారు. ఇది తప్పు అని ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా స్పీకర్ అయ్యన్నపాత్రుడైనా బాలకృష్ణకు చెప్పాలి. నటుడిగా బాలకృష్ణ వ్యవహార శైలి వల్ల లాభమైనా నష్టమైనా ఆయన మాత్రమే అనుభవిస్తారు. శాసనసభ్యుడిగా ఉన్నంత కాలం నా ఇష్టం అంటే కుదరదు. సభా సంప్రదాయాలకు, విలువలకు ఆయన కట్టుబడి ఉండాల్సిందే.**

కూటమి నుంచి జన సేనానిని విడదీయాలని వైసీపీ ప్రయత్నిస్తున్న విషయం తెలిసి కూడా బాలకృష్ణ వివాదానికి తావిచ్చి ఉండవలసింది కాదు. చిరంజీవి అయినా, బాలకృష్ణ అయినా ప్రజలు వారిని అభిమానించేది సినిమా నటులుగానే. అంతకు మించి మహా నాయకులు అని కాదు. 2014 ఎన్నికల్లో చిరంజీవి స్వయంగా ప్రచారం చేసినా ఆయనను చూడ్డానికి ప్రజలు ఆసక్తి కూడా చూపలేదు. తెలుగుదేశం పార్టీ లేకుండా బాలకృష్ణ సైతం సొంతంగా పోటీ చేసి గెలవలేరు. ఇలాంటి పరిమితుల గురించి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు బాగా తెలుసు. అందుకే వారు సంయమనం పాటిస్తున్నారు. చిరంజీవి అభిమానులు విమర్శలు చేస్తున్నప్పటికీ పవన్ కల్యాణ్ నోరు విప్పకపోవడానికి కారణం అదే కావొచ్చు. వంశాల గురించి, కుటుంబాల గురించి అభిమానులనేవారు మాట్లాడటం సమర్థనీయం కాదు. అభిమానులను ఉత్సాహపరిచేందుకు మాటల రచయితలు ఆయా నటులకు అనుగుణంగా కొన్ని డైలాగులు రాస్తుంటారు. అవే నిజమనుకుంటే ఎలా? ఎన్టీఆర్ కష్టపడి చిత్రసీమలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఎన్టీఆర్‌కు పూర్వం నందమూరి వంశం గురించి చెప్పమంటే ఏం చెప్పగలరు? అక్కినేని నాగేశ్వరరావు కూడా కష్టపడే సినిమా రంగంలో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకున్నారు. ఆయనకంటే ముందు అక్కినేని వంశం ఏమిటి? ఇక చిరంజీవి విషయానికి వస్తే, సినిమా రంగంలో కమ్మ సామాజిక వర్గం ఆధిపత్యం ఉన్న రోజుల్లోనే ఆయన నిలదొక్కుకున్నారు. కఠోర శ్రమకు అల్లు రామలింగయ్య కుటుంబ సహాయ సహకారాలు తోడవడంతో చిత్రపరిశ్రమలో ఆయన తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎన్టీఆర్, ఏఎన్ఆర్ పరమపదించిన తర్వాత, ముఖ్యంగా దాసరి నారాయణరావు మరణం తర్వాత చిరంజీవి సినిమా పరిశ్రమకు పెద్దగా ఎదిగారు. ఇదంతా ఆయన స్వయంకృషి అని చెప్పవచ్చు. అంతకు ముందు కొణిదల వంశం చరిత్ర ఏమిటి? చిరంజీవి పుణ్యమా అని ఆయన కుటుంబానికి చెందిన పలువురు సినిమా రంగంలో నిలదొక్కుకున్నారు. కేవలం తమ కులం వారి మద్దతుతోనే ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి గానీ మరొకరు గానీ ఆ స్థాయికి ఎదగరు. ప్రేక్షకులు వారిని అందరివారిగానే చూసి ఆదరించారు. అప్పట్లో లేని గొడవలు ఇప్పుడు ఎందుకు? సినిమా బాగా లేకపోతే కులపోళ్లు మాత్రమే సదరు సినిమాను ఆడించలేరు కదా? ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి, బాలకృష్ణకు ఎన్ని ఫెయిల్యూర్స్ లేవు? పవన్ కల్యాణ్ సినిమాలు సైతం ఎన్ని ఫెయిల్ కాలేదు? ఇక్కడొక విషయం చెప్పుకోవాలి. శాసనసభలో తాను సైకోగాడు అన్న జగన్మోహన్‌రెడ్డి ఒకప్పుడు కడప జిల్లా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు అన్న విషయం బాలకృష్ణ మర్చిపోయారేమో తెలియదు. బాలకృష్ణ తన మానసిక పరిస్థితి సరిగా లేదని వైద్యుల నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్నారని విమర్శిస్తున్న వైసీపీ నాయకులు, ఒకప్పుడు అదే బాలకృష్ణ అభిమాన సంఘానికి తమ నాయకుడు జగన్ అధ్యక్షుడుగా ఉన్న విషయం తెలుసుకోవాలి కదా? అయితే ఒక విషయం మాత్రం వాస్తవం. కాల్పుల సంఘటనలో బాలకృష్ణను కాపాడింది మాత్రం నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డే. బాలకృష్ణ స్వయంగా కాల్పులు జరిపారని నాటి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆర్పీసింగ్ విచారణ నివేదికను ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి అందజేయగా, 'వదిలేయండయ్యా – రాజకీయంగా కక్ష సాధించాలనుకోవడం లేదు. ఎంత కాదనుకున్నా అతను ఎన్టీఆర్ కుమారుడు' అని అప్పుడు పోలీసు అధికారుల వద్ద రాజశేఖరరెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటిలాగా అప్పుడు కులాల కుంపట్లు ఇంతలా లేవు కనుక రాజశేఖరరెడ్డి ఉదారంగా వ్యవహరించగలిగారు. బాలకృష్ణను మాత్రమే కాదు– ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న మాజీ ఎంపీ కే.కేశవరావు కుమారుడు కాల్పులకు తెగబడిన సందర్భంలో కూడా రాజశేఖరరెడ్డే రక్షించారు. నేరం చేశారని తెలిసి కూడా వదిలేయడం మంచిదా? కాదా? అన్నది వేరే విషయం.



మారిన రాజకీయాలు...

రాజకీయాల్లో కక్ష సాధింపులు ఉండకూడదని అప్పట్లో అనుకొనేవారు. ఇప్పుడు కక్ష సాధింపు రాజకీయాలే ప్రథమ ప్రాధాన్యం అవుతున్నాయి. ఈ క్రమంలోనే కులతత్వం పెచ్చరిల్లుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇవాళ పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్య ఈ కుల తత్వమే. ఇది ఎంత దూరం వెళుతోందంటే, తప్పు చేసినవాళ్లు తమ కులపోళ్లు అయితే చాలు, వారికి అండగా ఆయా కులాలు నిలబడుతున్నాయి. అలాంటప్పుడు చట్టాలు ఎందుకు? చట్టం దృష్టిలో ఏ కులం వారికి కూడా మినహాయింపు ఉండదు కదా? ఉండాలి అనుకోవడమే నేటి వింత ధోరణి. మంత్రి నారాయణ, ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి సంబంధించిన ఒక వార్తను ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. వారు ఇరువురూ కాపులు కనుక తమ కులం వారి మనోభావాలు దెబ్బతిన్నాయని ఆ కులానికి చెందిన కొందరు నాయకులు ప్రకటనలు జారీ చేశారు. ఇదే శ్రీలక్ష్మి వాడే విగ్గులు, కట్టుకొనే చీరల గురించి మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి అనేక విమర్శలు చేశారు. అప్పుడు కాపుల మనోభావాలు ఎందుకు గాయపడలేదు? శ్రీలక్ష్మి కాపు కులానికి చెందినవారు కాబట్టి ఆమెను ఐఏఎస్‌కు ఎంపిక చేయలేదు. ప్రతిభ ఆధారంగా ఆమె ఎంపికయ్యారు. తప్పొప్పులకు ఆమె చట్ట ప్రకారం బాధ్యత వహించాలి. అలాగే మంత్రి నారాయణ విషయమే తీసుకుందాం! నెల్లూరు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఆయన గెలుపొందారు. కాపులు మాత్రమే ఓటేసి నన్ను గెలిపించండి అని ఆయన ఎన్నికల సందర్భంగా కోరలేదు కదా? అన్ని వర్గాల వారు ఓటు వేస్తేనే కదా ఆయన ఎన్నికైంది! సామాజిక న్యాయం పాటించడం వేరు. కులాలను అడ్డుపెట్టి తప్పుచేసిన వారిని కాపాడాలనుకోవడం వేరు. సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలు ఉండకూడదనే మన పెద్దలు రాజ్యాంగ పరంగా, చట్టపరంగా వెసులుబాటు కల్పించారు. ఈ వెసులుబాటు తప్పు చేసి తప్పించుకోవడానికి కాదు. కులాలను ముందు పెట్టి తప్పు చేసిన వారిని సమర్థించే ప్రయత్నం చేస్తున్నవారు ఈ వాస్తవాన్ని తెలుసుకోవాలి. చట్టాలు మాత్రమే ప్రామాణికం... కులాలు కాదు. మహా అయితే రిజర్వేషన్లు పొందడం వరకే ఈ వెసులుబాట్లు. రిజర్వేషన్ ప్రకారం లబ్ధి పొందిన వారికి ఆ తర్వాత మినహాయింపులు ఉండవు. ఎవరికి వారు తమ మనోభావాలు దెబ్బతిన్నాయని యాగీ చేస్తే ఆ మాటున నేరస్తులు తప్పించుకోరా? అదే జరిగితే సమాజం మనోభావాల పరిస్థితి ఏమిటి? చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి, పవన్ కల్యాణ్ – వీరిలో ఎవరైనా తమ కులం వారి ఓట్లతో మాత్రమే గెలిచి రాజకీయాలు చేయగలరా? ప్రజారాజ్యం స్థాపించిన చిరంజీవి 2009లో పాలకొల్లు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో పాలకొల్లులో ఉన్నంత సంఖ్యలో కాపులు మరే నియోజకవర్గంలోనూ లేరు. అయినా చిరంజీవి ఎందుకు ఓడిపోయారు? కులాల పేరు చెప్పి కొంత వరకు ప్రయోజనం పొందగలరు కానీ అంతిమ లక్ష్యం నెరవేర్చుకోలేరు. అన్ని వర్గాల మద్దతు చూరగొన్న వాళ్లే రాజకీయాలలో అయినా సినిమా రంగంలో అయినా సక్సెస్ అవుతారు.

ఆయనకు చెప్పాలి...

తాజా ఎపిసోడ్ చూస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు పట్ల జాలి కలగక మానదు. అన్ని విధాలా అధోగతి పాలైన రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు అవసరానికి మించి కేంద్రం వద్ద వినయ విధేయతలు ప్రదర్శిస్తూ రాష్ట్రానికి మేలు చేసే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబుకు బాలకృష్ణ వంటి వారు అనవసర వివాదాలను తలకు చుడుతున్నారు. సొంత పార్టీ నాయకులతో పాటు కూటమికి చెందిన వారి వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలను చల్లార్చేందుకు ఆయన ఫైర్ ఫైటర్ పాత్ర పోషించవలసి వస్తోంది. బాలకృష్ణ వల్ల తలెత్తిన వివాదం రాజుకోకుండా ఉండేందుకు జ్వరంతో బాధపడుతున్న పవన్ కల్యాణ్ ఇంటికి పరామర్శ పేరుతో చంద్రబాబు వెళ్లి గంటకు పైగా గడిపారని ప్రచారంలో ఉంది. కాగా, ఆయన చిరంజీవికి కూడా ఫోన్ చేసి సముదాయించి ఉంటారన్న ప్రచారం కూడా జరుగుతోంది. మాట తూలే ముందు సంయమనం పాటిస్తే బాలకృష్ణకే గౌరవం పెరుగుతుంది. శాసనసభలో ఏక వచనంతో ఎవరినీ సంబోధించకూడదు. అది తెలుసో లేదో తెలియదుగానీ బాలకృష్ణ 'వాడు వీడు' అన్న పదాలను వాడారు. ఇది తప్పు అని ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా స్పీకర్ అయ్యన్నపాత్రుడైనా బాలకృష్ణకు చెప్పాలి. నటుడిగా బాలకృష్ణ వ్యవహార శైలి వల్ల లాభమైనా నష్టమైనా ఆయన మాత్రమే అనుభవిస్తారు. శాసనసభ్యుడిగా ఉన్నంత కాలం నా ఇష్టం అంటే కుదరదు. సభా సంప్రదాయాలకు, విలువలకు ఆయన కట్టుబడి ఉండాల్సిందే. అయినా గాలికి పోయే కంపను నెత్తిన వేసుకొనే వారికి ఏం చెబుతాం? ప్రజలే చూసుకుంటారు. నటులను నటులుగానే గుర్తించి గౌరవించి అభిమానిస్తే ఏ తంటా ఉండదు. వారిని కుల దైవాలుగా ఆరాధించడం వల్లనే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. నటులు కూడా తమను తాము దైవాంశ సంభూతులుగా భావిస్తున్నారు. ప్రజలలో వారికి ఉన్న క్రేజ్ నటులుగా మాత్రమే అని తెలుసుకోలేకపోతున్నారు. ఎక్కడకు వెళ్లినా జనం మూగుతుండటంతో రాజకీయంగా కూడా విజయం సాధించామన్న భ్రమల్లోకి వెళుతున్నారు. అలా రాజకీయాల్లోకి వెళ్లినవారు తిరుగుటపాలా వెనుతిరగాల్సి వచ్చింది. సినీ నటులు ప్రచారం చేసినంత మాత్రాన ఎన్నికల్లో ప్రజల తీర్పుపై ఏ మాత్రం ప్రభావం ఉండదని పలు సందర్భాలలో రుజువైంది. కాబట్టి నటులు కూడా తమ పరిమితులు గుర్తించి కులాభిమానంతో హద్దు మీరే వారిని అదుపు చేస్తే సమాజానికి మేలు చేసిన వారవుతారు. ఆంధ్రప్రదేశ్‌ను పీడిస్తున్న కుల జాడ్యాన్ని రూపుమాపడానికి ప్రముఖ సినీ నటులు నడుం బిగిస్తే అప్పుడు వారిని రియల్ హీరోలుగా గుర్తించి సెల్యూట్ చేయవచ్చు. కులం కూడు పెట్టదు అని ప్రచార ఉద్యమం చేపట్టడానికి నటులు ముందుకు రావాలని కోరుకుందాం!

వారెక్కడ.. వీరెక్కడ!?



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్), భారతీయ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రెండు నెలల తేడాలో 1925లో ప్రారంభమయ్యాయి. ఒకటి సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ, రెండవది రాజకీయ పార్టీ. ఆ రెండూ ఈ సంవత్సరం శతసంవత్సరాలు పూర్తి చేసుకున్న వేళ 'వారెక్కడ, మనమెక్కడ' అనే మాట వామపక్ష భావజాలికుల నోటి వెంట వినిపిస్తున్నది. ఈ మాటను విజయవాడ నగరంలో సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో, విప్లవ రచయితల (విరసం) 29వ మహాసభలోనూ విన్నాను. రాజ్యాంగం మీద, ప్రజాస్వామ్యం మీద విశ్వాసం లేక, విప్లవ మార్గమే సరైనదని, ఆయుధ పోరాటాలే ప్రజా సమస్యలకు పరిష్కారం అని నినదించే వారంతా ఆ వేదిక మీద ఉన్నారు. చాలామంది ప్రసంగించారు కానీ, అందులో ఎక్కడా రాజ్యాంగబద్ధ పోరాటం చేద్దామన్న మాట లేదు.

'విరసం' నాకేమీ కొత్త కాదు. 20 ఏళ్ల క్రితం ఇదే వేదిక మీద వారు జరిపిన సమావేశంలోనూ నేను శ్రోతగా ఉన్నాను. నాటికీ నేటికీ వచ్చిన మార్పు–పడికట్టు పదాలు కొత్తవి వినిపించటమే. నాడు కాంగ్రెస్‌ని తిట్టిన నోర్లు నేడు బీజేపీని తిట్టాయి, నాడు ఇందిరను ఫాసిస్ట్ అన్న గొంతుకలు నేడు మోదీని అంటున్నాయి. అవన్నీ పక్కన పెడితే, కొందరు యువ నాయకులు చేసిన ప్రసంగాలు నన్ను ఆకట్టుకున్నాయి. రాంకీ అనే అతను "మనము, వారు 1925లోనే ప్రారంభమయ్యాం. కానీ ఇప్పుడు వారెక్కడ ఉన్నారు, మనమెక్కడ ఉన్నాం" అనే ప్రశ్న వేశాడు. అది కమ్యూనిస్టు, ఆరెస్సెస్‌లను పోల్చి వేసిన ప్రశ్న. ఆయన వేసిన మరో ప్రశ్న "మన భావజాలంతో మన ఇళ్లలోని వారినే ప్రభావితం చేయలేకపోతున్నాం. అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠ వేళ ఇంటింటా దీపాలు వెలిగించమని ఆరెస్సెస్ పిలుపునిస్తే, మా ఇంటిలోనూ వెలిగించారు. వెలిగించవద్దు అంటే.. 'దీపాలు వెలిగిస్తే తప్పేమిటి? రోజూ వెలిగిస్తూనే ఉన్నాం కదా! ఈ రోజు కొంచెం ఎక్కువ దీపాలు వెలిగిస్తాం... అంతేకదా' అని మా ఆడవారి నుంచి ప్రశ్న వచ్చింది. మన దగ్గర సమాధానం ఉందా?" అన్నది ఆయన ప్రశ్న. తమ సాటి సభ్యుడు లేవనెత్తిన ప్రశ్న మీద ఆ సంస్థలో చర్చ జరిగిందని అనుకోలేం. పడికట్టు నినాదాలైన 'కార్పొరేట్ హిందుత్వ ఫాసిజాన్ని ఓడిద్దాం', 'ఆదివాసులపై హిందుత్వ ఫాసిస్టుల వైమానిక దాడులను ఖండిద్దాం' అనేవి మాత్రం ఎప్పటిలాగానే వినిపించారు. ఆ వేదిక మీద నర్మద అనే ఆమె విప్లవోద్యమంలో మహిళలను ఎలా ఉపయోగించుకుంటున్నదీ ఎత్తి చూపింది. మహిళలను అవమానపరుస్తున్నారు..మహిళలను ముందు నిలబెట్టి తమ రక్షణకు వాడుకుంటున్నారు అని ఆరోపించినా, ఆమె ప్రసంగాన్ని మధ్యలో ఆపించారే గాని, అటువంటిదేమీ జరగడం లేదని ఎవరూ అనలేదు.

కమ్యూనిస్టు పార్టీ పిడివాదం తమ తప్పులను అంగీకరించలేని స్థితికి చేర్చింది. ఎర్రజెండా ముఖ్య తప్పిదాలు అంటూ చరిత్రకారుడు రామచంద్ర గుహ, ది టెలిగ్రాఫ్ దినపత్రికలో (12-6-2004) ఒక వ్యాసం రాశాడు. అందులో ఆయన కేవలం ఆరు ముఖ్య తప్పిదాల గురించే ప్రస్తావించినప్పటికీ, అటువంటి తప్పులు అనేకం చేసినందునే ఎర్రజెండాకి ఆదరణ తగ్గింది.

ఒకప్పుడు కార్మికరంగాన్ని, విద్యార్థి రాజకీయాలను ఏలిన కమ్యూనిస్టులు ఇప్పుడు ఎక్కడ? ఆరెస్సెస్ స్థాపించిన కార్మిక సంఘం (బీఎంఎస్) ఇప్పుడు దేశంలో నెంబర్ వన్. ఒక్కొక్క విశ్వవిద్యాలయ ఎన్నికలను వరుసగా ఏబీవీపీ గెలుస్తున్న వార్తలు వస్తున్నాయి. చారిత్రక అంశాలు, మేధోవాదనల్లో ఒకనాడు తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన వామపక్షవాదులు, నేడు వెనుకంజ వేయక తప్పలేదు. ఆరెస్సెస్ పునాది మీద పుట్టిన బీజేపీ రాజకీయ విజయం తర్వాత మిగిలిన విజయాలు వస్తున్నాయని కమ్యూనిస్టులు సర్ది చెప్పుకోవటం సరికాదు. అన్ని రంగాలలో ఆరెస్సెస్ కమ్ముకుని వచ్చినందున బీజేపీకి రాజకీయ విజయం సాధ్యమైంది.

ఒక వార పత్రికలో నేను నిర్వహించే 'చివరి రోజుల్లో' శీర్షిక కోసం ప్రముఖుల వారసులను ఇంటర్వ్యూ చేసేవాడిని. ఆ వరుసలో నేను కొన్ని సంవత్సరాల క్రితం చంద్ర రాజేశ్వరరావు కొడుకు ఆజాద్‌ని విజయవాడలోని వారి ఇంట్లో కలిసేవాడిని. తన తల్లిదండ్రులు ఇరువురూ చివరి రోజుల్లో మఖ్దూమ్ భవన్, హైదరాబాద్‌లో గడిపారని చెపుతూ, ఆ రోజుల్లో ఆయన రాసిన పుస్తకం అంటూ ఒక చిన్న నోట్‌బుక్ చూపించారు. అందులోని కొన్ని మాటలు కమ్యూనిస్టులకు చేరాయో లేదో నాకైతే తెలియదు. కానీ అవి వారికి తెలియాలి. అందులో ఒక వాక్యం "ఈ దేశ ప్రజలు ఎక్కువ మంది విశ్వసించే విషయాలను మనం కాదన్నాం, అందుకే ప్రజలు మనల్ని కాదన్నారు" అని ఉంది. ఆ విషయం మీద రాజేశ్వరరావు కొడుకుని వివరణ అడిగినప్పుడు కమ్యూనిస్టులు అనవసరంగా మతం కాదన్నారు, సంస్కృత భాషని వద్దన్నారు, వివేకానందుడిని, చివరికి నేతాజీ సుభాష్ చంద్రబోస్‌నీ తప్పుగా అర్థం చేసుకున్నారు అని ఆయన చివరి రోజుల్లో తలచుకున్నారని చెప్పారు.

'వారెక్కడ, మనమెక్కడ' అనే ప్రశ్నకు చంద్ర రాజేశ్వరరావు ఎంతో ముందుగానే సమాధానం రాసి ఉంచారు. కమ్యూనిస్టుల బలహీనత రోగానికి కారణాలు తెలిశాయి. కాని వాటికి తగిన ఔషధం అందుకునే ధైర్యం ఉందా?! ఆ పార్టీ పుట్టినప్పటి నుంచి ప్రతి దశాబ్దంలో ఒక పెద్ద తప్పు నిర్ణయం చేసుకుంటూ, చీలికలు పేలికలుగా జెండాను చించుకుని, భుజాన మోస్తూ ఇంకా మమ్మల్ని ఆదరించండి అంటే... ఎవరు ఆదరిస్తారు?

▪ డా. దుగ్గరాజు శ్రీనివాసరావు



ఇంద్రకీలాద్రికి భవానీలు పోటెత్తారు. ఉత్తరాంధ్ర నుంచి భారీగా తరలిరావడంతో నగరం ఎరుపెక్కింది. ప్రకాశం బ్యారేజీ చుట్టుపక్కల ఎటుచూసినా భవానీల సందడే కనిపించింది. క్యూలైన్లు, హోల్డింగ్ పాయింట్లు కిక్కిరిసిపోయాయి. రాత్రి ఏడు గంటల సమయానికి 1.50 లక్షల మంది కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. భక్తులను కంట్రోల్ చేసేందుకు అధికారులు హోల్డింగ్ పాయింట్లను ఇంకా కొనసాగిస్తున్నారు. శనివారం అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య రెండు లక్షలు దాటొచ్చని అంచనా వేస్తున్నారు.

అరుణవర్ణం

ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భవానీలు

ఉత్తరాంధ్ర నుంచి భారీగా రాక

- రాత్రి ఏడు గంటలకు 1.50 లక్షల మందికి దుర్గమ్మ దర్శనం
- కిక్కిరిసిన క్యూలైన్లు
- కొనసాగుతున్న హోల్డింగ్ పాయింట్లు




ఇరుముడితో ఇంద్రకీలాద్రికి వస్తున్న భవానీలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రికి భవానీల తాకిడి శనివారం కొనసాగింది. తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల్లో విజయవాడకు చేరుకుంటున్నారు. ఏటా భవానీలు ఉత్తరాంధ్ర నుంచి అధికంగా వస్తుంటారు. ఈసారి కూడా అదే ఒరవడి కొనసాగుతోంది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన రెండో రోజున హోల్డింగ్ పాయింట్లను ఉపయోగించాల్సి వచ్చింది. దీంతో భవానీల రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. క్యూలు నిండిన తర్వాత తోపులాట లేకుండా చేయడానికి అధికారులు రెండు హోల్డింగ్ పాయింట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. శుక్రవారం రాత్రి 12 గంటల వరకు దర్శనానికి భక్తులను అనుమతించారు. ఆ తర్వాత ఆపేశారు. దర్శనానికి బ్రేక్ వచ్చే సరికి బయట హోల్డింగ్ పాయింట్లలో భక్తుల రద్దీ పెరుగుతోంది. భక్తులందరినీ క్యూల్లో నుంచి పంపితే దర్శనం మరింత జాప్యమవుతుందని భావించిన పోలీసులు టోల్‌గేట్ వద్ద నుంచి ఘాట్ రోడ్డు మీదుగా కొంతమందిని పంపుతున్నారు. టోల్‌గేట్ గోపురం వద్ద ఉన్న క్యూలైన్‌కు అత్యవసర ద్వారం ఉంది. దాన్ని తెరిచి 100 మంది చొప్పున భక్తులను ఘాట్ రోడ్డు మీదుగా పైకి పంపుతున్నారు. ఓం మలుపునకు ముందున్న క్యూలైన్ వద్ద ఉన్న అత్యవసరం ప్రదేశ ద్వారం నుంచి వారిని క్యూలోకి పంపుతున్నారు. ఇంద్రకీలాద్రి రాజగోపురం వద్ద వీఐపీ, ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారు దర్శనానికి వెళ్లే మార్గాల్లో భవానీలను వదులుతున్నారు. ఈవిధంగా క్యూలైన్లను ఖాళీ చేయించే విధానాలను మిగతా 6లో..

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

- వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చివరి ఘట్టం
- హాజరైన సీపీ రాజశేఖర్‌బాబు

ముగిసిన దసరా ఉత్సవాలు

వన్‌టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం శాస్త్రోక్తంగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గురుప్రసాద్ దంపతులు హోమం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్‌బాబు దంపతులు మిగతా 6లో..


వన్‌టౌన్ స్టేషన్‌లో పూర్ణాహుతి నిర్వహిస్తున్న సీఐ గురుప్రసాద్ దంపతులు

ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, రాంప్రసాద్ రెడ్డి, సత్యకుమార్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కలెక్టర్ లక్ష్మీశ



అండగా..

విజయవాడలో ఘనంగా ఆటో డ్రైవర్ల సేవ ప్రారంభం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 27,721 మంది లబ్ధిదారులకు రూ.41.57 కోట్ల లబ్ధి

- ఆటో రిక్షా, మ్యాక్సీ, మోటార్ క్యాబ్ డ్రైవర్ల కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందం
- ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని సీఎం చంద్రబాబు భరోసా
- ఎలక్ట్రికల్ ఆటోలకు ప్రోత్సాహం



ఆటో రిక్షా డ్రైవర్ల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆటో డ్రైవర్ల సేవ పేరుతో ఆటో రిక్షా, మ్యాక్సీ, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. తొలి ఏడాది నగదు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం అంగరంగ వైభవంగా విజయవాడలో ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు ఆటోల్లో ప్రయాణించి ఆటో డ్రైవర్ల సేవను ఆరంభించారు. ఆయా కుటుంబాల్లో ఆనందం నింపారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఎలక్ట్రికల్ ఆటోలకు ప్రోత్సాహం అందిస్తానని చెప్పారు. తమ కష్టాలు అర్థం చేసుకుని అడగకుండానే వరాన్ని ప్రసాదించిన చంద్రన్నకు రుణపడి ఉంటామని ఆటో డ్రైవర్లు ఆనంద భాష్పాలు రాల్చారు. 6


ఆటో డ్రైవర్ల సేవ కార్యక్రమానికి హాజరైన ఆటో డ్రైవర్లు

అవినీతి, ఆక్రమణలు సహించను

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

భూ దోపిడీకి వ్యతిరేకంగా పాదయాత్ర 8 నుంచి

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

బార్ కౌన్సిల్ అర్హత పరీక్షా కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలి

- ప్రముఖ న్యాయవాది పులిగంటి

ఎలక్ట్రిక్ ఆటోలకు ప్రోత్సాహం : సీఎం చంద్రబాబు

6

ముక్కలుగా నరికేశాడు..

ఊర్మిళానగర్‌లో వృద్ధురాలి దారుణ హత్య!

- తల, కాళ్లు, చేతులు, మొండెం వేరు చేసి..
- మురుగు కాల్వల్లో విసిరేశాడు
- అక్క కుమారుడి ఘాతుకం
- తనకు, తన భార్యకు మధ్య గొడవకు ఆమె కారణమని పగ
- హత్యలో మైనర్ అయిన కుమారుడి సహకారం
- పోలీసుల అదుపులో నిందితులు!



విద్యాధరపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి దారుణ హత్య ఆలస్యంగా వెలుగుచూసింది. పిన్ని వరస అయ్యే వృద్ధురాలిని ఓ వ్యక్తి ముక్కలు ముక్కలుగా నరికేశాడు. తల, కాళ్లు, చేతులు, మొండెం భాగాలను గోనె సంచిలో కట్టి తీసుకెళ్లి వేర్వేరు ప్రాంతాల్లోని మురుగు కాల్వలో పడేశాడు. నగరంలో సంచలనం రేపిన ఈ ఘటనకు సంబంధించి విశ్వసనీయ మిగతా 6లో..

వృద్ధురాలి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

వృద్ధురాలు కనిపించడం లేదని ఆమె సమీప బంధువు మూడు రోజుల క్రితం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బొమ్మసాని నగర్ డ్రైనేజీలో ఒక మహిళకు చెందిన మొండెం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు తన బృందంతో మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అదృశ్యమైన వృద్ధురాలు ఈమెనని గుర్తించారు. వృద్ధురాలు నివాసం ఉండే ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులు నంద్యాలలో ఉన్నట్లు తెలుసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. విజయవాడకు తీసుకువచ్చి వెస్ట్ డివిజన్ ఏసీపీ దుర్గారావు, భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో రహస్య విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. ఏయే ప్రాంతాల్లో హతురాలి శరీర భాగాలు పడవేశారో తెలుసుకునేందుకు నిందితులను వెంటబెట్టుకుని వెళ్లినట్టు సమాచారం. తల, చేతులు అట్కిన్‌సన్ స్కూల్ రోడ్డులో, మొండెం బొమ్మసాని నగర్‌లో గుర్తించినట్టు తెలిసింది. మృతురాలి కాళ్లు మాత్రం లభించలేదని సమాచారం. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు భవానీపురం పోలీస్ అధికారులు ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

జిల్లాకు 8 రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాలు

సమష్టి కృషి ఫలితమే : కలెక్టర్ లక్ష్మీశ

6లో


స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రభల ఉత్సవం

నగరంలో ప్రభల ఉత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. భారీగా తరలివచ్చిన జనసందోహం నడుమ పులి వాహనంపై అమ్మవారు దేదీప్యమానంగా ముందుకు కదిలారు. గాంధీ నగర్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు గవర్నర్‌పేట, లెనిన్ సెంటర్, చందనా బ్రదర్స్, అప్సర థియేటర్ వెనుక రోడ్డు మీదుగా బందరు రోడ్డు రంగా విగ్రహం వద్దకు, అక్కడి నుంచి సత్యం గారి హోటల్ వరకు కన్నుల పండువగా ప్రభల ఊరేగింపు సాగింది.


ప్రభల ఉత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు


పులి వాహనంపై కనకదుర్గమ్మ


బేతాళ నృత్యం



డాక్టర్ వీజీఆర్‌ను అభినందిస్తున్న గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, చిత్రంలో నటుడు రాజేంద్రప్రసాద్

డాక్టర్ వేణుగోపాలరెడ్డి సేవలు ఆదర్శనీయం

● వీజీఆర్‌కు గోవా గవర్నర్ అశోక్‌గజపతి రాజు అభినందన

భారతీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మధుమేహ వ్యాధి (షుగర్) నివారణ, నియంత్రణ కోసం విశేషంగా కృషి చేస్తున్న ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి (వీజీఆర్) సేవలు ఆదర్శనీయమని గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. డాక్టర్ వీజీఆర్‌కు ప్రకటించిన ప్రజా డైరీ సెలబ్రిటీ అవార్డును గోవా రాజ్‌భవన్‌లో గవర్నర్ అశో క్ గజపతిరాజు చేతుల మీదుగా డాక్టర్ వీజీఆర్ ఇటీవల అందుకున్నారు. గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ మధుమేహ వ్యాధి నివారణ, నియంత్రణ కోసం గత 20 ఏళ్లుగా విశేషంగా కృషి చేస్తున్న డాక్టర్ వీజీఆర్ సేవలను ప్రశంసించారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి 10 లక్షల మంది విద్యార్థులకు అవగాహన కల్పించారని కొనియాడారు. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు వీజీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 50 వేల మొక్కలను, పండ్ల మొక్కలను హాస్పిటల్‌కు వచ్చే రోగులు, రైతులకు అందజేయడం స్ఫూర్తిదాయ కమన్నారు. వివిధ భాషల్లో రూపొందించిన వీజీఆర్ డయాబెటీస్ అట్లాస్ బుక్‌లను డాక్టర్ వీజీఆర్ గవర్నర్‌కి అందజేయగా ఆయన డాక్టర్ వీజీఆర్‌ను అభినందిస్తూ ముందుమాట రాశారు. ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, ఆక్రమణలు సహించను

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అవినీతిని ఎట్టి పరిస్థితులను సహించేది లేదని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. గన్నవరం లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గన్నవరంలో అవినీతిరహిత, శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఆక్రమణలను నిగ్గు తేల్చేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయాలకతీతంగా ఆక్రమణలను విడగొట్టి ప్రభుత్వ భూములు కాపాడతామని హామీ ఇచ్చారు. 15 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తనను ఆదరించి అక్కున చేర్చుకున్న గన్నవరం ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తనని ప్రోత్సహిస్తూ, నియోజకవర్గంలో సెజ్‌లకు రూ.29 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు యార్లగడ్డ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు యార్లగడ్డ పేర్కొన్నారు. తాను గన్నవరంలోనే ఉంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహంతో ఇక్కడే రాజకీయం చేస్తానని మరోసారి స్పష్టం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు గూడపాటి తులసీ మోహన్ పాల్గొన్నారు.

వరద బాధిత రైతులను ఆదుకోవాలి

● రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

చల్లపల్లి/ఘంటసాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరద బాధిత రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ డిమాండ్ చేశారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాలైన ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో రైతుసంఘం నాయకుల బృందం ఆదివారం పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కెవివి.ప్రసాద్ మాట్లాడుతూ, శ్రీకాకుళం పరివాహక ప్రాంతంలో 146 ఎకరాల్లో కంద, పసుపు, అరటి, మినుము తదితర పంటలు వరద తాకిడికి నష్టపోయాయన్నారు. వరదల కారణంగా ఎకరానికి రైతుకు రెండు లక్షల నష్టం జరిగిందని వివరించారు. నష్టాన్ని అంచనా వేసే అధికారులు రాజకీయాలకు అతీతంగా అంచనాలు రూపొందించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి అవసరమైన రుణాలు ఇవ్వాలని కోరారు. 100 శాతం సబ్సిడీతో విత్తనాలు, పురుగుమందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. రైతుసంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘం నాయకులు వేమూరి రత్నగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుంపటి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కోడి రాధాకృష్ణ, రాజారత్నం, సీపీఐ సీనియర్ నాయకులు బిక్షం రాజు, వెంకటేశ్వరరావు, మల్లుపెద్ది బోసు, దాసరి గోపాలకృష్ణ, రాజారత్నం, నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో ఆదర్శం రెడ్‌క్రాస్

● కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

● జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడిగా డాక్టర్ డీఆర్కే ప్రసాద్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీని ఆదర్శవంతమైన సంస్థగా రూపొందించాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లాపరిషత్ సమావేశపు హాలులో శనివారం జిల్లా రెడ్ క్రాస్ కమిటీ కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా స్వచ్ఛ సుందర చల్లపల్లి ఉద్యమ కార్యకర్త డాక్టర్ డీఆర్కే ప్రసాద్, ఉపాధ్యక్షునిగా ఎస్ఎస్ఆర్ కళాశాల డైరెక్టర్ శిర్విశెట్టి భాస్కర్, కోశాధికారిగా రిటైర్డు పోలీసు అధికారి పి.సుకుమార్, కార్యవర్గ సభ్యులుగా గుడివాడ మెహర్ ప్రసాద్, పి.శ్రీరాం, వి.సుందరరాం, చల్లపల్లి సబ్ బ్రాంచి ప్రతినిధి నడకుదిటి లీలా బ్రహ్మేంద్ర, నాగాయలంక శాఖ ప్రతినిధి బి.విష్ణువర్ధన్, విశ్రాంత ఎంఈవో బిహెచ్ శంకరనాథ్, మొవ్వ శాఖ ప్రతినిధి బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, జె.బాబూరావు, పి.సుబ్బారావు, ఉయ్యూరు విశ్వశాంతి డైరెక్టర్ డాక్టర్ ఎం.సూర్యకుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గంతో కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డీకే బాలాజీ ప్రమాణ స్వీకారం చేయించారు. రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర పరిశీలకుడు రామచంద్రరాజు మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను బలోపేతం చేద్దామన్నారు. డీఆర్వో కె. చంద్రశేఖరరావు, రెడ్‌క్రాస్ ప్యాట్రన్స్, వైస్ ప్యాట్రన్‌లు, జీవిత సభ్యులు పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ భవనాన్ని విస్తరించాలని సభ్యులు కోరగా సీఎస్ఆర్ నిధులతో భవనాన్ని విస్తరిద్దామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ముందుగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జ్యూనాడ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

(5వ పేజీ తరువాయి)

గురుప్రసాద్ దంపతులకు ఆశీస్సులు అందచేశారు. పూర్ణాహుతి హోమ ద్రవ్యాలను సమర్పించారు. అనంతరం అన్నవితరణ కార్యక్రమంలో సీపీ దంపతులు పాల్గొని వడ్డన చేశారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సీపీ

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కార్యక్రమాలు ముగిసిన అనంతరం సీపీ రాజశేఖరబాబు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దుర్గగుడిలో దసరా ఉత్సవాల విధుల్లో ఆరు వేల మంది వరకు పోలీసులు పాల్గొన్నారని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించినట్లు చెప్పారు. పోలీసు సిబ్బంది గతం కంటే బాగా పనిచేశారని కితాబిచ్చారు. అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలలో వేచి ఉన్న భవానీలు



అన్నప్రసాద కేంద్రం వద్ద..



భవానీలతో కిక్కిరిసిన కనకదుర్గానగర్

జై భవానీ..జైజై..భవానీ

● బెజవాడ వీధుల్లో జగన్మాత నామస్మరణ ప్రతిధ్వని ● పోటెత్తిన భవానీ దీక్షాపరులు ● అంతా అరుణమయం



జై భవానీ, .జై జై భవానీ నామస్మరణ విజయవాడలో మార్మోగుతోంది. ఇంద్రకీలాద్రిపైన, కొండ దిగువన ఎక్కడ చూసినా ఎరుపు దుస్తులు, పూలదండలు వేసుకుని, ఇరుముడులు ధరించిన భవానీలే. కొండకు వస్తున్న వారు, అమ్మవారిని దర్శించుకుని తిరిగి వెళ్తున్న భవానీ దీక్షాపరులతో కెనాల్ రోడ్డుతో పాటు వన్‌టౌన్‌లోని వీధులన్నీ అరుణమయం అయ్యాయి. ఉత్తరాంధ్ర జిల్లాల భవానీ భక్తులు దీక్ష చేపట్టిన చిన్నారులు, కుటుంబాలతో తరలివచ్చారు.

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై 11 రోజుల పాటు కొనసాగిన కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలలో రోజుకు సగటున 1.25 లక్షల మందికి పైగా భక్తులు అమ్మవారి దర్శనానికి రాగా, ఉత్సవాలు ముగిసి రెండు రోజులైన తరువాత శనివారం కూడా అంతకు మించి భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. ఆ పది కొండు రోజులు అమ్మ వారిని దర్శించుకున్న భక్తులు ఒక ఎత్తయితే, గత రెండు రోజులుగా అమ్మ వారిని ఇలవేల్పుగా భావించి ఆరాధించే భవానీ భక్తులు రావడం విశేషం. మండల, అర్ధమండలం దీక్ష చేపట్టిన భవానీలు అన్ని రోజులూ పూజించి ఇరుముడులు ధరించి అత్యంత భక్తిభావంతో తరలివచ్చారు. మహిళలకు స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రభుత్వం కల్పించడంతో మహిళలు అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దసరా ఉత్సవాలలో సైతం మహిళా భక్తులతో బస్సులు కిటకిట లాడాయి. భక్తుల రద్దీ కారణంగా దుర్గగుడి ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలను బంద్ చేశారు. దేవస్థానం బస్సులను కూడా నిలిపివేశారు. అమ్మవారిని దర్శించుకునడానికి వచ్చిన భక్తులు క్యూలలో అత్యధిక సమయం పాటు వేచి ఉండకుండా శీఘ్రదర్శన ఏర్పాటు చేశారు. అంతరాలయ దర్శనం రద్దు చేశారు. బంగారువాకిలి ముఖ మండపం నుంచి దర్శనం కల్పించారు. అమ్మవారి శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగుతోంది. ఈవో శీనానాయక్, అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నారు. శనివారం సాయంత్రం వరకు సుమారు లక్షన్నర మంది భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. భక్తులు ఉచిత అన్న ప్రసాదాన్ని స్వీకరించడంతో పాటు లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేస్తున్నారు. వాన ప్రభావం ఏదీ లేకపోవడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనం సజావుగా సాగిపోతోంది. ఈవో శీనానాయక్ శనివారం లడ్డూ ప్రసాదం తయారీ, నాణ్యత, విక్రయాలను పరిశీలించారు. బాగా రద్దీగా ఉన్నప్పుడు రెండు లడ్డూలు మాత్రమే ఇచ్చేవారని, ఇప్పుడు ఆరు లడ్డూల చొప్పున ఉండే రెండు ప్యాకింగ్‌లను అంటే డజను లడ్డూలు అందజేస్తున్నామని తెలిపారు. గత ఏడాడి 28,09,007 లడ్డూలను విక్రయించగా ఈ ఏడాది 3వ తేదీ రాత్రి వరకు 35,67,205 లడ్డూలను విక్రయించినట్లు చె ప్పారు.



దుర్గమ్మ సేవలో సీఎం కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ వారిని శనివారం సీఎం కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న దంపతులు దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి వేద ఆశీస్సులు, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం అందజేశారు. ప్రద్యుమ్నకు దసరా ఉత్సవాల నిర్వహణ గురించి ఈవో శీనానాయక్ తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు ఈవో శీనానాయక్‌ను సీఎం కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న అభినందించారు.

ఎలక్ట్రిక్ ఆటోలకు ప్రోత్సాహం : సీఎం



విజయవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రిక్ ఆటోలకు ప్రోత్సాహం అందిస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం గురించి మాట్లాడిన చంద్రబాబు విజయవాడలో ఆటోలన్నీ సీఎన్‌జీ కావటాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కాలుష్యాన్ని తగ్గించేందుకు ఆటోలన్నింటినీ సీఎన్‌జీ చేయాలని నిర్ణయించిందన్నారు. ఆటో డ్రైవర్ల ఆదాయాన్ని మరింతగా పెంచటం కోసం రానున్న రోజులలో విజయవాడ నుంచి ఎలక్ట్రిక్‌ఆటోలకు అవకాశం కల్పిస్తానని చెప్పారు. ఎలక్ట్రిక్‌ఆటోల ద్వారా నిర్వహణ ఖర్చు భారీగా తగ్గుతుందన్నారు.

ఆటో డ్రైవర్ అఫ్సర్‌ఖాన్‌కు ఎన్నో ప్రయోజనాలు

సీఎం చంద్రబాబు ప్రయాణించిన ఆటో డ్రైవర్ అఫ్సర్ ఖాన్‌కు కూటమి ప్రభుత్వంలో ఎన్నో ప్రయోజనాలు దక్కాయి. ఆటోడ్రైవర్ సేవలో పథకంలో రూ.15 వేలు, తల్లికి వందనం పథకం కింద కుటుంబానికి రూ.13 వేలు, దీపం 2.0 పథకం ద్వారా మూడు ఉచిత సిలిండర్లను అందుకుంది. బుడమేరు వరదలలో అఫ్సర్‌ఖాన్ ఆటో మునిగిపోగా, ఆటో మరమ్మతులకు రూ. 10 వేలను ప్రభుత్వం చెల్లించింది.

ఆటో డ్రైవర్ల సేవలో లబ్ధి ఇలా :

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 27,721 మంది లబ్ధిదారులకు రూ.41.57 కోట్ల మేర లబ్ధి కలుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో 16,405 మంది లబ్ధిదారులకు రూ.24.60 కోట్లు , కృష్ణాజిల్లాలో 11,316 మందికి రూ.16.97 కోట్ల మేర లబ్ధి కలుగుతోంది. ఆటో రిక్షాలు, లగ్జరీ టూరిస్ట్ క్యాబ్, లగ్జరీ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్, సెమీ లగ్జరీ టూరిస్ట్ క్యాబ్‌ల కేటగిరీలో ఈ పథకం వర్తిస్తుంది.

విజయవాడ రూరల్ : "ఆటో డ్రైవర్ల సేవలో' పథకం వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపింది. స్త్రీశక్తి పథకం తమ ఉపాధిపై ప్రభావం చూపిస్తుందన్న ఆందోళనలో ఉన్నామని, తాము అడగకపోయినా కూటమి ప్రభుత్వం రూ.15 వేల ఆర్థిక సాయం ప్రకటించడాన్ని హర్షిస్తున్నారు, వారి స్పందన ఇలా..

థ్యాంక్యూ సీఎం సార్..!

ఆటో డ్రైవర్లకు ఊరట



'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం మా డ్రైవర్లకు ఊరటనిచ్చింది. రూ.15 వేలు మా ఖాతాల్లో జమ చేయడంతో ఆటో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్‌లకు సరిపోతాయి.

- భీమన ఆంజనేయులు

ఆర్థిక భారం తగ్గుతుంది



ఉచిత బస్సు పథకం ప్రభావం మాపై ప్రభావం పడకుండా ఉండేందుకు రూ.15వేలు డ్రైవర్ల ఖాతాలో జమ చేయడంతో కొంత ఆర్థికభారం తగ్గుతుంది. - కె.మణి

కేసుల భారం కూడా తగ్గింది



ఎన్డీయే అధికారం లోకి వచ్చాక పోలీసు కేసుల భారం తగ్గింది. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరి ఆటోడ్రైవర్ల పట్ల ఇలానే సానుకూలంగా ఉండాలని కోరుకుంటున్నా.

- బి.సాయి

ఆర్థిక భారం తగ్గుతుంది



విజయవాడలో ఆటోలకు ప్రత్యేకంగా స్టాండ్‌లు, షెల్టర్లు ఏర్పాటు చేయిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. దానిని నెరవేర్చాలి

-పెదమల్లు విజయకుమార్

సీఎంకు ధన్యవాదాలు



ఆటో డ్రైవర్ల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేసిన సీఎం చంద్రబాబుకు ఎంతో రుణపడి ఉంటాం. ఆయనకు ధన్యవాదాలు. - బి.పండు



జీఎస్టీపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు : బోడె

ఉయ్యూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపులో రైతులకు పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయశాఖ, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై రైతులకు అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. వ్యసాయ పరికరాలు, యం త్రాలు, పురుగు మందులపై జీఎస్టీ తగ్గించి కూటమి ప్రభుత్వం రైతుకు చేయూత నిచ్చిందన్నారు. ట్రాక్టర్లపై గతంలో ఉన్న 12 శాతాన్ని 5 శాతానికి, టైర్లు, విడిభాగాలపై 18 శాతం నుంచి 5 శాతానికి డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్లపై 12 నుంచి 5 శాతానికి తగ్గించడం వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. రైతు సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజల్లో మంచి స్పందన కన్పిస్తుందనా న్నరు. పెదఓగిరాల నుంచి సభా స్థలి వరకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాల ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. జీఎస్టీ కమిషనర్ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, ఏఎంసీ చైర్మన్లు కొండా ప్రవీణ్, ధన కోటేశ్వరరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మురళీకిషోర్, అనుమోలు ప్రభాకర్, జయదేవ్, వి.సత్యనారాయణ, జనసేన నాయకుడు ముప్పా రాజా, ఆనందప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 8 రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాలు

సమష్టి కృషి ఫలితం ఈ స్వచ్ఛతా పురస్కారాల పట్టం: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు పట్టం కడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర పురస్కారాలు-2025లో ఎన్టీఆర్ జిల్లాకు 8 రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయని, సమష్టి కృషి ఫలితమే ఈ స్వచ్ఛ విజయానికి కారణమని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల తరహాలో రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డులను ప్రకటించిందని, ఇందులో 8 రాష్ట్రస్థాయి పురస్కారాలకు జిల్లా ఎంపిక కావడం ఎంతో ఆనందిస్తోందన్నారు. ఈనెల 6న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి వర్యులు విజేతలకు అవార్డులు అందచేయనున్నట్లు తెలిపారు. 69 రాష్ట్రస్థాయి పురస్కారాల్లో 8 పురస్కారాలు ఎన్టీఆర్ జిల్లాకు రావడానికి సరైన స్వచ్ఛతా ప్రణాళికల అమలు కారణమన్నారు. ప్రత్యేక కేటగిరీ అవార్డులు (స్వచ్ఛ సర్వేక్షణ్)లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ విజేతగా నిలిచిందన్నారు. అలాగే స్వచ్ఛ కాలనీల విభాగంలో విజయవాడలోని కేపీ నగర్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో విజయవాడ హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ, అనిగండ్లపాడు జీపీడీ ఎంపికయ్యాయన్నారు. స్వచ్ఛ అంగన్‌వాడీలు విభాగంలో కేదారేశ్వరపేట-3 అంగన్‌వాడీ కేంద్రం, స్వచ్ఛ బస్టేషన్ల విభాగంలో విజయవాడ బస్టేషన్, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో విజయవాడ కృష్ణలంకలోని వీఎం రంగా బాలికల మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, స్వచ్ఛతా ఎన్‌జీవోలు కేటగిరిలో రైజ్ సంస్థ ఎంపికైనట్లు కలెక్టర్ వెల్లడించారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిగా..

స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో ఎన్టీఆర్ జిల్లాకు జిల్లాస్థాయిలో వివిధ కేటగిరిల్లో 50 పురస్కారాలు లభించినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్రతి నెలా 3వ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయని, ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపైనా ప్రజల్లో పెద్దయెత్తున అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా పంచాయితీ కార్యాలయం, మున్సిపల్ విభాగాలు ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నాయని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ లోనూ ముందంజలో వుంటున్నాయన్నారు. బహిరంగ ప్రదేశాల శుభ్రత, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం, రెడ్యూస్ - రీయూజ్ - రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) వంటి విషయాల్లో విస్తృత ప్రజా భాగస్వామ్యంతో జిల్లా స్వచ్ఛమైన విజయాలు సాధిస్తోందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకొనేందుకు కృషిచేస్తామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

అరుణవర్ణం

(5వ పేజీ తరువాయి)

పోలీసులు అనుసరిస్తున్నారు.

రెండు లక్షలు దాటే అవకాశం

శనివారం రాత్రి ఆలయం మూసివేసే సమయానికి అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య రెండు లక్షలు దాటే అవకాశం ఉందని తెలుస్తోంది. తెల్లవారు జామున మూడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు 1.50 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర వైపు నుంచి వస్తున్న రైళ్లు, బస్సుల్లో ఎక్కువ మంది భవానీలు విజయవాడకు చేరుకుంటున్నారు. ఒక్కో రైలులో 1500-2వేల మంది భవానీలు వస్తున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. భవానీల రద్దీ కొనసాగడంతో రెండు హోల్డింగ్ పాయింట్లను అధికారులు ఉపయోగించారు. వాస్తవానికి శనివారం భవానీల రద్దీ తగ్గుతుందని అధికారులు భావించారు. ఈ రద్దీ పెరగడంతో అంచనాలు తారుమారయ్యాయి. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి వచ్చే రైళ్లు, బస్సుల రాక సమయాన్ని బట్టి పోలీసులు క్యూలైన్లు, హోల్డింగ్ పాయింట్లను ఖాళీ చేయిస్తున్నారు. స్నానాల ఘాట్ల నుంచి ఇంద్రకీలాద్రి వరకు సాధారణ భక్తుల కంటే భవానీ భక్తులే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం 7-8లక్షల మంది భవానీ మాలలు ధరించారని గురుభవానీలు చెబుతున్నారు. ఇప్పటి వరకు 3.50 లక్షల మంది భవానీలు ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ భవానీల రద్దీ ఆదివారం, సోమవారం కొనసాగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

భూ దోపిడీకి వ్యతిరేకంగా పాదయాత్ర 8 నుంచి

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : తమ భూములు ఉంటాయో, ఉండవోనని చిన్న, సన్నకారు రైతులు తీవ్ర భయాందోళనలో ఉన్నారని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న భూదోపిడీ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 8 నుంచి పాదయాత్ర చేపడుతున్నట్టు చెప్పారు.గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త జమీందార్లను సృష్టిస్తున్నాయన్నారు. లక్షలాది ఎకరాల విలువైన భూములను కారు చౌకగా అంబానీ, ఆదానీ వంటి జమిందార్లకు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. చట్టాలు, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ బడా కార్పొరేట్లకు భూములు కట్టబెడుతున్నారని మండిపడ్డారు విజయవాడలో అత్యంత ఖరీదైన ఆర్టీసీ స్థలాన్ని ఆర్టీసీ యాజమాన్యం, కార్మిక సంఘాలు , కార్మికులతో చర్చించకుండా లులు సంస్థకు కేటాయించడాన్ని తప్పుబట్టారు. విశాఖపట్నంలో వేలాది ఎకరాల భూమిని కేవలం ఎకరం 99 పైసలకే కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం సరైందికాదన్నారు. ఆంధ్ర ఉద్యమాల జేఏసీ కన్వీనర్ మహాదేవ్ మాట్లాడుతూ ఈనెల 8న ఉద్దానంలో జరిగే భారీ బహిరంగ సభతో పాదయాత్ర ప్రారంభమై వివిధ ప్రాంతాల్లో కొనసాగి ఈ నెల 28న విజయవాడలో జరిగే బహిరంగ సభతో ఈ పాదయాత్ర ముగుస్తుందన్నారు. అల్లాపురం ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నేత వేదవతి పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తి చేయాలి

● కృష్ణా కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల భవనాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. శనివారం పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిస్థితిపై ఆయన సమీక్ష నిర్వహించారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, పెడన పురపాలకసంఘాల్లో ఏడు ఆరోగ్య కేంద్రాలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. గుడివాడలోని ఆరోగ్య కేంద్రం టెండర్ల ప్రక్రియను త్వరాగా పూర్తి చేయాలన్నారు. అమృత్-2.0 పథకం ద్వారా రూ. 181.31 కోట్లతో చేపట్టనున్న పనుల టెండర్ ప్రక్రియ ను పూర్తిచేయాలని అన్నారు. తాగునీటి పైప్‌లైన్‌లకు ఉన్న లీకేజీలకు మరమ్మతులు చేయించాలన్నారు. మచిలీపట్నం డంపింగ్ యార్డులో మిగిలిన 30 వేల టన్నుల చెత్త తొలగించేందుకు తగుచర్యలు తీసుకోవాలన్నారు. పెడన పురపాలకసంఘంలో 10 రోజుల వ్యవధిలో చెత్తగుట్టలను తొలగించాలన్నారు.

సోలార్ ప్యానెళ్లకూ జీఎస్టీ తగ్గింపు

విజయవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీని తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో పీఎం సూర్యఘర్ పథకంలోని సోలార్ ప్యానెళ్ల ధరలు తగ్గినట్టు సీపీడీసీఎల్ ఎస్ఈ హనుమయ్య తెలిపారు. ప్యానళ్లు, ఇన్వర్టర్లపై జీఎస్టీ తగ్గిందని తెలి పారు. మూడు కిలోవాట్ల విద్యుత్ సర్వీసుపై రూ.10 వేల వరకు తగ్గింపు వర్తిస్తుందని వివరించారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బార్ కౌన్సిల్ అర్హత పరీక్షా కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలి

ప్రముఖ న్యాయవాది పులిగంటి

విజయవాడ లీగల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా బార్ కౌన్సిల్ అర్హత పరీక్షా కేంద్రాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని ప్రముఖ న్యాయవాది పీ ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆలిండియా బార్ కౌన్సిల్లో అర్హత సాధించడం కోసం న్యాయవాదులంతా ఈ పరీక్ష రాయాల్సి ఉంటుందని, అయితే ఈ పరీక్ష కేంద్రాలుగా కేవలం విశాఖపట్నం, తిరుపతి కేటాయించి రాజధాని అమరావతిని విస్మరించడం బాధాకరమన్నారు. ఈ ప్రాంతంలోని న్యాయవాదులు అర్హత పరీక్ష కోసం వ్యయ ప్రయాసలతో అంత దూరం ప్రయాణించడం కష్టమన్నారు. గత ప్రభుత్వ హయాంలో విజయవాడకు సెంటర్ కేటాయించి ఈ సంవత్సరం కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి ఆలిండియా బార్ కౌన్సిల్‌తో మాట్లాడి అమరావతిలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

ముక్కలుగా నరికేశాడు..

(5వ పేజీ తరువాయి)

సమాచారం మేరకు.. భవానీపురం ఏరియా ఊర్మిళానగర్‌లో ఓ వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటుంది. ఆమె నివాసానికి సమీపంలో తన అక్క కుమారుడు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. గత కొన్ని రోజులుగా అతనికి, అతని భార్యకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భార్య ఇంటి నుంచి వెళ్లిపోయి పుట్టింట్లో ఉంటున్నట్లు సమాచారం. తన భార్య వెళ్లిపోవడానికి కారణం తన పిన్ని అని ఆమెపై పగా పెంచుకున్నాడు. ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. దీని కోసం పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడు. విజయదశమికి ముందురోజు బుధవారం వృద్ధురాలి వద్దకు వెళ్లి ఆమెకు మాయమాటలు చెప్పి నమ్మకంగా బైక్‌పై తన ఇంటికి తీసుకువచ్చాడు. అప్పటికే సిద్ధం చేసుకున్న పదునైన ఆయుధాలతో ఆమెపై మైనర్ అయిన కొడుకుతో కలిసి దాడి చేసి చంపేసినట్టు సమాచారం. తల, కాళ్లు చేతులు నరికేశాడు. అనంతరం రెండు గోనె సంచుల్లో మృతదేహం భాగాలను మూటకట్టి ఊరి చివరిలోని వేర్వేరు మురుగు కాల్వల్లో పడేశాడు. ఆ తర్వాత నంద్యాలకు పరారయ్యారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

విద్యార్థినికి ఆర్థికసాయం



భారతీనగర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీ కొమ్మానీతా రామయ్య జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన షేక్ కరిష్మాకు డిగ్రీ చదువుకునేందుకు రూ.30వేలు ఆర్థికసహాయాన్ని రోహిత్ మండవ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మండవ వెంకటేశ్వరరావు అందజేశారు. ఇటీవల నలుగురు విద్యార్థులకు ఉన్నత చదువులకు రూ.30వేల చొప్పున అందజేశామని తెలిపారు. ట్రస్ట్ సెక్రటరీ మండవ లక్ష్మీ ప్రసాద్, హెచ్ఎం పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎంపీ శివనాథ్ ప్రత్యేక పూజలు

ఆటోనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లోని అమరావతి కోచ్ బిల్డర్స్‌లో శనివారం జరిగిన విజయదశమి ఉత్సవాల్లో ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాకులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న ఎంపీని నిర్వాహకులు శాలువా కప్పి సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అమరావతి కోచ్ బిల్డర్స్ అధినేత మేడిశెట్టి విజయకుమార్, ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, టైర్స్ అసోసియేషన్, పెయింట్స్ అసోసియేషన్ సభ్యుడు కోడూరి ఆంజనేయులు, అబ్దుల్ మతిన్, బత్తుల దుర్గారావు, ఆటోమొబైల్ యూనియన్స్ అసోసియేషన్ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.



ఆటోనగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

ఆటోడ్రైవర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


కృష్ణలంక, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడు కట్టుబడి వుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించే సంక్షేమ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో శనివారం భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. కనకదుర్గమ్మ వారధి దగ్గర ఆటో స్టాండ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఆటో ర్యాలీ జరిగింది. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్ మీద ప్రత్యక్ష ప్రసారం చేశారు. అధిక సంఖ్యలో ఆటోడ్రైవర్లు, తూర్పు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఏటా దసరాకి రూ.15 వేల మంది ఆటో డ్రైవర్లకు సాయం అందచేస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ పనిచేస్తుందని ఎమ్మెల్యే గద్దె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెలగపూడి శంకరబాబు, చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, వేముల దుర్గారావు, చెన్నుపాటి క్రాంతి, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి ఉషారాణి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమణ, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ షమ్మీ, సర్కిల్ 3 ఈఈ సామ్రాజ్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఆటోలో ర్యాలీగా సింగ్‌నగర్ స్టేడియంకు తరలివెళ్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

సింగ్‌నగర్‌కు ఆటోలో తరలిన ఎమ్మెల్యే గద్దె

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్న 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభానికి శనివారం ఉదయం కృష్ణలంక వారధి ఆటో స్టాండ్ నుంచి ఆటో డ్రైవర్లతో కలిసి తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంకు తరలివెళ్లారు. ఆయనతో పాటు 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు, వెలగపూడి శంకరబాబు, ఆటో స్టాండ్ నాయకులు ఆటోలో వెళ్లారు.









కాలనీ పురవీధిలో అమ్మవారి ఊరేగింపు, అమ్మవారి ఊరేగింపులో కోలాటం చేస్తున్న మహిళలు

రాజరాజేశ్వరి లలితాపరమేశ్వరి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

భారతీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పటమట దర్శిపేటలోని శ్రీరాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 4వరకు ఏర్పాటు చేసిన దసరా మహోత్సవాల చివరిరోజు శనివారం శ్రీరాజరాజేశ్వరి, లలితా పరమేశ్వరి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. కమిటీ అధ్యక్షుడు ఆవుల నాసరయ్య దంపతులచే అమ్మవార్లకు అభిషేకం, చక్రస్నానం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా 500మంది మహిళలచే కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం మూడు వేల మందికి

మూడు వేలమందికి అన్నదానం

అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలతో కాలనీ పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో మహిళా బృందం కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రంగలక్ష్మీ, టిప్పర్ నాగేశ్వరరావు, కార్యదర్శులు కొఠారి భాస్కర్, కాలవ ప్రసాద్, కోశాధికారి యామశివన్నారాయణ, సభ్యులు, శ్రీరాజరాజేశ్వరి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి పేదలకు వరం: ఎంపీ శివనాథ్

భారతీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. శనివారం గురునానక్‌కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 42మంది లబ్ధిదారులకు రూ.30.85లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ శివనాథ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు వరమని తెలిపారు. తాను ఎంపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో 160మంది లబ్ధిదారులు రూ.2కోట్లకు పైగా సహాయం పొందారని అన్నారు. ఈ చెక్కులు కష్టకాలంలో కుటుంబాలకు కొత్త జీవితం అందించేందుకు అండగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ నగరాల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలరావు, డైరెక్టర్ సుకాసి కిరణ్ కుమార్, పశ్చిమ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుకాసి సరిత, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, ఎన్ఆర్ఐ వల్లభనేని గిరి, తిరువూరు మున్సిపల్ కౌన్సిలర్ నాళ్ల సురేంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎంపీ శివనాథ్



ఆటోడ్రైవర్ల సేవలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, వేదికపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా తదితరులు

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆటోడ్రైవర్ల సేవలో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విజయవాడ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సింగ్‌నగర్‌లో శనివారం జరిగిన ఆటో డ్రైవర్ల సేవలో.. పాల్గొని మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీల జాబితాలో ఈ పథకం లేదని, ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించి వారికి ఆర్థిక చేయూత నిచ్చేందుకు సీఎం చంద్రబాబు సంకల్పించారన్నారు. కార్మికులను అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వ రరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలు చేయటమే కాకుండా అదనంగా ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని అమలు చేసి ఆటో డ్రైవర్లుకు కూటమి అండగా నిలుస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ మాట్లాడుతూ ఆటో కార్మికులు ఇబ్బందులు పడకూడదని గ్రహించి ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్, ఎంపీ కేశినేని శివనాథ్, తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు.

సభలో అపస్మారక స్థితికి మహిళ

విజయవాడ సిటీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): విజయవాడ సింగ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుంది. వాంబే కాలనీకి చెందిన గట్టి నాగజ్యోతి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు గమనించి వెంటనే డీసీపీ సరిత, డీఎంహెచ్‌వో సుహాసినిని అప్రమత్తం చేశారు. బాధితురాలిని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్యం మెరుగ్గానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. శాశ్వత మానసిక వైకల్యంతో బాధపడుతున్న తన ఐదేళ్ల కుమార్తెకు ప్రభుత్వ సాయం అందించాలని పాలకులను, ఉన్నతాధికారులను కోరేందుకు నాగజ్యోతి ఈ సభకు వచ్చారు.


జమాక్ అపార్టుమెంట్ రోడ్లో భారీ వాహనాల పార్కింగ్

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: ఏపీఐఐసీ కాలనీలోని జమాక్ అపార్టుమెంట్ సమీపంలోని అంతర్గత రోడ్డు భారీ వాహనాల పార్కింగ్ స్థలంగా మారింది. ఈ ప్రాంతం ఆటోనగర్‌కు సమీపంలో ఉండడంతో కొందరు తమ భారీ వాహనాలను ఈ రోడ్లో నిలిపివేస్తున్నారు. అంతే కాకుండా వాటి మరమ్మతులు చేయడంతో ఈ రోడ్డు అంతా ఇరుకుగా మారింది. దీంతో ఈ రోడ్లో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జమాక్ అపార్టుమెంట్ పక్క రోడ్లో నిలిపిన భారీ వాహనాలు





విజయవాడ	శైలజ	మచిలీపట్నం	సిరికాంప్లెక్స్
విజయవాడ	స్వర్ణమల్టీప్లెక్స్	మచిలీపట్నం	వరం PVR INOX
విజయవాడ	జి3 రాజ్ యువరాజ్	గుడివాడ	ABR సినిమాస్
విజయవాడ	జయరామ్	గుడివాడ	జి3 సింధూర
విజయవాడ	ఊర్వశి INOX	చల్లపల్లి	కోమల
ఎంజిరోడ్	లైలా INOX	కైకలూరు	శ్రీవెంకటరమణ
లబ్బీపేట	పీవీపి సినీపోలీస్	లక్ష్మీపురం	అంజనాసినీమ్యాక్స్
లబ్బీపేట	పివిఆర్‌సినిమాస్	హనుమాన్‌జంక్షన్	కె.ఎస్.టాకీస్
బెంజిసర్కిల్	క్యాపిటల్ సినిమాస్	నూజివీడు	ద్వారకకాంప్లెక్స్
పటమట	LEPL INOX	నూజివీడు	సత్యనారాయణ
అశోక్‌నగర్	పవర్‌సినీపోలీస్	ఆగిరిపల్లి	అనుడీలక్స్
వన్‌టౌన్	సౌమ్య	ఇబ్రహీంపట్నం	స్వర్ణసినిమ్యాక్స్
భవానీపురం	స్వాతి	కొండపల్లి	శివకృష్ణ
పాయకాపురం	రవీంద్రసినిమాస్	కంచికచర్ల	పివిఆర్‌సినీప్లెక్స్
పాయకాపురం	తారాస్క్రీన్స్	నందిగామ	విజయ
గుణదల	రామ్ సినిమాస్	జగ్గయ్యపేట	జి3 కమల
కానూరు	శ్రీవిజయలక్ష్మి	మైలవరం	సంఘమిత్ర
పోరంకి	వెంకటకృష్ణ	తిరువూరు	శ్రీకృష్ణాటాకీస్
కంకిపాడు	శ్రీరామచంద్ర	విస్సన్నపేట	వెంకటేశ్వర
ఉయ్యూరు	శాంతి		
పామర్రు	శివరామ్		

ANNAPURNA STUDIOS (P) LTD release



PLOTS FOR SALE

» 29,88,000/- లకే 166 చ.గ. CRDA ప్లాట్లు డూప్లెక్స్ విల్లా 1.15 Cr. ఔటర్ రింగ్, వెస్ట్ బైపాస్, గన్నవరం ఎయిర్‌పోర్ట్ దగ్గరలో, బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. ✆ 98490 79557 AJB - 236

» విజయవాడ, కంచికచర్ల, ఔటర్‌రింగ్ రోడ్ సమీపంలో AP CRDA, DTCP ప్లాట్స్, చ.గ 3,900/- నుండి 7,800/- ఇళ్ళ మధ్యలో ప్లాట్స్, ఫామ్ హౌస్ ప్లాట్ 1 సెంటు 1,45,000/-. సంప్ర:93906 65999 AJB-104

» విజయవాడ గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, పరిటాల పరిసర ప్రాంతాలలో ప్లాట్లు అమ్మదలచిన , కొనదలచిన వారు సంప్ర : 93947 17262 AJB-235824

» వామకుంట గ్రామం, తిరువూరు మండలం, ఖమ్మం దగ్గర, విజయవాడకు అతి చేరువలో DTCP అప్రూవ్డ్ ప్లాట్స్ అమ్మకం. లాంచింగ్ ఆఫర్ 10 గ్రాముల గోల్డ్. ✆ 9642223242 AJB-1314

» విజయవాడ పాత బస్టాండు ఎదురుగా బందరు రోడ్డుకు 50 మీ. దూరంలో మనోరమ హోటల్ దగ్గర 300 చ.గ. ప్లాటు (45 x 58) అమ్మకమునకు కలదు. సంప్ర. సెల్ : 94403 31155 AJB-235642

» విజయవాడ పోరంకిలో 40' రోడ్స్ CRDA గేటెడ్ కమ్యూనిటీలో 174, 182, 220, 340, 480, 550, 1050 చ.గ ప్లాట్లు స్పాట్ రిజిస్ట్రేషన్‌కై సంప్రదించండి (బ్యాంక్ లోన్ సదుపాయం కలదు) ✆ 98498 65959 AJB-236122

» అమరావతి-కాజా-గ్రేటర్ విజయవాడలో ORR దగ్గరలో CRDA అప్రూవ్డ్ గల 133 గజాలు పైన గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు, క్లబ్ హౌస్ ఎమినిటీస్‌తో అమ్మకానికి కలవు. ✆ 95028 22335 AJB-235823

HOUSE FOR SALE

» గుంటూరు బ్రాడీపేట 4/15 నందు 250 గజాల స్థలంలో గల 2 అంతస్తుల పాత భవనం పడమర ఫేసింగ్ భవనం అమ్మకం. సంప్ర : 99085 12652 AJB - 235816

FLAT FOR SALE

» VJA టిక్కిల్ రోడ్ Food Plaza వెనుక, స్మిత టవర్స్, 1st బ్లాక్, 2nd ఫ్లోర్ 3 BHK Flat అన్ని సౌకర్యాలతో అమ్మకం. ✆ 81426 68666 AJB-235825

» విజయవాడ, బృందావనం కాలనీ, లబ్బీపేట, సాయి కృష్ణ రెసిడెన్సీ, 3 BHK, 1620 SFT, వెస్ట్ ఫేసింగ్, కార్ పార్కింగ్ గల ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్రదించగలరు. ✆ 79812 78904 AJB-235400

» విజయవాడ బెంజ్ సర్కిల్ చంద్రబాబు నాయుడు కాలనీలో గల కృష్ణ అపార్ట్‌మెంట్‌లో 2 BHK ఫ్లాట్ నెం : 205 అమ్మకానికి కలదు. సంప్ర॥ 99498 54553 AJG-249058

» దేవినగర్ 5వ లైన్ నందు 2BHK FLAT మరియు 164 చ.గ.ల ఖాళీస్థలము అమ్మకమునకు కలవు. సంప్రదించండి: ✆ 94408 20644, 62813 02599 AJB-235751

» సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీ నందమూరి నగర్ మారుతి కార్ల షోరూం వెనుక, షిర్డిసాయి హైట్స్‌లో ఫుల్లీ ఫర్నిషింగ్ 3BHK ఫ్లాట్స్ Total Plinth 1431SFT 4th Floor W/F, Ready to Occupy. 53 లక్షలు. బ్యాంక్ లోన్ సౌకర్యంతో అమ్మకం. ✆ 98492 42413 AJB-235752

FOR SALE

» రెస్టారెంట్ అమ్మకం, విజయవాడ, భవానీపురం, స్వాతి రోడ్డు, రన్నింగ్ కండిషన్లో గ్రౌండ్ వెజ్, 1st నాన్ వెజ్, & 2nd & 3rd ఫ్లోర్‌లో బ్యాంకెట్ హాల్స్‌తో. సెల్ : 98484 46926 AJB - 235644

WATER PROOFING

» శ్రీ లక్ష్మీ వాటర్ ప్రూఫింగ్ వర్క్స్ : L & T టెక్నీషియన్స్‌చే శ్లాబ్స్, సెల్లార్స్, వాటర్ ట్యాంక్స్, బాత్‌రూమ్ లీక్స్, వాల్స్ చెమ్మలు నివారించబడును. సెల్ : 9000 100 578 AJB-236019

BUILDING FOR SALE

» విజయవాడ ఆంధ్ర హాస్పిటల్ ప్రక్కన, సక్కల రోడ్డును ఆనుకొని ఉన్న 6 ఫ్లోర్ల కమర్షియల్ బిల్డింగ్, ఫ్లోర్ 5337 Sft వెస్ట్ ఫేస్ ఫ్లోర్‌గా గాని, బిల్డింగ్ మొత్తంగా గాని అమ్మకమునకు కలదు. సంప్ర: ✆ 88856 64444, 92479 86114 AJB-235640

బిల్డింగ్ డిమాలిష్

» పాత బిల్డింగ్‌లు, అపార్ట్‌మెంట్‌లు, రేకుల షెడ్‌లు, పెంకుటిల్లు పగలగొట్టి, నేలమట్టం చేసి ఇవ్వబడును. పాత కలప, రేకులు కొనబడును. సంప్ర॥ 8639394993. AJG-783

WANTED

» విజయవాడ ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌కు అనుభవము ఉన్న లేడీ రిసెప్షనిస్ట్, టీం లీడర్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సెల్ : 84999 40666 AJB - 235817

» ప్రముఖ ఆటోఫైనాన్స్ నందు అనుభవం కలిగిన లేడి కంప్యూటర్ ఆపరేటర్, టెలికాలర్ కావలెను & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ సొంత బైకు ఉండాలి. Qul: డిగ్రీ. సెల్ : 9949558181 AJB - 235822

» విజయవాడ మొబైల్ షోరూమ్‌లో సేల్స్‌కి చురుకుగా వర్క్ చేయగలిగిన లేడీస్ కావలెను. వయస్సు 16-25 సం.లోపు. జీతం 12 వేలు నుండి. సంప్ర : 99484 49999, 95053 63636 AJB - 761

» విజయవాడలోని ప్రముఖ స్వీట్ షాపు నందు పనిచేయుటకు అనుభవం గల సేల్స్‌గరల్స్ కావలెను. సంప్రదించండి: ✆ 91188 58585 AJB-236126

SITUATION VACANT

★ ఇంటి వంట పనులు చేయుటకు బాదరబందీలేని ఒంటరి మహిళలు కావలెను. జీతం - 15 - 20 వేలు. కమ్మ ఇతరులు కూడా 9440536429 AJH-3137

TO-LET

» 3BHK 1800 sft 1st Floor సాయి నివాస్, అచార్య రంగానగర్, బెంజిసర్కిల్ దగ్గర, లిఫ్ట్, కార్‌పార్కింగ్, ఇన్వర్టర్‌తో అద్దెకు సంప్ర. సెల్ : 94917 30619 AJB - 235906

» విజయవాడ గురునానక్ కాలనీలో NSC కళ్యాణ మండపం దగ్గర 4,500 Sft గల డూప్లెక్స్ హౌస్ రెంట్‌కు కలదు. రెంట్ : Rs: 60,000/- నెగోషియబుల్. Ph.No. 83096 74662, 99514 24412. AJG-249233

» విజయవాడ, సత్యనారాయణపురం, శివరావువీధి, 23-23-47, గ్రౌండ్ ఫ్లోర్ (1100 S.Ft) 1st Floor 1320 (1320 S.Ft) కలిగి ఆఫీస్ / గోడౌన్ అద్దెకు కలవు. సెల్ : 94001 73164 AJB - 235766

TO-LET COMMERCIAL

» విజయవాడ, కామయ్యతోపు, చలసానినగర్‌లో బందరు రోడ్డుకు అతి దగ్గరలో 3 అంతస్థుల బిల్డింగ్ (Each Floor 2000 S.Ft.) కార్ పార్కింగ్‌తో అద్దెకు. సెల్ : 63034 98345, 94410 83767 AJB - 235818

DISTANCE EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA ✆ 99493 08940 AJB-235758

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నిర్మించబడిన /క్లెయిమ్స్‌కు, వల్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడిబిటి



ట్రెండ్



మా జీవితం మా హక్కు

కృత్రిమ మేథస్సు, సామాజిక మాధ్యమాలు విషపూరిత సమ్మేళనంగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు, సంస్థలు పేరు కోసం, విక్రయాల కోసం ప్రముఖుల స్వరాలు, ఆహార్యాలను అనుకరించే పోకడను అనుసరిస్తున్నారు. ఈ పోకడ నెటిజన్లను అలరిస్తున్నా, నటులను మాత్రం ఒకింత అసహనానికి గురి చేస్తోంది. కాబట్టే తాజాగా కొందరు ప్రముఖులు వారి వ్యక్తిగత హోదానూ, హుందాతనాన్నీ పరిరక్షించుకోవడం కోసం కోర్టుల ద్వారా 'పర్సనాలిటీ రైట్స్'ను పొందుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం!

ఐశ్వర్య దంపతులు సైతం

2024 మేలో, కొన్ని సంస్థలు జాకీ ష్రాఫ్ ఫొటోలను వాడుకుంటూ, అనధికారిక వస్తువుల అమ్మకాలు, వక్రీకరించిన వీడియోలతో వాణిజ్య లాభాలను ఆర్జిస్తున్నట్టు గుర్తించిన న్యాయస్థానం బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ వ్యక్తిత్వ హక్కులకు కూడా రక్షణ కల్పించింది. అలాగే అనిల్ కపూర్ పేరు, ఫొటో, స్వరాలతో పాటు ఆయన సుప్రసిద్ధ క్యాచ్‌ఫ్రేజ్ 'ఝకాస్' అనే మాటను కూడా వినియోగించడానికి వీల్లేకుండా వ్యక్తిత్వ హక్కుల రక్షణను అనుమతించింది. అలాగే 2022 నవంబరులో హైకోర్టు అమితాబ్ బచ్చన్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులు ఉల్లంఘనకు లోను కాకుండా రక్షణ కల్పించింది. గత సెప్టెంబరులో ప్రపంచసుందరి, బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లతో పాటు నిర్మాత కరణ్ జోహార్‌ల వ్యక్తిత్వం, ప్రచార హక్కులకు కూడా రక్షణ కల్పించడం విశేషం. కరణ్ జోహార్ విషయంలో, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, పింట్రెస్ట్, యూట్యూబ్‌లతో సహా వివిధ సామాజిక మాధ్యమాల వేదికల నుంచి అశ్లీల మీమ్స్, పోస్టులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. అటువంటి కంటెంట్‌ను సృష్టించడం కోసం ఒక ప్రముఖుడి వ్యక్తిత్వాన్ని అనధికారికంగా ఉపయోగించడం వల్ల ఆ ప్రముఖుడి పేరు ప్రతిష్ఠలు దెబ్బతిన్నట్టు పేర్కొంది.



మధుర గాయని కూడా...

ప్రముఖ హిందీ గాయని ఆశాభోంస్లే, కృత్రిమ మేథస్సు సహాయంతో తన స్వరాన్ని దుర్వినియోగపరుస్తున్న ఎఐ కంపెనీ మింక్ ఇంక్‌తో సహా అనేక సంస్థలకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారు. దాంతో ముందస్తు అనుమతి లేకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేదికలు, ఇ కామర్స్ సైట్‌లు, స్వతంత్ర విక్రేతలు ఆశాభోంస్లే స్వరాన్ని క్లోనింగ్ చేయడం లేదా ఆమె చిత్రాలు, పోలికలు, ఇతర వ్యక్తిత్వ లక్షణాలు దుర్వినియోగం కాకుండా బోంబే హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది. డిజిటల్ యుగంలో ప్రముఖుల హక్కులను కాపాడే క్రమంలో న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వు ప్రస్తుతం ఎంతో కీలకంగా మారింది.

నటుడు నాగార్జున కూడా...

పేరు, స్వరం, ఇమేజ్.. ఏ నటుడికైనా ఇవెంతో ముఖ్యం. వీటిని ఏ కారణంగా దుర్వినియోగపరిచినా ఏ నటులూ ఉపేక్షించరు. వెంటనే కోర్టును ఆశ్రయించి, వ్యక్తిత్వ హక్కులను పొందే ప్రయత్నం చేస్తారు. నటుడు నాగార్జున ఇదే చేశారు. తాజాగా తన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పించాలంటూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి, అనుమతి పొందారు. అక్రమ వాణిజ్య ప్రయోజనాల కోసం వస్తువులను విక్రయించడం కోసం తన వ్యక్తిత్వాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టు, తన ఫొటోలను అశ్లీల ఫొటోలతో మార్ఫింగ్ చేస్తున్నట్టు, యూట్యూబ్‌లో వీడియోలు సృష్టించడం ద్వారా, కృత్రిమ మేథస్సు సహాయంతో తనను ఉగ్రవాద సంస్థలతో, జూదంతో అనుసంధానిస్తున్నట్టు నాగార్జున తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఒక ప్రముఖ వ్యక్తి ఇమేజ్‌ను తప్పుదారి పట్టిస్తూ, అనుచితమైన, అవమానకరమైన మార్గాల్లో వారి ప్రవర్తననూ, ఆహార్యాన్నీ అనుకరిస్తూ ప్రతిష్ఠకు భంగం కలిగించినప్పుడు, వాళ్ల గుడ్‌విల్ దెబ్బ తింటుందని పేర్కొంటూ, ఢిల్లీ హైకోర్టు, నటుడు అక్కినేని నాగార్జున వ్యక్తిత్వం, ప్రచార హక్కులను కాపాడుతూనే ఆయన ప్రమేయం లేకుండా, పేరునూ, ఇమేజ్‌నూ, స్వరాన్నీ వాణిజ్యపరంగా ఉపయోగించకుండా కట్టడి విధించింది.



సండే సెలబ్రిటీ



దక్షిణాది, హిందీ సినిమాల ద్వారా ప్రేక్షకులపై తనదైన ముద్ర వేసిన హీరోయిన్ రాశీ ఖన్నా. తాజాగా ఆమె నటించిన 'తెలుసు కదా' సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.

అలాగైతే పాతబడిపోతాం...

'తెలుసు కదా' టీజర్‌కు మంచి స్పందన వచ్చింది కదా... ఎలా అనిపిస్తోంది?

చాలా ఆనందంగా అనిపిస్తోంది. సినిమాను బాగా ప్రమోట్ చేస్తున్నాం. చాలా కాలం తర్వాత నేను చేస్తున్న తెలుగు సినిమా ఇది. కాబట్టి చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. నాకు హైదరాబాద్‌లో ఇల్లు ఉంది. వచ్చిపోతూ ఉంటాను. ఇక్కడ షూటింగ్ జరుగుతూ ఉంటే పుట్టింటికి వచ్చినట్లు అనిపిస్తోంది.

మీరు అనర్గళంగా మంచి తెలుగు మాట్లాడుతున్నారు... ప్రాక్టీస్ చేశారా?

చాలాకాలంగా తెలుగు సినిమాలు చేస్తున్నాను కదా! తెలుగు వచ్చేసింది. నాకు తెలుగే కాదు... తమిళం, హిందీ కూడా బాగా వచ్చు. ప్రేక్షకులతో నేరుగా కనెక్ట్ కావటానికి భాష చాలా ప్రముఖమైన పాత్ర పోషిస్తుంది. అంతేకాదు... ఇది ఆయా భాషల ప్రేక్షకులకు నేను ఇచ్చే కనీస గౌరవం.

> నా తల్లితండ్రులు, మా అన్నయ్య, ఇద్దరు స్నేహితులు వీరందరూ నాకు మంచి సపోర్ట్. నాకు ఏ చిన్న సమస్య వచ్చినా వాళ్లతో చెబుతా!

మీరు హిందీ ప్రాజెక్టుల్లో కూడా నటించారు కదా... బాలీవుడ్‌కు, టాలీవుడ్‌కు ఉన్న తేడా ఏమిటి?



టాలీవుడ్‌లో హీరోయిన్లకు చాలా గౌరవం లభిస్తుంది. చాలా ఆదరంగా చూస్తారు. పైగా కాల్షీట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకానే ఉంటుంది. బాలీవుడ్‌లో కానీ, తమిళ పరిశ్రమలో కానీ కాల్షీట్ పన్నెండు గంటలు ఉంటుంది. అందువల్ల ఎక్కువగా అలసిపోతాం. అంతేకాకుండా ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. తెలుగు ప్రేక్షకులకు నా పట్ల అభిమానం ఎక్కువ. నేను ఇతర భాషల్లో చేసిన సినిమాలను కూడా వారు ఆదరిస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తూ ఉంటారు.

> నేను భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించను. ఎందుకంటే భవిష్యత్తులో ఏం జరుగుతుందో మనకు తెలియదు. చిన్నప్పుడు నేను ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకొనేదాన్ని. అనుకోకుండా హీరోయిన్ అయ్యా. ఇలా మనం అనుకున్నవన్నీ కావు.

బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటుల పట్ల వివక్ష ఉందని విమర్శలు వినిపిస్తూ ఉంటాయి...

నాకు అలాంటి ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. అంతేకాదు, ఓటీటీ వచ్చిన తరువాత భాషపరమైన సమస్యలు తొలగిపోయాయి. ఇక్కడ హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తున్నారు. అక్కడ దక్షిణాది సినిమాలు చూస్తున్నారు. ఓటీటీలు వచ్చిన తర్వాత మంచి నటులకు అన్ని భాషల్లోను అవకాశాలు లభిస్తున్నాయి.

నటనపై మీ అభిప్రాయమేమిటి?

నటనను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. నేను సినిమా రంగానికి వచ్చినప్పుడు నాకు ఏదీ తెలియదు. మనసుకు ఎలా అనిపిస్తే అలా నటించేదాన్ని. ఆ తర్వాత నటనకు కొన్ని టెక్నిక్స్ ఉంటాయని తెలిసింది. పుస్తకాలు చదవటం మొదలుపెట్టా. వీడియోలు చూసేదాన్ని. ముంబాయిలో నాటక రంగంలో పనిచేశా. ఎప్పటికప్పుడు నేర్చుకోపోతే ప్రేక్షకులకు బోర్ కొడుతుంది. మనం పాతపడిపోతాం!

మీరు స్క్రిప్టులు ఎలా ఎంపిక చేసుకుంటారు?

నేను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. నా పాత్ర ఎలా ఉందనే విషయంపైనే ఎక్కువ దృష్టి పెడతా! కొన్నిసార్లు డైరక్టర్లు వచ్చి కథలు చెబుతారు. వాళ్ల దగ్గర స్క్రిప్ట్ ఉండదు. అలాంటప్పుడు చాలా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఇతర కారణాల వల్ల కూడా ప్రాజెక్టులు ఓకే చేస్తా. కొందరు డైరక్టర్లకు మంచి దార్శనికత ఉంటుంది. అలాంటప్పుడు ఎలాంటి సమస్య ఉండదు. వారు చెప్పినట్లు చేసేస్తాను. కొందరు వచ్చి సలహాలు అడుగుతారు. నాకు తెలిసినంత చెబుతాను.

> ఒక నటిగా నాకు ఎప్పుడూ అభద్రతా భావం లేదు. నన్ను నేను ఎవ్వరితోను పోల్చుకోను. ప్రతి వ్యక్తికి తనదైన జర్నీ ఉంటుంది.

మీకు ఏ తరహా పాత్రలు చేయాలని ఉంది?

నాకు హారర్ ఫిల్మ్ చేయాలని ఉంది. ఎందుకంటే నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. మైథాలజీ, యాక్షన్ ఫిల్మ్స్ కూడా చేయాలని ఉంది.

> నాకు ఓషో అన్నా, బ్రహ్మకుమారిల మార్గమన్నా ఇష్టం. ఆధ్యాత్మికతపై నాకు అవగాహన ఉంది. నేను ఈ పరిశ్రమలో నెగ్గుకురావటానికి అది కూడా ఒక కారణం. నేను ఏ పనిచేసినా నిబద్ధతతో చేస్తా. అయితే ఫలితాలు నా చేతిలో ఉండవనే విషయం కూడా నాకు తెలుసు.

మీరు సినిమాలూ చేశారు, వెబ్ సిరీస్‌లూ చేశారు. రెండింటి మధ్యా తేడా ఏమిటి?

కొంత తేడా ఉంది. వెబ్ సిరీస్‌లలో పాత్రల్లో అనేక కోణాలు ఉంటాయి. వాటిని చూపించటానికి ఎక్కువ సమయం ఉంటుంది. సినిమాల్లో అంత సమయం దొరకదు. అయితే నాకు సినిమాలంటేనే ఇష్టం.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అమ్మో ఐ బొమ్మ


ప్రపంచంలో సినిమాను ప్రేమించే ప్రేక్షకులు ఉన్నంత కాలం, పైరసీ అనే భూతం వెంటాడుతూనే ఉంటుంది. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమను వణికిస్తున్న అలాంటి పైరసీ వెబ్‌సైట్లలో 'ఐ బొమ్మ' ఒకటి. ఈ పేరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కొత్త సినిమా థియేటర్లలో విడుదలైన కొద్ది గంటల్లోనే, లేదా ఓటీటీలోకి వచ్చిన మరుక్షణమే హై - క్వాలిటీ ప్రింట్‌తో ఈ సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి వస్తోంది. అయితే ఈ ఉచిత వినోదం తెలుగు సినిమా నిర్మాతలకు రూ. వేల కోట్ల నష్టం తెస్తోంది.

పైరసీ మాఫియా

'మూవీ రూల్స్, ఐ బొమ్మ లాంటి సైట్స్ కేవలం సినిమాలను అప్‌లోడ్ చేసే వేదికలు మాత్రమే కాదు. దీని వెనుక ఒక పకడ్బందీ వ్యవస్థ ఉంది. అంతర్జాతీయ నెట్‌వర్క్ పనిచేస్తోందని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. పైరసీ వల్ల తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఒక్క 2024లోనే పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు రూ. 3700 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని మాజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

చిన్న సినిమాల పాలిట విలన్

భారీ బడ్జెట్ చిత్రాలు, పాన్ ఇండియా చిత్రాలకు ఓటీటీ, శాటిలైట్ హక్కుల ద్వారా కొంతమేర నష్టం తగ్గినా, పైరసీ వల్ల అత్యధికంగా నష్టపోతున్నది మాత్రం చిన్న సినిమాలే. పలు సందర్భాల్లో చిన్న నిర్మాతలు, దర్శకులు వెలిబుచ్చిన ఆవేదన దీనికి అద్దం పడుతోంది. 'మా కలలను, మా పెట్టుబడినీ పైరసీ చంపేస్తోంది. మా పెట్టుబడిలో ఒక్క పైసా కూడా తిరిగి రావడం లేదు. ఇది ఇలాగే కొనసాగుతూ ఉంటే మరో సినిమా ఎలా తీయగలం' అని చిన్న నిర్మాతలు, దర్శకులు ప్రశ్నిస్తున్నారు. థియేటర్ల ద్వారా పెట్టుబడిలో కొంతైనా రాబట్టుకోవాలని చూసే చిన్న నిర్మాతల ఆశలపై ఐ బొమ్మ నీళ్లు చల్లుతోందనడంలో సందేహం లేదు. అలాగే పైరసీ అనేది థియేటర్ల ఆదాయంతో పాటు ఓటీటీ రెవెన్యూను సైతం దెబ్బతీస్తోంది. థియేటర్లలో విడుదలతో పాటు ఓటీటీల ఆదాయానికి ఐ బొమ్మ లాంటి సైట్లు గండికొడుతున్నాయి.



పోలీసులకు సవాల్

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఐ బొమ్మతో సహా 65కు పైగా పైరసీ వెబ్‌సైట్లపై దర్యాప్తును ముమ్మరం చేశారు. ఐ బొమ్మపై దృష్టి సారించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌లో భాగమైన కొందరు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. దాని నిర్వాహకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పైరసీ రాకెట్ హైదరాబాద్‌తో పాటు దుబాయ్, నెదర్లాండ్ వంటి విదేశీ ప్రాంతాల నుంచి పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పైరసీముఠా కొన్ని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, రికార్డింగ్, ఎడిటింగ్, అప్‌లోడింగ్, మానిటైజేషన్ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఛేజింగ్ గేమ్

ఐ బొమ్మ లాంటి పైరసీ సైట్లు తమ డొమైన్లను తరచూ మార్చడం, సర్వర్లు విదేశాల్లో ఉండడం వల్ల వాటిని శాశ్వతంగా మూసివేయడం పోలీసులకు, పైరసీ సెల్‌లకు పెద్ద సవాల్‌గా మారింది. ఒక డొమైన్‌ను బ్లాక్ చేస్తే కొద్ది రోజుల్లోనే అది కొత్త పేరుతో కొత్త లింక్‌తో మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంటర్నెట్ ప్రపంచంలో ఇదొక అంతుచిక్కని 'ఛేజింగ్ గేమ్'గా మారిపోయింది.

పరిష్కారం ప్రేక్షకులు చేతుల్లోనే!

పైరసీని పూర్తిగా రూపుమాపడం కష్టమే అయినా, సినీ పరిశ్రమ, ప్రభుత్వం, ప్రేక్షకులు కలసి పోరాడాల్సిన అవసరం ఉంది. అయితే ముఖ్యంగా మారాల్సింది ప్రేక్షకులే. పైరసీ లింక్‌లను ప్రోత్సహించకుండా, నాణ్యమైన వినోదం కావాలంటే థియేటర్లలో చూడడం, చట్టబద్ధమైన ఓటీటీ వేదికలను ఆదరించడం ఒక్కటే ఈ భూతం నుంచి తెలుగు సినిమాను రక్షించే మార్గం. వేల మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కష్టం, కలలకు ప్రతిరూపమైన సినిమాను పైరసీ కోరల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రూ హంటింగ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 06
వార్ 2	హిందీ చిత్రం	అక్టోబర్ 09
ది ఉమన్ ఇన్ కేబిన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 09
కురుక్షేత్ర	హిందీ సిరీస్	అక్టోబర్ 10
అమెజాన్ ప్రైమ్		
మెయింటనెన్స్ రిక్వైర్డ్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 08
జాన్ కేండీ	డాక్యూ మూవీ	అక్టోబర్ 10
జియో హాట్‌స్టార్		
మిరాయ్	తెలుగు చిత్రం	అక్టోబర్ 10
సెర్చ్: ది నైనా మర్డర్ కేస్	హిందీ సిరీస్	అక్టోబర్ 10



రంగురంగుల గాజులతో రమ్యంగా..

ఆభరణాలన్నింటిలో గాజులకు ప్రత్యేక స్థానం ఇస్తుంటారు మహిళలు. ఎన్ని నగలు పెట్టుకున్నా.. అందమైన గాజులు వేసుకోకపోతే అలంకరణ పూర్తికానట్టే! ఒకప్పుడు.. పెళ్లయిన మహిళలు చేతినిండా మట్టిగాజులు వేసుకునేవారు. యువతులు రంగురంగుల లక్క గాజులు, ప్లాస్టిక్ లేదా నైలాన్ గాజులు వేసుకునేవారు. క్రమంగా బ్లాక్ మెటల్, వైట్ మెటల్ బ్యాంగిల్స్ వచ్చేశాయి. ఇవి కాలేజీ యువతులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఇక బంగారు గాజులు ఎప్పటికీ ప్రత్యేకమే. వాటిమీద కెంపులు, పచ్చలు, వజ్రాలు, ముత్యాలు, నీలాలు పొదిగి ఎన్నో అద్భుతమైన డిజైన్లను అందుబాటులోకి తెస్తున్నారు. వీటిని కేవలం పండుగలు, వివాహాది శుభకార్యాలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు మహిళలు. రోజువారీ వేసుకోవడానికి వీలుగా మారుతున్న పోకడలకు అనుగుణంగా రకరకాల రాళ్ల గాజులు, థ్రెడ్ బ్యాంగిల్స్ అందుబాటులోకి వచ్చేశాయి. సీజెడ్, టోరమలీన్, టోపాజ్ లాంటి మామూలు రాళ్లతో డిజైన్ చేసిన గాజులను మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. డ్రెస్‌కు మ్యాచ్ అయ్యేలా రంగుల దారాలు చుట్టిన గాజులు కూడా యువతులను ఆకర్షిస్తున్నాయి. కాలేజీకైనా కార్యాలయానికైనా వెళ్లేటప్పుడు చేతికి ఒక్క గాజు వేసుకుంటే చాలనుకుంటున్నారు. అంతలా మహిళల మనసు దోచుకున్న రంగురంగుల గాజులపై ఓ లుక్కేద్దామా...



దారాల గాజులు

ప్లాస్టిక్, లేదా మెటల్ బ్యాంగిల్స్‌కు రంగురంగుల పట్టుదారాలను ఒక క్రమంలో చుట్టి కొనలను గమ్‌తో అంటిస్తారు. రెండు లేదా మూడు రంగుల దారాలను అందమైన డిజైన్ ప్రకారం చుట్టి తయారుచేసిన గాజులు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటి మీద రంగురంగుల కుందనాలు, రాళ్లు, ముత్యాలు, బీడ్స్ కూడా అతికిస్తుంటారు. మువ్వలు వేలాడదీస్తుంటారు. సన్నగా, వెడల్పుగా లేదంటే లావుగా ఇలా ఏ ఆకారంలో కావాలంటే అలా ఇంట్లోనే దారాల గాజులు తయారు చేసుకోవచ్చు. గోట్, సైడ్ బ్యాంగిల్స్ మాదిరిగా డిజైన్ చేసుకుని చేతులకు వేసుకుంటే నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుల దారాలతో లావుపాటి గాజులు సిద్ధం చేసుకుంటే రోజువారీ వేసుకోవడానికి బాగుంటాయి.

సీజెడ్ గాజులు

వజ్రాలకు ప్రత్యామ్నాయంగా సీజెడ్స్ ఉపయోగించి తయారుచేసే రాళ్ల గాజులను యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం వివిధ రంగుల్లో సీజెడ్స్ లభ్యమవుతున్నాయి. ఒక గ్రాము బంగారం లేదా వెండి ప్లేటింగ్‌తో పలు డిజైన్లలో రంగురంగుల సీజెడ్‌లను కూర్చి గాజులు రూపొందిస్తున్నారు. సింగిల్ లైన్, మల్టిపుల్ లైన్స్, బ్రేస్‌లెట్ స్టయిల్ గాజులు అందుబాటులో ఉన్నాయి. వజ్రాలను పోలిన కటింగ్‌తో తళతళలాడే సీజెడ్ గాజులు... సంప్రదాయ దుస్తులతోపాటు మోడరన్ డ్రెస్‌ల మీద కూడా చక్కగా నప్పుతాయి.



టోరమలీన్ గాజులు

టోరమలీన్ రాళ్లు పొదిగిన గాజులు ప్రత్యేకంగా కనిపిస్తాయి. విభిన్నమైన కటింగ్ విధానం వల్ల ఈ రాళ్లు నలువైపులా కాంతులు విరజిమ్ముతుంటాయి. గులాబీ, ఎరుపు, ఆకుపచ్చ, నీలం, నలుపు, గోధుమ రంగుల్లో లభించే టోరమలీన్ రాళ్ల గాజులను మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. పట్టుచీరలు లేదా భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌లతో నిండిన లెహంగాల మీద ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. రోజువారీ వేసుకోవడానికి కూడా సౌకర్యవంతంగా ఉంటాయి.





టోపాజ్ గాజులు

రంగురంగుల టోపాజ్ రాళ్లను కూర్చి రూపొందించిన గాజులు కూడా మహిళలను ఆకట్టుకుంటున్నాయి. లక్క, ప్లాస్టిక్, మెటల్ గాజుల మీద పలు ఆకారాల్లో ఉన్న టోపాజ్ రాళ్లను అతికిస్తారు. నీలం, గులాబి, ఆకుపచ్చ, పసుపు రంగుల్లో చిన్న, పెద్ద సైజుల్లో ఉన్న టోపాజ్ రాళ్లతో చాలా రిచ్‌గా కనిపిస్తాయి ఈ గాజులు. వెడల్పుగా గోట్ మాదిరి కనిపించే ఈ గాజులను చేతికి ఒక్కటి వేసుకున్నా గ్రాండ్‌గా ఉంటుంది.

స్పోర్ట్స్

విజయవాడ ● ఆదివారం 5 అక్టోబరు 2025

భారత్, పాక్ పోరు నేడు

మహిళల వన్డే ప్రపంచకప్

ఈరోజూ మనదే కావాలి!

మ. 3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో



పాక్ కెప్టెన్ సనా



భారత సారథి హర్మన్‌ప్రీత్

కొలంబో: మరో ఆదివారం..వరుసగా నాలుగోది. మళ్లీ చిరకాల ప్రత్యర్థుల సమరం. ఆసియా కప్‌లో భాగంగా గత మూడు ఆదివారాలు భారత్-పాకిస్థాన్ పురుషుల జట్లు తలపడితే ఈసారి మహిళల వంతు వచ్చింది. వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా ఆదివారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో భారత్-పాకిస్థాన్ జట్లు ఢీకొననున్నాయి. అయితే పురుషుల క్రికెట్‌లో మాదిరే.. ఈ పోరులో భారత మహిళలే తిరుగులేని ఫేవరెట్లుగా బరిలో దిగుతున్నారు. రికార్డుల పరంగా చూసినా..ఈ మ్యాచ్ ఫలితమేమిటో ఇట్టే అర్థమవుతుంది. మహిళల అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అన్ని ఫార్మాట్లలో కలిపి భారత్-పాక్ జట్లు 27సార్లు తలపడ్డాయి. కానీ 24-3తో భారత మహిళలదే తిరుగులేని ఆధిపత్యం. పాక్ నెగ్గిన మూడు మ్యాచ్‌లు కూడా టీ20లు. వన్డేల్లో అయితే ప్రత్యర్థిపై భారత్ 100 శాతం రికార్డు కలిగి ఉండడం విశేషం. రెండు జట్లు 11 సార్లు ఢీకొంటే అన్నిసార్లు మన జట్టే గెలిచింది. ఈ వన్డే ప్రపంచ కప్‌లో రెండు జట్లు తమ ప్రస్థానాన్ని పరస్పర భిన్నంగా మొదలుపెట్టాయి. భారత్ తొలి మ్యాచ్‌లో 59 రన్స్‌తో శ్రీలంకపై నెగ్గింది. మరోవైపు ఫాతిమా సనా సారథ్యంలోని పాక్ 7 వికెట్లతో బంగ్లా చేతిలో ఓడింది. బంగ్లా పేస్, స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం పాక్ బ్యాటర్ల వల్ల కాకపోవడం గమనార్హం.

శ్రీలంక-ఆస్ట్రేలియా మ్యాచ్ రద్దు: భారీ వర్షంతో శ్రీలంక-ఆస్ట్రేలియా జట్ల నడుమ శనివారం కొలంబోలో జరగాల్సిన మ్యాచ్ రద్దయింది. దాంతో ఇరుజట్లకు చెరో పాయింట్ లభించింది.

ఏక్తాకు రజతం

- ప్రవీణ్‌కు కాంస్యం
- ప్రపంచ పారా అథ్లెటిక్స్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో శనివారం.. భారత అథ్లెట్లు ఏక్తా భయాన్ రజతం, ప్రవీణ్ కుమార్, సోమన్ రాణా కాంస్య పతకాలు సాధించారు. మహిళల ఎఫ్51 క్లబ్ త్రోలో 19.80 మీ. దూరంతో ఏక్తా రజత పతకం దక్కించుకుంది. పురుషుల హైజంప్ టీ64లో ప్రవీణ్ రెండు మీటర్ల దూరంతో కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల షాట్‌పుట్ ఎఫ్57 విభాగంలో సోమన్ 14.69 మీ.తో కాంస్యం గెలుపొందాడు. ఇప్పటికి భారత్ 6 స్వర్ణాలు, 7 రజతాలు, 5 కాంస్యాలు సహా మొత్తం 18 పతకాలతో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఆదివారం పోటీలకు చివరిరోజు.

ఆసీస్‌దే టీ20 సిరీస్

మౌంట్ మాంగనూయ్: ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ (52 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 103 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగాడు. దీంతో శనివారం న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో ఆసీస్ 3 వికెట్లతో నెగ్గింది. సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. రెండో మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. ముందుగా కివీస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది. ఓపెనర్ సైఫర్ట్ (48) అత్యధిక స్కోరర్. ఎబాట్‌కు మూడు.. బార్లెట్, హాజెల్‌వుడ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పేసర్ జేమ్స్ నీషమ్ (4/26) ధాటికి ఆసీస్ తడబడింది. అయితే మార్ష్ అంతా తానై పోరాడడంతో ఆసీస్ 18 ఓవర్లలో 160/7 స్కోరు చేసి గట్టెక్కింది. డఫీకి 2 వికెట్లు లభించాయి.

విదర్భకు ఆధిక్యం

ఇరానీ కప్

నాగ్‌పూర్: రెస్టాఫ్ ఇండియాతో జరుగుతున్న ఇరానీ కప్‌లో రంజీ విజేత విదర్భకు 360 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. శనివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌లో ఈ జట్టు 232 పరుగులకు ఆలౌటైంది. అనంతరం భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన రెస్టాఫ్ ఇండియా ఆట ముగిసేసరికి 30/2 స్కోరుతో ఉంది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 342, రెస్టాఫ్ ఇండియా 214 రన్స్ చేశాయి.

వన్డేల్లోనూ గిల్ శకం

సారథ్య బాధ్యతలు అప్పగింత



నాయకుడిగా రోహిత్‌కు ఉద్వాసన

జట్టులో ఆటగాడిగా కొనసాగింపు

- కోహ్లీ కూడా వచ్చేశాడు
- వైస్ కెప్టెన్‌గా శ్రేయాస్
- బుమ్రాకు విశ్రాంతి

ఆస్ట్రేలియా పర్యటనకు టీమిండియా



అహ్మదాబాద్: భారత క్రికెట్ జట్టులో ఇక నయా శకం ఆరంభం కాబోతోంది. వన్డే ఫార్మాట్‌కు కూడా కొత్త కెప్టెన్ వచ్చేశాడు. ఆస్ట్రేలియాలో పర్యటన కోసం శనివారం భారత వన్డే, టీ20 జట్లను సెలెక్టర్లు ప్రకటించారు. ఇందులో ఊహించని రీతిలో వన్డే జట్టు పగ్గాలు సైతం యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కే దక్కాయి దీంతో సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా పేరు తెచ్చుకున్న వెటరన్ రోహిత్ శర్మ ఆటగాడిగా మాత్రమే కొనసాగనున్నాడు. వైస్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్‌ను ఎంపిక చేశారు. 2027లో వన్డే వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు కెప్టెన్సీ మార్పు చేశారు. ఈ ఏడాదే రోహిత్ నుంచి గిల్ టెస్టు బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈనెల 19 నుంచి 25 వరకు సిడ్నీ, అడిలైడ్, మెల్‌బోర్న్‌లలో 3 వన్డేలు జరుగుతాయి. అయితే రోహిత్‌తోపాటు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా జట్టుతో కలువనున్నాడు. ఈ ద్వయం గత మార్చిలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో చివరిసారి ఆడారు. ఇప్పటివరకు 55 వన్డేలు ఆడిన గిల్.. 8 సెంచరీలతో 2,775 పరుగులు సాధించాడు. మరోవైపు సీనియర్ పేసర్ బుమ్రాకు వన్డేల్లో విశ్రాంతినిచ్చారు. కానీ అక్షర్, కుల్దీప్, సుందర్‌ల రూపంలో ముగ్గురు స్పిన్నర్లను ఎంపిక చేసిన సెలెక్టర్లు ఈసారి ఆల్‌రౌండర్ జడేజాపై వేటు వేశారు. జట్టు సమతూకంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు, ఇద్దరు ఎడమచేతి స్పిన్నర్లు అవసరం లేదని భావించినట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. వన్డే జట్టు ప్రణాళికల్లో మాత్రం జడ్డూ ఉంటాడని తేల్చాడు. పేస్ విభాగంలో సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, హర్షిత్ ఉన్నారు. ఇక టీ20ల్లో నిలకడ ప్రదర్శిస్తున్న జైస్వాల్‌కు వన్డేల్లో చోటు కల్పించారు. కెరీర్‌లో అతను ఒక్క వన్డేనే ఆడాడు.

హార్దిక్ స్థానంలో నితీశ్: ఆసియాకప్ టోర్నీలో భారత్‌ను విజేతగా నిలిపిన కెప్టెన్ సూర్యకుమారేకే టీ20 పగ్గాలు అప్పగించారు. బ్యాటర్‌గా అతను విఫలమైనా,సెలెక్టర్లు అతడి నాయకత్వ ప్రతిభపై నమ్మకముంచారు. ఆసీస్‌తో ఈనెల 29 నుంచి నవంబరు 8 వరకు ఐదు టీ20ల సిరీస్ జరుగుతుంది. దాదాపుగా ఆసియాకప్‌లో పాల్గొన్న జట్టునే ఆసీస్ పర్యటనకు ఎంపిక చేశారు. అయితే గాయంతో జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా స్థానంలో ఆంధ్ర ఆటగాడు నితీశ్ కుమార్‌ను తీసుకున్నారు. నితీశ్ అటు వన్డే జట్టులోనూ చోటు దక్కించుకోవడం విశేషం. ఇక అదనపు స్పిన్నర్‌గా వాషింగ్టన్ సుందర్ కూడా జట్టులోకి వచ్చాడు.

వన్డే జట్టు
గిల్ (కెప్టెన్), రోహిత్, కోహ్లీ, శ్రేయాస్ (వైస్ కెప్టెన్), జైస్వాల్, అక్షర్, రాహుల్, నితీశ్, సుందర్, కుల్దీప్, హర్షిత్, సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, జురెల్.

టీ20 జట్టు
సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, గిల్ (వైస్ కెప్టెన్), తిలక్, నితీశ్ కుమార్, దూబే, అక్షర్, జితేశ్, శాంసన్, వరుణ్, బుమ్రా, అర్ష్‌దీప్, కుల్దీప్, హర్షిత్, రింకూ సింగ్, సుందర్.



ఎందుకిలా..?

టెస్టు జట్టుతో పాటు వన్డే పగ్గాలు కూడా రోహిత్ నుంచి చేజారాయి. ఈ ఏడాది మార్చిలో అతని ఆధ్వర్యంలోనే జట్టు చాంపియన్స్ ట్రోఫీ నెగ్గింది. గతేడాది టీ20 వరల్డ్‌కప్‌ను కూడా అందించాడు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో జట్టును ఫైనల్ చేర్చాడు. అయినా ఈ అనుభవశాలిని కాదని, వెస్టిండీస్‌పై తొలి టెస్టులో భారత్ గెలిచిన గంటలోపే వన్డే కొత్త కెప్టెన్ పేరును సెలెక్టర్లు ప్రకటించారు. రోహిత్ కెప్టెన్‌గా 56 వన్డేల్లో 42 మ్యాచ్‌ల్లో జట్టును గెలిపించాడు. సారథిగా అతడి విజయాలశాతం 76 కావడం విశేషం. కానీ ఇంగ్లండ్ పర్యటనలో గిల్ జట్టును నడిపించిన తీరు సెలెక్టర్లను ఆకట్టుకుంది. గిల్ సారథిగానే గాకుండా బ్యాటర్‌గానూ విజృంభించాడు. ఇప్పటికే రోహిత్ టెస్టు, టీ20లకు వీడ్కోలు పలికి వన్డేలకే పరిమితమయ్యాడు. ఇక, మూడు ఫార్మాట్లకు ముగ్గురు కెప్టెన్లను నియమించడం ఆచరణయోగ్యం కాదని బీసీసీఐ భావిస్తోందట. అందుకే 2027 వన్డే వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈలోపు కెప్టెన్‌గా గిల్‌కు తగినంత సమయం ఇచ్చి విశ్వకప్‌నకు సిద్ధం చేయాలని బోర్డు అనుకుంటోంది. మరోవైపు నాయకత్వ మార్పు గురించి రోహిత్‌తో ముందుగానే చర్చించామని చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తెలిపాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

మూడ్రోజుల్లోనే ముగించారు

తొలి టెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ విజయం

విండీస్ 146 ఆలౌట్

తిప్పేసిన జడేజా

అహ్మదాబాద్: సొంతగడ్డపై టీమిండియా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది. రవీంద్ర జడేజా (104 నాటౌట్, 4/54) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. వెస్టిండీస్‌తో తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మరో రెండు రోజుల ఆట మిగిలుండగానే నెగ్గిన భారత్ రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. రెండో, ఆఖరి టెస్ట్ ఈ నెల 10 నుంచి ఢిల్లీలో జరగనుంది. ఓవర్‌నైట్ స్కోరు 448/5 వద్ద భారత్ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. విండీస్ మొదటి ఇన్నింగ్స్ స్కోరు (162)కు 286 రన్స్ ఆధిక్యాన్ని నమోదు చేసింది. ఆటకు మూడో రోజైన శనివారం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విండీస్ 146 పరుగులకే కుప్పకూలింది. అథనజె (38) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జడేజా 4, సిరాజ్ 3, కుల్దీప్ 2 వికెట్లు తీశారు.

పేకమేడలా..: తొలి సెషన్‌లో పిచ్ బౌలర్లకు సహకరిస్తున్న వేళ విండీస్ కనీస పోరాటం కూడా చేయలేదు. సిరాజ్ బౌలింగ్‌లో నితీశ్ అందుకొన్న క్యాచ్‌తో ఓపెనర్ చందర్‌పాల్ (8) పెవిలియన్ చేరాడు. వన్‌డౌన్‌లో వచ్చిన అథనజె వికెట్‌ను అంటిపెట్టుకొన్నా.. మరో ఓపెనర్ క్యాంప్‌బెల్ (14), బ్రండన్ కింగ్ (5)ను జడ్డూ వెనక్కిపంపాడు. కెప్టెన్ చేజ్ (1)ను కుల్దీప్.. హోప్ (1)ను జడేజా అవుట్ చేయడంతో.. లంచ్ సమయానికి విండీస్ 66/5తో ఓటమి దిశగా సాగింది. తిరిగి వచ్చాక అథనజెను సుందర్.. గ్రీవ్స్ (25), వారికన్ (0)ను సిరాజ్ అవుట్ చేయడంతో విండీస్ ఓటమి ఖరారైంది. జోహన్ (14)ను జడేజా.. ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన సీల్స్ (22)ను కుల్దీప్ పెవిలియన్ చేర్చారు. దీంతో రెండు సెషన్లు కూడా పూర్తి కాకుండానే కరీబియన్ల కథ ముగిసింది.

10

'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాధించిన జడేజా.. అత్యధికంగా 10సార్లు ఈ అవార్డును అందుకొన్న కోహ్లీ, అశ్విన్, కుంబ్లే సరసన నిలిచాడు.



స్కోరుబోర్డు

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్: 162 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: 448/5 డిక్లేర్డ్;

వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) సుదర్శన్ (బి) జడేజా 14, చందర్‌పాల్ (సి) నితీశ్ (బి) సిరాజ్ 8, అథనజె (సి అండ్ బి) సుందర్ 38, కింగ్ (సి) రాహుల్ (బి) జడేజా 5, చేజ్ (బి) కుల్దీప్ 1, హోప్ (సి) జైస్వాల్ (బి) జడేజా 1, గ్రీవ్స్ (ఎల్బీ) సిరాజ్ 25, పియర్రీ (నాటౌట్) 13, వారికన్ (సి) గిల్ (బి) సిరాజ్ 0, లేన్ (సి) సిరాజ్ (బి) జడేజా 14, సీల్స్ (సి అండ్ బి) కుల్దీప్ 22; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 45.1 ఓవర్లలో 146 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-12, 2-24, 3-34, 4-35, 5-46, 6-92, 7-98, 8-98, 9-122, 10-146; **బౌలింగ్:** బుమ్రా 6-1-16-0, సిరాజ్ 11-2-31-3, జడేజా 13-3-54-4, కుల్దీప్ 8.1-3-23-2, సుందర్ 7-1-18-1.

లాభాలకు భరోసా

పసిడిలో పెట్టుబడి..



బులియన్ మార్కెట్ పరుగెడుతోంది. బంగారం, వెండి ధరలు చుక్కలంటుతున్నాయి. ఈ రెండులోహాల ధరలు ఇప్పటికే రికార్డుల మీద రికార్డులు బ్రేక్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం వీటిని ఎంచుకోవచ్చా...ఎంచుకుంటే ఎలా కొనాలి? పన్ను పోటు ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

బంగారం, వెండి ధరలు రేసుగుర్రాల్లా పరుగెడుతున్నాయి. ఈ రెండు లోహాల ధరలు ఇప్పటికే రికార్డు స్థాయిలకు చేరాయి. ప్రస్తుతం పది గ్రాముల మేలిమి బంగారం రూ.1.2 లక్షలు, కిలో వెండి రూ.1.52 లక్షలకు చేరి జీవితకాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతున్నాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు చూసినా ఈ రెండు లోహాల ధర 50 శాతానికి పైగా పెరిగింది. దీంతో ఆభరణాల తయారీ కంటే.. పెట్టుబడి లాభాల కోసం కొనే వారి సంఖ్య పెరిగిపోతోంది. సురక్షిత పెట్టుబడులుగా వీటికి ఉన్న పేరు మరింత మంది ఇన్వెస్టర్లను వాటి వైపు ఆకర్షిస్తోంది. చివరికి భారత్, చైనాతో పాటు అనేక దేశాల కేంద్ర బ్యాంకులు కూడా తమ ఫారెక్స్ నిల్వల నిర్వహణలో భాగంగా పెద్దఎత్తున పసిడి కొనుగోలు చేస్తున్నాయి.

దీర్ఘకాలిక రాబడులు

గత రెండు దశాబ్దాలుగా చూసినా బంగారం, వెండి పెట్టుబడులు మదుపరులకు మంచి లాభాలే పంచాయి. గత 20 సంవత్సరాల్లో పసిడి ధర ఏటా సగటున 14.9% చొప్పున పెరిగితే, వెండి ధర 13.01% చొప్పున పెరిగింది. ఇదే సమయంలో నిఫ్టీ-50 సూచీ 14.6%, రియల్ ఎస్టేట్ 7.7% చొప్పున పెరిగాయి. నిఫ్టీ-50 దీర్ఘకాలిక రాబడులు గత 20 ఏళ్లలో దాదాపుగా పసిడి, వెండి స్థాయిల్లోనే ఉన్నాయి. అయినా మదుపరులు ఈ కాలంలో అనేక ఆటుపోట్లు, ఆందోళన ఎదుర్కొన్నారు. కొవిడ్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలతో నెలకొన్న పరిస్థితులే ఇందుకు ఉదాహరణ. బులియన్ మార్కెట్ దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు మాత్రం దాదాపుగా ఈ టెన్షన్లు లేవనే చెప్పాలి.

పెట్టుబడి మార్గాలు

ప్రస్తుతం బంగారం, వెండిలో మదుపు చేయడానికి అనేక మార్గాలున్నాయి. అవేమిటంటే..

భౌతికంగా కొనుగోలు

ఇంట్లో భద్రతకు ఢోకా లేదనుకుంటే భౌతికంగా బంగారం కొని నగనట్రా లేదా నాణేలు, బార్స్ రూపంలో భద్రంగా దాచుకోవచ్చు. కాకపోతే ఇందులో రిస్క్ ఎక్కువ. ఎప్పుడు ఏ దొంగోడు కన్నమేసి దోచుకుపోతాడో తెలియదు. బీమా చేయించుకుని లేదా బ్యాంకు లాకర్లలో పెట్టి వీటిని కాపాడుకోవడం ఉత్తమం.

పన్ను పోటు

కొన్న బంగారం, వెండిని ఎంత కాలం ఉంచుకుని అమ్మాలనే విషయం ఆధారంగా పన్నుపోటు ఉంటుంది. రెండేళ్లలోపు అమ్మితే వచ్చే లాభాలను స్వల్పకాలిక మూలధన లాభాలుగా (ఎస్‌టీసీజీటీ) పరిగణిస్తారు. ఈ లాభాన్ని ఆయా వ్యక్తుల ఆదాయానికి జోడించి, వారి శ్లాబు ప్రకారం ఆదాయ పన్ను విధిస్తారు. అదే రెండేళ్ల తర్వాత అమ్మితే వచ్చే లాభాలను దీర్ఘకాలిక మూలధన లాభాలుగా (ఎల్‌టీసీజీటీ) పరిగణిస్తారు. గత ఏడాది జూలై 23 నుంచి ఈ లాభాలపై ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా 12.5% పన్ను విధిస్తున్నారు. గోల్డ్ డిపాజిట్ సర్టిఫికెట్లు, సావరిన్ గోల్డ్ బాండ్స్‌పై వచ్చే లాభాలపై మాత్రం ఎలాంటి పన్నుపోటు ఉండదు.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

ఇటీవల మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) నిర్వహించే గోల్డ్ ఈటీఎఫ్‌లకు మదుపరుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మదుపరుల నుంచి సేకరించే ఈ నిధులను ఎంఎఫ్‌లు 99.5% స్వచ్ఛత ఉండే బంగారంలో పెట్టుబడి పెడతాయి. మదుపరులు వీటి నెట్ అసెట్ వాల్యూను (ఎన్ఏవీ) ఎప్పటికప్పుడు షేర్ల ధరల్లా చెక్ చేసుకోవచ్చు. మార్కెట్ రేటుకు అనుగుణంగా వీటి ఎన్ఏవీ ఏ రోజుకు ఆ రోజు మారుతుంటుంది. భౌతిక బంగారాన్ని కొని ఇంట్లో దాచుకోవడం సమస్య అనుకునే మదుపరులకు గోల్డ్ ఈటీఎఫ్‌లు అత్యుత్తమ పెట్టుబడి సాధనం.

- క్రమానుగత పెట్టుబడి పద్ధతిలోనూ (సిప్) వీటిల్లో మదుపు చేయవచ్చు. కంపెనీల షేర్లలా ఎప్పుడు డబ్బులు అవసరమైతే అప్పుడు అమ్ముకుని నగదు చేసుకోవచ్చు.

సావరిన్ గోల్డ్ బాండ్స్

నిన్న మొన్నటి వరకు ఫిజికల్ గోల్డ్ వద్దనుకునే వారి కోసం గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ (జీఎంఎస్), సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) అందుబాటులో ఉండేవి. ఇటీవలే ప్రభుత్వం వీటిని నిలిపివేసింది. అయినా సెకండరీ మార్కెట్లో ఎస్‌జీబీలు ఇంకా దొరుకుతున్నాయి.

పెట్టుబడి ఎందుకంటే?

దీర్ఘకాలికంగా చూస్తే పసిడి, వెండి పెట్టుబడులు ఈక్విటీ మార్కెట్ లాభాలకు ప్రత్యామ్నాయం కాదు. బుల్ మార్కెట్లో బులియన్ మార్కెట్ నీరసిస్తే.. ఈక్విటీ మార్కెట్లు రేసుగుర్రాల్లా పరుగెడతాయి. అయినా ప్రతి మదుపరి తన పెట్టుబడుల్లో కనీసం 15 నుంచి 20 శాతమైనా బులియన్ మార్కెట్లో ఉంచుకోవడం మంచిది. ఆర్థిక ఆటుపోట్లు, అంతర్జాతీయ ఉద్రిక్తతల సమయంలో పెట్టుబడుల విలువ తగ్గిపోకుండా ఈ రెండూ అడ్డుకుంటాయి. ఏ మాత్రం రిస్కు తీసుకోలేని మదుపరులైతే బ్యాంకు డిపాజిట్లు, రుణపత్రాల కంటే బంగారం లేదా వెండిని ఎంచుకోవడమే మంచిది. పెట్టుబడులకు పెద్దగా ఢోకా లేకుండానే ఈ రెండు లోహాలు దీర్ఘకాలంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రుణపత్రాల కంటే ఎక్కువ రాబడులు ఇస్తాయి. గత రెండు దశాబ్దాల అనుభవమూ ఇదే చెబుతోంది.

ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్

కొన్ని యాప్‌లు, సంస్థలు అందించే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ (ఈజీఆర్) పైనా మదుపరులు దృష్టి పెట్టవచ్చు. అయితే నమ్మకమైన, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతి ఉన్న యాప్‌ల నుంచి మాత్రమే ఈ కొనుగోళ్లు చేయడం మంచిది. నగదు అవసరమనుకుంటే వీటిని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో టీ+1 పద్ధతిలో అమ్మి సొమ్ము చేసుకోవచ్చు.

స్వచ్ఛత

బంగారం లేదా వెండిలో పెట్టుబడి పెట్టేటపుడు వాటి స్వచ్ఛత అత్యంత ముఖ్యం. హాల్‌మార్కింగ్ వచ్చినా, ఇంకా చాలా మంది బులియన్ వ్యాపారులు తక్కువ స్వచ్ఛత ఉన్న బంగారం, వెండిని అత్యంత స్వచ్ఛమైనవిగా ప్రచారం చేస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు. పెద్దపెద్ద మాల్స్‌లో ఈ మోసాలు లేకపోయినా, చిన్న చిన్న నగల దుకాణాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. పెట్టుబడి లాభాల కోసమే కొనాలనుకుంటే హాల్‌మార్క్ ఉన్న 99.9 శాతం స్వచ్ఛత ఉండే బంగారం, వెండి మాత్రమే కొనుగోలు చేయటం మంచిది.

బిజినెస్ ప్లస్

రేపటి నుంచే టాటా క్యాపిటల్ ఐపీఓ

షేరు ధర శ్రేణి రూ.310-326

ముంబై: టాటా గ్రూప్‌లోని టాటా క్యాపిటల్ నుంచి సోమవారం అతి పెద్ద ఐపీఓ మార్కెట్‌కు వస్తోంది. ఈ ఇష్యూలో ఒక్కో షేరును రూ.310-326 ధర శ్రేణిలో విక్రయిస్తారు. దీని ద్వారా కంపెనీ రూ.15,512 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. మన దేశానికి చెందిన ఏ ఇతర ఎన్‌బీఎఫ్‌సీ ఇప్పటివరకు ఇంత పెద్ద ఐపీఓ జారీ చేయలేదు. యాంకర్ ఇన్వెస్టర్ల ద్వారా కంపెనీ ఇప్పటికే రూ.4,642 కోట్లు సమీకరించింది. గ్రేమార్కెట్‌లో ప్రస్తుతం టాటా క్యాపిటల్ షేర్లు ఎగువ ధర కన్నా రూ.24 నుంచి రూ.26 ప్రీమియంతో ట్రేడవుతున్నాయి.

రూ.1.98 లక్షల కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు ఔట్

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారీ మొత్తంలో నిధులు తరలించుకుపోతున్నారు. ఈ సంస్థలు సంవత్సరం ఇప్పటి వరకు రూ.1.98 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. ఇందులో గత నెల అమ్మకాలే రూ.27,163 కోట్ల వరకు ఉన్నాయి. గత 21 నెలలుగా చూసినా ఎఫ్‌పీఐలు స్టాక్ మార్కెట్ నుంచి రూ.3.19 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నట్టయింది. భారత కంపెనీల షేర్ల వాల్యుయేషన్లు ఎక్కువగా ఉండడం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ సుంకాల పోటు, కేటాయింపుల ప్రాధాన్యత మారడం ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	520
వరంగల్	502	గోదావరి	520
చిత్తూరు	528	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	124
వరంగల్	115	గుంటూరు	125
కరీంనగర్	115	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	119
కర్నూలు	115	నెల్లూరు	124
విశాఖపట్నం	127	అనంతపురం	124
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,19,400 ▲	1,09,450 ▲	1,64,000 ▲
విజయవాడ	1,21,300 ▲	1,16,000 ▲	1,52,000 ▲
విశాఖపట్నం	1,21,100 ▲	1,09,500 ▲	1,65,000 ▲
రాజమండ్రి	1,19,400 ▲	1,09,450 ▲	1,51,000 ▲
ప్రొద్దుటూరు	1,22,300 ▲	1,12,520 ▲	1,54,000 ▲
ముంబై	1,16,954 ▼	1,07,130 ▼	1,45,610 ▲

రుణాలు, డిపాజిట్ల వృద్ధితో దూసుకెళ్తున్న బ్యాంకులు

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో దేశీయ బ్యాంకింగ్ రంగం బలమైన వృద్ధిని ప్రదర్శిస్తోంది. ప్రైవేట్ రంగంలోని ఐడిబీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ రుణాలు, డిపాజిట్లలో గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. ఎల్ఐసీ నియంత్రణలో ఉన్న ఐడిబీఐ బ్యాంక్ రెండో త్రైమాసికం చివరి నాటికి, రుణాల పంపిణీలో 15 శాతం వృద్ధిని నమోదు చేసి, మొత్తం రూ. 2.3 లక్షల కోట్లు బట్వాడా చేసింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంకు రుణాలు రూ. 2 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం డిపాజిట్లు 9 శాతం పెరిగి రూ. 3.03 లక్షల కోట్లకు చేరగా, బ్యాంకు మొత్తం వ్యాపారం 12 శాతం వృద్ధితో రూ. 5.53 లక్షల కోట్లకు చేరింది. కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ (కాసా)డిపాజిట్లు 4 శాతం పెరిగి రూ.1.39 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. మరోవైపు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 9 శాతం రుణ వృద్ధిని నమోదు చేసింది. బ్యాంక్ మొత్తం రుణాల విలువ రూ. 27.9 లక్షల కోట్లకు చేరుకుంది. డిపాజిట్లు 15.1 శాతం పెరిగి రూ.27.1 లక్షల కోట్లకు చేరాయి. కాసా డిపాజిట్ల సగటు రూ. 8.77 లక్షల కోట్లుంది. ఇది గత ఏడాది ఇదే కాలంలో పోలిస్తే 8.5 శాతం అధికం. రెండో త్రైమాసికంలో కోటక్ మహీంద్రా బ్యాంకు రుణాలు 15.8 శాతం పెరిగి రూ. 4.62 లక్షల కోట్లకు చేరగా, డిపాజిట్లు 14.6 శాతం పెరిగి రూ.5.28 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

యూకో బ్యాంక్ క్యూ2 వ్యాపారం రూ.5.37 లక్షల కోట్లు

కోల్‌కతా: ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంకు సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో రూ.5.37 లక్షల కోట్ల వ్యాపారం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 13.29 శాతం ఎక్కువ. ఇదే సమయంలో బ్యాంకు రుణాలు 16.67 శాతం వృద్ధిరేటుతో రూ.2.31 లక్షల కోట్లకు, డిపాజిట్లు 10.87 శాతం వృద్ధిరేటుతో రూ.3.06 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం డిపాజిట్లలో కరెంట్ అకౌంట్, సేవింగ్ ఖాతాల (కాసా) డిపాజిట్ల వాటా కూడా 36.91 శాతం నుంచి 38.11 శాతానికి చేరినట్టు బ్యాంకు నియంత్రణ సంస్థలకు తెలిపింది.

బాండ్ల ద్వారా రూ.355 కోట్లు: శాంప్రి న్యూట్రిషన్స్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే శాంప్రి న్యూటిషన్స్ కంపెనీ ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్స్ (ఎఫ్‌సీసీబీ) ద్వారా నాలుగు కోట్ల డాలర్లు (సుమారు రూ.355.06 కోట్లు) సమీకరించనుంది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఒక్కోటి లక్ష డాలర్ల ముఖ విలువ ఉండే 400 ఎఫ్‌సీసీబీలను జారీ చేయనుంది. ఈ నిధులను ఈజిప్ట్, లైబీరియాతో సహా ప్రపంచవ్యాప్తంగా వ్యాపార విస్తరణ కోసం వినియోగించనున్నట్టు కంపెనీ తెలిపింది.

మొబైల్ కాంగ్రెస్‌లో 6జీ అభివృద్ధిపై చర్చలు

ఐఎమ్‌సీ సీఈఓ పి. రామకృష్ణ

న్యూఢిల్లీ: ప్రపంచ టెలికాం రంగంలో, భారత్ తన సాంకేతిక ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి సిద్ధమవుతోంది. ఈ నెల 8 నుంచి 11 వరకు ఢిల్లీలో జరుగనున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎమ్‌సీ)-2025 ఈ దిశగా కీలకమైన వేదికగా నిలవనుందని ఐఎమ్‌సీ సీఈఓ పి.రామకృష్ణ అన్నారు. ఈ సంవత్సరం ఐఎమ్‌సీ.. 6జీ ఎకోసిస్టమ్ అభివృద్ధి, భాగస్వామ్యాల విస్తరణ, సాంకేతిక సహకారం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు. భారత్‌తో పాటు యూకే, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల సీనియర్ పరిశ్రమ నాయకులు, ప్రొఫెసర్లు, నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు.

అవినీతి 'డబుల్'



జగన్ జమానాలో ఒక్క ఏడాదిలోనే రెట్టింపైన ఏసీబీ కేసులు

- 2023లో 160 కేసులు నమోదు
- అతి తక్కువ కేసుల్లోనే శిక్షలు
- జాతీయ సగటు కంటే ఏపీలోనే పెండింగ్ కేసులు ఎక్కువ.. వెల్లడించిన ఎన్‌సీఆర్‌బీ

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా.. అన్నట్లు వైసీపీ పాలనలో ఓ పక్క నేతలు భారీగా దోచుకుంటుంటే ఉద్యోగులు కూడా వారి బాటలోనే నడిచారు. దీనిని జాతీయ నేర గణాంకాల నివేదిక (ఎన్‌సీఆర్‌బీ) బహిర్గతం చేసింది. జగన్ జమానాలో ఒక్క ఏడాది కాలంలోనే ఏసీబీ కేసులు రెట్టింపు అయ్యాయి. ఆ లెక్కలు అన్నింటినీ ఎన్‌సీఆర్‌బీ లెక్కలతో సహా బయట పెట్టింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మొదటి రెండేళ్లు కరోనాతో గడిచి పోయింది. 2022లో రాష్ట్ర వ్యాప్తంగా 80 అవినీతి కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాతి ఏడాదిలో ఏకంగా 160 కేసులతో ఏపీ ఏసీబీ రికార్డు సృష్టించింది. రాష్ట్రంలో ఏ ఒక్క శాఖకో ఈ అవినీతి కేసులు పరిమితం కాలేదు. రెవెన్యూ, రవాణా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌లో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అవినీతి కేసులు నమోదయ్యాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులతో పాటు తాము సేకరించిన సమాచారం ఆధారంగా 2023లో అప్పటి ఏసీబీ డైరెక్టర్ పీహెచ్‌డీ రామకృష్ణ సంచలన కేసులు నమోదు చేశారు. ఏసీబీ ట్రాప్‌ల్లో ఆదాయానికి మించిన ఆస్తులున్న, లంచాలతో ప్రజల్ని పీడించిన ఉద్యోగులు పడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా లేని విధంగా 110 మంది అవినీతి ఉద్యోగులు నేరుగా లంచం తీసుకొంటూ ఏసీబీకి చిక్కారు. అప్పటి వైసీపీ పెద్దలతో పాటు వారు చెప్పినట్లు ఆడే ఉన్నతాధికారుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వచ్చినా తగ్గకుండా ఏసీబీ అధికారులు కేసులు పెట్టారు. వందల కోట్లు పోగేసుకున్న 17 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. సరిహద్దుల్లోని చెక్ పోస్టుల్లో రోజూ లక్షల్లో కొల్లగొడుతున్న అవినీతి పరులతో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏజెంట్ల ద్వారా వసూలు చేస్తున్న 33 మందిని కటకటాల్లోకి పంపారు. మొత్తం మీద 2023లో 172 మంది ప్రభుత్వ ఉద్యోగులు వివిధ అవినీతి కేసుల్లో ఊచలు లెక్కబెట్టారు. జాతీయ స్థాయిలో పరిశీలిస్తే ట్రాప్ కేసుల్లో నాలుగో వంతు, అక్రమాస్తుల కేసుల్లో ఐదో వంతు, క్రిమినల్ మిస్ కాండక్ట్ కేసుల్లో ఆరో వంతు ఏపీలోనే ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదికలో వివరించింది.

పెండింగ్ కేసులు భారీగా.. శిక్షలు స్వల్పంగా..

వైసీపీ ప్రభుత్వంలో అవినీతి జలగల నుంచి అనకొండల వరకూ ఏసీబీ వలలో చిక్కాయి. అయితే జగన్ పాలనలో ఏసీబీ కోర్టుల్లో యాభై శాతం మంది అవినీతి పరులకే శిక్షలు పడింది. 2023 నాటికి రాష్ట్రంలోని కోర్టుల్లో విచారణకు వచ్చినవి 947 కేసులు కాగా తీర్పు వచ్చింది మాత్రం 41 కేసుల్లోనే. అందులోనూ 20 కేసుల్లోనే శిక్షలు పడ్డాయి. మరోవైపు పాత కేసులన్నీ కలిపి 2023 నాటికి ఏకంగా 1,100 కేసులు వివిధ జిల్లాల్లోని కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. జాతీయ స్థాయి సగటుతో పోల్చితే మన రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అవినీతి కేసుల శాతం చాలా ఎక్కువ. 95.5 కేసులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. అవినీతి కేసుల్లో శిక్షలు పడక పోయినా.. సుదీర్ఘంగా విచారణ సాగినా అవినీతి కట్టడి కష్టమేనని నిజాయితీగా పనిచేసే అధికారులు అభిప్రాయపడుతున్నారు.

మిథున్‌రెడ్డి బెయిల్‌ను కొట్టివేయండి

- బెయిల్‌కు ఏసీబీ పేర్కొన్న కారణాలు సహేతుకంగా లేవు
- ఆయన నేరచరిత్రను పరిగణనలోకి తీసుకోలేదు
- హైకోర్టులో సీఐడీ పిటిషన్

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితుడు, వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి(ఏ4)కి బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు సెప్టెంబర్ 29న ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ అదనపు ఎస్పీ హైకోర్టులో పిటిషన్ వేశారు. విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో చట్టబద్ధమైన లోపాలున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం సోమవారం న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి వద్ద విచారణకు రానుంది. 'మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు 2025 ఆగస్టు 18న కొట్టివేసింది. పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాకుండానే ఆగస్టు 28న రెండో బెయిల్ పిటిషన్ వేశారు. మొదటి బెయిల్ పిటిషన్ కొట్టివేసిన అనంతరం పరిస్థితుల్లో మార్పులేకుండా బెయిలివ్వకూడదనేది న్యాయసూత్రం. దీన్ని పాటించకుండా మిథున్‌రెడ్డికి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. చార్జ్‌షీట్ దాఖలు చేశారని చెప్పి పరిస్థితుల్లో మార్పు వచ్చినట్లు కాదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. దీనిని పరిగణనలోకి తీసుకోవడంలో ఏసీబీ కోర్టు విఫలమైంది. మిథున్‌రెడ్డి నేరచరిత్ర గురించి పిటిషన్‌లో ప్రస్తావించలేదు. ఈ ఒక్క కారణంతో బెయిల్‌ను కొట్టివేయవచ్చు. ఆర్థిక నేరాలు, తీవ్ర నేరాల కేసుల్లో నిందితులకు బెయిల్ ఇవ్వొద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు విషయంలో ఏసీబీ కోర్టు పేర్కొన్న కారణాలు సహేతుకంగా లేవు. చార్జ్‌షీట్, అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు చేసినప్పటికీ అసంపూర్తిగా ఉందనే కారణంతో నిందితులు బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు ఏసీబీ కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసింది. అందుకు భిన్నంగా ఇప్పటి చార్జ్‌షీట్లు దాఖలు చేసినందున మిథున్‌రెడ్డికి బెయిల్ ఇస్తున్నట్లు ఏసీబీ కోర్టు ఉత్తర్వులలో పేర్కొంది. డీఫాల్ట్ బెయిల్ మంజూరును సవాల్ చేస్తూ సీఐడీ వేసిన పిటిషన్లపై వాదనలు ముగిసి, హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. ఈ విషయాన్ని ఏసీబీ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని మిథున్‌రెడ్డి బెయిల్‌ను కొట్టివేయండి' అని సీఐడీ తన పిటిషన్‌లో కోరింది.

ఐటీఐలో సత్తాచాటిన తెలుగు విద్యార్థులు

- ప్రధాని మోదీ చేతుల మీదుగా సత్కారం
- అభినందించిన విద్యాశాఖ మంత్రి లోకేశ్



ప్రధాని మోదీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అల్లూరి జిల్లాకు చెందిన ఆదివాసీ విద్యార్థిని పాంగి మధులత

న్యూఢిల్లీ, అమరావతి, ముంచంగిపుట్టు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఐటీఐ పరీక్షల్లో.. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సత్తా చాటారు.. శనివారం, న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమారోహ కార్యక్రమంలో ప్రధాని మోదీ.. ఐటీఐ ట్రేడ్ టెస్ట్‌లలో టాపర్లుగా నిలిచిన 45 మంది విద్యార్థులను సత్కరించారు. వీరిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచిన ఖమ్మం జిల్లా రూరల్ మండలం ఆరెంపుల గ్రామానికి చెందిన తాళ్లూరు పల్లవి ప్రధాని మోదీ నుంచి సర్టిఫికెట్ అందుకున్నారు. ఏపీలోని అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం మాకవరానికి చెందిన పాంగి మధులత (రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్) మొత్తం 1,200 మార్కులకుగాను 1,194 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. ఆమెతోపాటు డి.వందన(పెయింటర్ జనరల్), ఎస్.యామిని వరలక్ష్మి(వుడ్‌వర్క్ టెక్నీషియన్)కు ప్రధాని మోదీ సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీకి సంబంధించి మొత్తం 17 మంది జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ అభినందించారు.

'ఉక్కు'కు పూర్తిస్థాయి సీఎండీ ఎప్పుడో?

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఏడాదిగా ఇన్‌చార్జి పాలన

- నవంబరు ఆఖరుతో రిటైర్ కానున్న ఏకే సక్సేనా
- పూర్తిస్థాయి సీఎండీగా గతంలో ఎంపిక చేసిన శక్తిమణికి రెండు రోజుల కిందట వేరే బాధ్యతలు
- సీఎండీ నియామకంలో కేంద్రం దోబూచులాట!



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు పూర్తిస్థాయి సీఎండీ నియామకంపై దోబూచులాట కొనసాగుతోంది. ప్లాంట్‌ను లాభాల బాటలోకి తేవడానికి పూర్తిసాయం అందిస్తున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు.. ప్లాంట్‌కు పూర్తిస్థాయి సీఎండీని నియమించడంలో మాత్రం అశ్రద్ధ వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్) చైర్మన్‌గా ఉన్న ఏకే సక్సేనాను ఏడాది క్రితం ఇన్‌చార్జి సీఎండీగా నియమించారు. ఆయన మొదట్లో వారానికి ఒకరోజు, ఆ తర్వాత రెండు రోజులు వచ్చి ఇక్కడ వ్యవహారాలు చూసుకునేవారు. సక్సేనా నియామకాన్ని ఉద్యోగ వర్గాలు మొదట్లోనే తీవ్రంగా వ్యతిరేకించాయి. వారు భయపడినట్టుగానే ఆయన కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. ఉద్యోగుల సంఖ్యను భారీగా తగ్గించేశారు. హెచ్ఆర్ఏ తీసేశారు. ఒకటో తేదీన జీతాలు ఇస్తే చాలనే స్థితికి ఉద్యోగులను తీసుకొచ్చారు. ఆయన ఏడాది పరిపాలనలో ఉద్యోగులకు మూడు నెలల జీతం బకాయి పడింది. సక్సేనా కొనసాగుతుండగానే పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ కమిటీ పూర్తిస్థాయి సీఎండీ కోసం ప్రకటన ఇచ్చి 'ది ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శక్తిమణిని ఎంపిక చేసింది. కానీ, బాధ్యతలు చేపట్టాల్సిందిగా ఉత్తర్వులు మాత్రం ఇవ్వలేదు. ఇలా దాదాపు ఎనిమిది నెలల కాలం గడిచిపోయింది. తాజాగా ట్రావెన్‌కోర్ కంపెనీలో సీఎండీ పోస్టు ఖాళీ కాగా.. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ కమిటీ శుక్రవారం శక్తిమణిని ఎంపిక చేసింది. దీంతో ఆయన విశాఖ స్టీల్‌కు సీఎండీగా రానట్టేనని తేలిపోయింది.



ఇన్‌చార్జి సీఎండీ ఏకే సక్సేనా

వేరే సంస్థలకు అలా.. ఇక్కడ ఇలా..!

ఇదిలా ఉండగా, ఎంఓఐఎల్ సీఎండీ సక్సేనా పదవీ కాలం నవంబరు 30తో ముగియనుంది. అక్కడి సీఎండీ పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించిన కమిటీ.. అందులోనే కమర్షియల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న విశ్వనాథ్ సురేశ్‌ను శనివారం ఎంపిక చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలకు సీఎండీ పోస్టు ఖాళీ అవుతుంటే.. వాటిని ముందుగానే గుర్తించి, ఇంటర్వ్యూల ద్వారా తగిన వారిని ఎంపిక చేస్తుంది. అదే విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో అలా ఎందుకు చేయడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడి పరిస్థితులు క్లిష్టంగా ఉన్నాయని పదేపదే పార్లమెంట్‌లో చెబుతున్న మంత్రులు పూర్తిస్థాయి సీఎండీని ఎందుకు నియమించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కాగా, సక్సేనాను రిటైర్‌మెంట్ తర్వాత కూడా స్టీల్‌ప్లాంట్ బాధ్యతల్లో కొనసాగిస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన పని తీరుపై ఢిల్లీ పెద్దలకు విశ్వాసం ఉంటే పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించాలి కానీ.. ఇలా ఇన్‌చార్జి పేరుతో కొనసాగించడం తగదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టు కార్మికులను సక్సేనా పెద్ద సంఖ్యలో తీసేయడం స్థానిక కూటమి నేతలను ఇరకాటంలోకి నెట్టింది. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కోరుతున్నా ఉక్కు మంత్రిత్వ శాఖ పట్టించుకోవడం లేదు.

తుప్పుపట్టిన ధవళేశ్వరం బ్యారేజీ గేట్లు


- అందుకే 250 కోట్లు కేటాయించాం... శ్రీశైలానికి 350 కోట్లు
- గోదావరి ఏటిగట్ల పటిష్ఠతకు 43 కోట్లతో పనులు
- ఇరిగేషన్‌లో రూ.18 వేల కోట్ల బిల్లులు పెండింగ్
- సవాళ్లను అధిగమించి పని చేస్తాం: మంత్రి నిమ్మల



రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో వాటి భద్రత, పటిష్ఠత ప్రశ్నార్థకంగా మారాయి. ధవళేశ్వరం బ్యారేజీ గేట్లు తుప్పు పట్టిపోయాయి. గేట్లు కొట్టుకుపోతే మళ్లీ ఏడాదిపాటు తూర్పు, పశ్చిమలో ఒక్క పంట కూడా ఉండదు. అందుకే రూ.250 కోట్లు ఈ బ్యారేజీకి కేటాయించాం. వచ్చే వర్షాకాలం సీజన్ లోపు ఆ గేట్లన్నీ మార్చాలి. శ్రీశైలం ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉంటే దానికి రూ.350 కోట్లు ఖర్చు పెడుతున్నాం. గత ప్రభుత్వం నిర్వాకంతో బ్యారేజీలకు లాకులు, డోర్లు, షట్లర్లు, ఇతర మరమ్మతులు చేయలేదు. కనీసం గ్రీజ్ పెట్టలేదు. అందుకే గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయిన పరిస్థితి ఏర్పడింది. అన్నమయ్య ప్రాజెక్టు విషయంలోనూ ఇలాగే జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఏటిగట్లు పటిష్ఠత విషయంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శించారు. వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా ఏటిగట్టుకు ఖర్చుపెట్టలేదు. 1986లో 36 లక్షల క్యూసెక్కుల భారీ వరద వచ్చింది. అం దుకు అనుగుణంగా ఏటిగట్లు పటిష్ఠతకు చర్యలు తీసుకుంటున్నాం. పశ్చిమగోదావరిలో రూ.18 కోట్లు, రాజోలులో రూ.25 కోట్లతో బండ్ కోత నివారణ పనులు చేస్తున్నా ం. గత ప్రభుత్వం రూ.14 లక్షల కోట్ల అప్పు మా నెత్తిమీద పెట్టింది. ఒక్క ఇరిగేషన్ శాఖలోనే రూ.18 వేల కోట్ల బిల్లులు బకాయిలున్నాయి. ఆ అప్పులు, వడ్డీలు కట్టాలి. బకాయిలు చెల్లించాలి. ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది. సవాళ్లను అధిగమించి పనిచేస్తాం' అని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

ప్రశ్నిస్తున్న గర్ల్ ఫ్రెండ్



రశ్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ద గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. అందరినీ ఆకట్టుకొనే విధంగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రేమకథా చిత్రాన్ని నవంబరు 7న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు శనివారం ప్రకటించారు. తెలుగు సహా తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సినిమాను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 'ప్రేమికులుగా మనం ఒకే టైపా.. ఒకరికొకరం ఎంత వరకూ కరెక్ట్.. రకరకాల కారణాలతో కలసే ప్రేమికుల్లో ఎంతమందికి ఈ క్లారిటీ ఉంటుంది.. మీకు ఉందా.. అయితే నవంబరు 7న థియేటర్స్‌కు రండి.. డిస్కస్ చేద్దాం' అంటూ రశ్మిక, దీక్షిత్ ఆహ్వానం పలుకుతూ వచ్చిన రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ వీడియా ఆకట్టుకుంటోంది.

గోపీచంద్ మలినేనితో ఎన్‌బీకే 111



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న నూతన చిత్రం ఖరారైంది. గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ఎన్‌బీకే 111' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వీరసింహా రెడ్డి' చిత్రం ఘన విజయాన్ని అందుకొంది. వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీశ్ కిలార్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించిన మేకర్స్ ఈ నెల 24న ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. చారిత్రక నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. బాలకృష్ణ ఇప్పటివరకూ పోషించని సరికొత్త పాత్రను ఈ సినిమాలో పోషించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

మహాదేవ నాయుడు పాత్రలో



నటుడు శివాజీ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతోన్న చిత్రం 'ప్రేమకు నమస్కారం'. షణ్ముఖ్ జస్వంత్, ఉల్కా గుప్తా జంటగా నటిస్తున్నారు. భీమశంకర్ దర్శకత్వంలో అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మహాదేవనాయుడుగా శివాజీ శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. తాజాగా చిత్ర బృందం ఆయన పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్, యువతకు మంచి సందేశంతో పాటు వినోదం పంచుతుంది' అని చెప్పారు.

లిటిల్ హార్ట్స్ తరహాలో మిత్రమండలి



ప్రియదర్శి, నిహారిక ఎన్ఎమ్ జంటగా నటించిన చిత్రం 'మిత్రమండలి'. వెన్నెల కిశోర్, వీటీవీ గణేశ్ కీలకపాత్రలు పోషించారు. బీవీ వర్క్స్ బేనర్‌తో కలసి బన్నీ వాసు సమర్పిస్తున్నారు. కల్యాణ్ కే, భాను ప్రతాప్, డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విడుదలవుతోంది. చిత్రబృందం విజయవాడలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో బన్నీ వాసు మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్' చిత్రం తరహాలోనే ఈ 'మిత్రమండలి' చిత్రం కూడా ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది. ప్రేక్షకులకు చక్కని వినోదం పంచాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని రూపొందించాం అన్నారు. కుటుంబంతో కలసి ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది, ఆద్యంతం నవ్వులు పంచుతుంది అని నిర్మాతలు తెలిపారు. ఇదొక క్లీన్ ఎంటర్‌టైనర్ అని ప్రియదర్శి చెప్పారు.

అశ్లీలతకు తావులేని చిత్రం

- రక్షిత్ అట్లూరి



రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా సాయి మోహన్ ఉబ్బన తెరకెక్కించిన చిత్రం 'శశివదనే'. అహితేజ బెల్లంకొండ, అభిలాశ్ రెడ్డి గోడ నిర్మించారు. సినిమా ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ 'మునుపెన్నడూ చూడని విధంగా తండ్రీ కొడుకుల భావోద్వేగాలను దర్శకుడు చక్కగా ఆవిష్కరించారు. గోదావరి జిల్లాల్ని అద్భుతంగా చూపించారు. అశ్లీలతకు తావులేకుండా నిజాయితీగా ఓ మంచి సినిమా చేశాం' అని అన్నారు. చిత్ర దర్శకుడు సాయి మోహన్ మాట్లాడుతూ 'నేను ఎంత అందంగా కథ రాసుకున్నానో..అంతకు మించి అనేలా కోమలి నటించారు' అని అన్నారు. చిత్ర నిర్మాత అహితేజ మాట్లాడుతూ 'ఈ మూవీ ఏ ఒక్కరినీ నిరాశ పర్చదు' అని అన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ కోమలి ప్రసాద్, కెమెరామెన్ సాయికుమార్, నటి అంబికా మాట్లాడారు.

అందర్నీ అలరించేలా..




నూతన నటుడు పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా వీరు ఉలవల తెరకెక్కిస్తున్న చిత్రం 'పురుష'. ఈ కామెడీ చిత్రాన్ని బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. వెన్నెల కిశోర్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తైంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించేలా రూపొందుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలవుతోందని మేకర్స్ తెలిపారు.

'ఎక్స్' వ్యాఖ్యలపై దుమారం.. రాహుల్ రామకృష్ణ వివరణ



'మనం చాలా భయంకరమైన పరిస్థితుల్లో బతుకుతున్నాం. డంబెల్ డోర్ వచ్చి ఈ పరిస్థితులను చక్కదిద్దాలి' అంటూ నటుడు రాహుల్ రామకృష్ణ ఎక్స్ వేదికగా చేసిన కామెంట్స్ సంచలనం సృష్టించాయి. బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్‌ను ట్యాగ్ చేయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అంతటితో ఆగకుండా 'హైదరాబాద్ మునిగిపోయింది. హామీలన్నీ విఫలమయ్యాయి. వీటన్నింటినీ చక్కదిద్దడానికి ప్రజలు మిమ్మల్ని తిరిగి పిలుస్తున్నారు' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ట్యాగ్ చేస్తూ రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేని నటుడు ఇలా మరో పోస్ట్ పెట్టడం చర్చనీయాంశమైంది. తన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో రాహుల్ రామకృష్ణ దిగి వచ్చి వెంటనే తన ఎక్స్ ఖాతాను తొలగించారు. అయినా సోషల్ మీడియాలో వివాదం సద్దుమణగక పోవడంతో శనివారం మళ్లీ ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. ఇకపై ట్విట్టర్ యాక్టివిజానికి దూరంగా ఉంటానని, పూర్తిగా సినిమాలపైనే దృష్టిపెడతానని స్పష్టం చేశారు.

సింగరేణి గనుల నేపథ్యంలో..



సాగర్ కథానాయకుడిగా 'జార్జిరెడ్డి' దర్శకుడు జీవన్‌రెడ్డి ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. సింగరేణి గనుల నేపథ్యంలో పాన్ ఇండియా చిత్రంగా ప్లాన్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రం భారతదేశ సినీ ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని ఇవ్వనుందని పేర్కొన్నారు. నవంబరులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నామని, చిత్రానికి సంబంధించిన ఇతర వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. కాగా, ముఖ్య పాత్రలో మరో స్టార్ హీరోని తీసుకోబోతున్నట్లు సమాచారం. తెలుగు, కన్నడ, తమిళ, హిందీ భాషల్లోని ప్రముఖ నటులు ఈ ప్రాజెక్టులో భాగం కానున్నట్లు తెలిసింది.

శాంతారామ్ సతీమణి కన్నుమూత



ప్రఖ్యాత దర్శకుడు వి.శాంతారామ్ సతీమణి, అలనాటి ప్రముఖ నటి సంధ్య(94) వృద్ధాప్య సమస్యలతో మరణించారు. శాంతారామ్‌కు సంధ్య మూడో భార్య. నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆమె శుక్రవారం రాత్రి ముంబైలోని రాజ్‌కమల్ స్టూడియోస్‌లో తుదిశ్వాస విడిచారు. శనివారం ఉదయం శివాజీ పార్క్‌లో కుటుంబ సభ్యులు ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. 1950, 60లలో పలు హిందీ, మరాఠీ చిత్రాల్లో సంధ్య నటించారు. 'దో ఆంఖే బారా హాథ్', 'నవ్‌రంగ్', 'జనక్ జనక్ పాయల్ బాజే', 'పింజ్రా' సినిమాలు ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి.





విజయవాడలో జరిగిన 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమ సభలో చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆటోడ్రైవర్లు





ఒంగోలు సభలో డబ్బుల మెసేజ్‌లు చూసుకుంటున్న డ్రైవర్లు, కర్నూలులో డబ్బులు పడిన ఆనందంలో..

ఇది మీ నాన్న ఇచ్చిన ఆటో

ఇప్పుడు మిమ్మల్ని తీసుకెళ్తున్నా.. లోకేశ్‌కు మహిళా డ్రైవర్

'ఆటో నడపడం వల్ల ఏ ఇబ్బందులు ఉన్నాయమ్మా' అంటూ మహిళా ఆటో డ్రైవర్ స్వర్ణలతను మంత్రి లోకేశ్ అడిగారు. పెద్దగా ఇబ్బందులు లేవన్నా.. అని ఆమె బదులిచ్చారు. '2014-15 మధ్య ఆటో నడపడం నేర్చుకున్నాను. నాకు అప్పట్లో ఆటో తాళం చంద్రబాబు ఇచ్చారు. ఇప్పుడు మీరు నా ఆటో ఎక్కారు. నాకు చాలా సంతోషంగా ఉంది' అని ఆమె తెలిపారు. కూటమి నేతలకు మద్దతుగా తరలివచ్చిన వేలాది మంది నాయకులు ప్రజలతో ప్రకాశం బ్యారేజీ పరిసరాలు కిక్కిరిశాయి. బాణాసంచా కాలుస్తూ తీన్మార్ డప్పులతో నేతలకు వారంతా ఘనస్వాగతం పలికారు.

సర్కారీ క్యాబ్ యాప్

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది లబ్ధిదారులకు రూ.436కోట్ల చెక్‌ను ఈ పథకం కింద అందించారు. సమావేశంలో చంద్రబాబు ప్రసంగించే సమయానికి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15వేలు జమ అయినట్టు మెసేజ్‌లు వచ్చాయి. 'డబ్బులు పడ్డాయా...' అని అడిగినపుడు ఈ మెసేజ్‌లను ఆటోడ్రైవర్లు సంతోషంగా చంద్రబాబుకు చూపించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఆటో డ్రైవర్లకు వేధింపులు ఉండవని, జరిమానాలు రద్దుచేసే అంశాన్ని కూడా పరిశీలిస్తానని సీఎం తెలిపారు. అలాగని రోడ్ల మీద ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించవద్దని,ఎక్కడిపడితే అక్కడ సీసీ కెమెరాలు ఉంటాయని, అనవసరంగా ఇబ్బందులు తెచ్చుకోవద్దని హితవు పలికారు. విజయవాడలో పూర్తిగా సీఎన్‌జీ ఆటోలు నడుస్తున్నాయని, ఇది చాలా మంచి విషయమని, ఇక ఈవీలను ఎక్కువగా ప్రోత్సహిస్తామని సీఎం తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

ఈసారి కూటమి సీట్లు పెరగాలా? వద్దా?

"గత ఎన్నికలలో మాకు 94 శాతం స్ట్రైక్ రేట్‌తో పట్టం కట్టారు. రాబోయే రోజుల్లో ఈ సీట్లు పెరగాలా ? వద్దా ?పదహారు నెలల ముందు రాష్ట్రం పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వ్యవస్థలన్నీ నిర్వీర్యమై, అభివృద్ధి పూర్తిగా ఆగిపోయింది. నాల్గవసారి ముఖ్యమంత్రిని అయినా.. నాకే చాలా రోజులు పరిస్థితులు అర్థం కాలేదు. ఏం చేయాలని రాత్రుళ్లు ఆలోచించేవాడిని. నిద్ర కూడా పట్టేది కాదు. నా మీద ఉంచిన విశ్వాసం కారణంగా ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకూడదన్న ఉద్దేశంతో పని ప్రారంభించాను. కూటమి పాలన మొదలై 15 నెలలు గడిచింది. చరిత్రలోనే ఇన్ని సంక్షేమ కార్యక్రమాలను అందించటం ఎప్పుడైనా చూశారా? సూపర్‌సిక్స్ హామీలను చేసి చూపిస్తున్నాం. దేశంలోనే ఎక్కడా జరగని సంక్షేమం ఏపీలో జరుగుతోంది. పెన్షన్లను రూ. 4 వేలు, రూ 6 వేలు, రూ 10 వేలు, రూ 15 వేలకు పెంచాం. తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో ఎంతమంది ఉంటే అంత మందికీ సహాయం అందిస్తున్నాం. ఆడబిడ్డల కోసం మూడు ఉచిత సిలిండర్లను ప్రభుత్వం అందిస్తోంది. అన్ని వర్గాల సంక్షేమాన్ని చూస్తున్నాం. పేదవాడి ఆకలి తీర్చటానికి అన్న క్యాంటీన్లను నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో ప్రజలందరి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని యూనివర్సల్ హెల్త్ పాలసీని తీసుకువస్తున్నాం. ఈ పథకంలో భాగంగా రూ. 25 లక్షలు ఖర్చు పెట్టి మీ ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. జీఎస్టీ తగ్గింపుల కారణంగా ధరలు అదుపులోకి వస్తున్నాయి. ఎలక్ట్రానిక్స్ ఆటో మొబైల్స్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతున్నాయి. మహిళల కోసం స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించాం. దీనికింద పెట్టిన ఉచిత బస్సులు ఎక్కి శ్రీకాకుళం, విజయనగరం వంటి ప్రాంతాల నుంచీ దసరా ఉత్సవాల కోసం మహిళలు భారీ సంఖ్యలో విజయవాడకు తరలివచ్చారు."

వైకుంఠపాళీ ఆడొద్దు

"ప్రజాకంఠకుడు మహిషాసురుడిని కనకదుర్గమ్మ సంహరించిన రోజును దసరాగా జరుపుకొంటాం. మరో ప్రజా కంఠకుడు నరకాసురుడిని సత్యభామతో కలిసి శ్రీకృష్ణుడు సంహరించిన రోజున దీపావళి చేసుకుంటాం. రాష్ట్రంలో గత ఐదేళ్లలో ప్రజా కంఠక పాలన ఏవిధంగా జరిగిందో మీరంతా చూశారు. నాసిరకం మద్యం ఇచ్చి ఎన్నో కుటుంబాల ఉసురుతీసుకున్నారు. పేదవాళ్లకు ఇవ్వాల్సిన ఇసుకను బొక్కేశారు. పేదల ఇంటి జాగాలను లాగేశారు. ఇలాంటి దుర్మార్గులు రాజకీయాలకు పనికిరారు. ప్రజలు కూడా వైకుంఠపాళీ ఆడొద్దు. అన్నీ ఇస్తున్నా ఇంకొకరు ఏదో ఇస్తారని చూడవద్దు. ఏమీ ఇవ్వరు. గుజరాత్‌లో మూడు దఫాలుగా బీజేపీ ప్రభుత్వం ఉంది. అందువల్ల అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. ఏపీలో కష్టకాలంలో నేను, పవన్ కల్యాణ్, బీజేపీ...ఎన్డీఏగా కలిశాం. మీ కష్టాలు తీరుస్తామని ఆనాడు ఇచ్చిన మాటను మేం నిలుపుకొన్నాం." అని చంద్రబాబు తెలిపారు.

స్ఫూర్తిని నింపిన ఆటోడ్రైవర్

"ఆటోలో ఎక్కించుకుని నన్ను సభావేదిక దగ్గరకు తెచ్చిన అఫ్సర్‌ఖాన్ తండ్రి డ్రైవర్. అందువల్ల అఫ్సర్ ఖాన్ కూడా ఆటో వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారు. కానీ, తన కుమారులు మాత్రం తనలా కాకూడదని ఆయన గట్టి నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా పెద్దబ్బాయిని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. చిన్నబ్బాయి ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఆ అబ్బాయి పదో తరగతిలో రాష్ట్రంలో నాల్గో ర్యాంక్ సాధించాడు. అందరూ అఫ్సర్ ఖాన్ కుటుంబం నుంచి స్ఫూర్తిని పొందాలి."

భారమైనా.. భరిస్తాం!

సమర్థ నాయకత్వం, ప్రణాళికా బద్ధమైన పాలనతో రాష్ట్రాభివృద్ధి



- 'స్త్రీశక్తి'తో వారికి జరిగే నష్టం గురించి క్యాబినెట్‌లో మాట్లాడా
- రోడ్లపై గుంతలు, గ్రీన్‌ట్యాక్స్ సమస్యలూ పరిష్కరించాం
- 'ఆటోడ్రైవర్ల సేవ'లో ప్రారంభ సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విజయవాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఆటో డ్రైవర్ల సేవ'లో పథకం అమలుతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.436 కోట్ల భారం పడుతుందని, అయినా ఆ భారాన్ని ఆనందంగా భరిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సమర్థవంతమైన నాయకత్వం, ప్రణాళికా బద్ధమైన పాలన ఉంటే ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. మహిళల కోసం 'స్త్రీశక్తి' పథకాన్ని ప్రవేశపెడుతున్న సందర్భంగా క్యాబినెట్‌లో చర్చ జరిగిందని, ఈ పథకం కారణంగా ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటుందన్న అంశాన్ని తాను ప్రస్తావించానని తెలిపారు. ఆటోడ్రైవర్లను నిర్లక్ష్యం చేయబోమని, ఎట్టి పరిస్థితుల్లో వారికి నష్టం జరగకుండా చూస్తామని సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. అయితే దీనికి సమయం కావాలని అడిగారని, ఆ రోజు చెప్పిన ప్రకారమే ఆటోడ్రైవర్లకు రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందించే పథకానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బందికరమైన విషయమే అయినప్పటికీ కచ్చితమైన ప్రణాళికతో దీన్ని అమలు చేస్తున్నారని కొనియాడారు. ఈ పథకంలో మొత్తం 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్ల లబ్ధి కలుగుతుందన్నారు. ఎన్నికల ముందు పిఠాపురంలో ఆటోలో ప్రయాణించినప్పుడు ఆటోడ్రైవర్లు తమ ఇబ్బందులను తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. గ్రీన్ ట్యాక్స్ సమస్యను ఏడాదిన్నరలోపే పరిష్కరించామని తెలిపారు. అలాగే రోడ్లపై గోతుల కారణంగా గత వైసీపీ ప్రభుత్వంలో వాహనమిత్ర కింద ఇచ్చిన రూ.10వేలు మరమ్మతులకే ఖర్చయి పోయేవని పవన్ వివరించారు. దెబ్బతిన్న రోడ్లను కూటమి ప్రభుత్వం పూడ్చటంతో పాటు వాటిని అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆటోవాలాలకు ఎలాంటి మరమ్మతులు చేసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన దానికంటే అదనంగా రూ.5వేలు పెంచి ఆర్థిక సహాయం కింద రూ.15వేలు అందించడం మంచి విషయమన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నందుకు సీఎం చంద్రబాబుకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆటోల్లో.. సభావేదిక వద్దకు

- వేర్వేరు ఆటోల్లో 14 కిలోమీటర్ల ప్రయాణం
- డ్రైవర్లతో మాటలు కలిపి కష్టాలు తెలుసుకున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, మాధవ్

విజయవాడ, తాడేపల్లి టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఆటోడ్రైవర్ల సేవలో..'పథకాన్ని ప్రారంభించడానికి కూటమి ప్రభుత్వ నేతలు ఆటోల్లో ప్రయాణించి సభాస్థలికి చేరుకున్నారు. సీఎం చంద్రబాబు తన నివాసం నుంచి సభా ప్రాంగణం వరకు ఆటోలో ప్రయాణించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీతానగరం ఆటోస్టాండ్ నుంచి బయలుదేరారు. మంత్రి లోకేశ్, బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్ ఉండవల్లి నుంచి వేర్వేరు ఆటోల్లో వచ్చారు. వీరంతా 14 కిలోమీటర్ల దూరం ప్రయాణించి విజయవాడ చేరుకున్నారు. లబ్ధిదారుల కుటుంబసభ్యులు కూడా వారితోపాటు ఉన్నారు. దారిలో వస్తున్నంతసేపు వారి కుటుంబ స్థితిగతులను నేతలు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు డ్రైవర్ అఫ్సర్‌ఖాన్ కుటుంబంతో ఆటోలో కలిసి వచ్చారు. అఫ్సర్ కుమారుడితో సీఎం మాట్లాడారు. "మీ నాన్న ఆటో నడుపుతున్నాడనే విషయాన్ని గుర్తుపెట్టుకొని మంచి ఐటీ ఉద్యోగం సాధించాలి" అని సూచించారు. డీజిల్ ఆటో కంటే సీఎన్‌జీ ఆటో వల్ల నెలకు రూ.1000 నుంచి 1,500 వందలు మిగులుతాయని ఆటో డ్రైవర్ తెలిపారు. కాగా, సీఎన్‌జీ ఆటోలో పవన్ కల్యాణ్ ప్రయాణం చేశారు. 'సీఎన్‌జీ ఆటోకు గ్యాస్ ఎలా నింపుకుంటారు...ఎన్ని కేజీలు ఉంటుంది.. తదితర వివరాలను డ్రైవర్‌ను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఆటో నడపడం వల్ల వచ్చే ఆదాయం ఎంత... కుటుంబానికి ఎంత ఖర్చవుతుంది.. అంటూ ఆరా తీశారు. ఈ- స్కూటర్ ఎలా ఉంటుందని పవన్ అడిగి తెలుసుకున్నారు. బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్ తాను ప్రయాణించిన ఆటో డ్రైవరుతో మాటలు కలిపారు. సభా ప్రాంగణానికి చేరుకున్న తర్వాత డ్రైవర్లకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, మాధవ్ ఆటో చార్జీలు చెల్లించారు.







ఆటోలో సభకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్



జనసేన ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

జనసేన బలోపేతానికి త్రిశూల వ్యూహం

- పార్టీ శ్రేణులతో ప్రజాప్రతినిధులు మమేకమవ్వాలి
- కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుని ఒకే గళం వినిపించాలి
- యువత, మహిళల సంక్షేమం, రక్షణకు ప్రాధాన్యమివ్వాలి
- జనసేన ఎమ్మెల్యేల సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 'కూటమిని బలపరుస్తూనే జనసేన పార్టీ బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలి. దీని కోసం త్రిశూల వ్యూహాన్ని అమలు చేయాలి. ఇందుకు సంబంధించిన విధివిధానాలు త్వరలోనే తెలియజేస్తాం. వాటిని ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో అమలు చేయాలి' అని జనసేన ప్రజాప్రతినిధులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. శనివారం రాత్రి మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ శాసన సభ పక్ష సమావేశం నిర్వహించారు. 3గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో జనసేన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. పాలన, రాజకీయపరమైన అంశాలపై పవన్ వారికి దిశా నిర్దేశం చేశారు. 'ప్రజా ప్రతినిధులుగా అందరం యువత, మహిళల ఆకాంక్షలను అర్థం చేసుకోవడం చాలా అవసరం. ఈ వర్గాల అభివృద్ధి, సంక్షేమం, రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి' అని పవన్ స్పష్టం చేశారు. 'ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ 5 నియోజకవర్గాల చొప్పున బాధ్యత తీసుకొని పార్టీ శ్రేణులతో మమేకం కావాలి. జనసైనికులు, వీర మహిళలకు భరోసా కల్పించాలి. వారితో పాటు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించండి. ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులకు సంక్షేమం ఏ విధంగా చేరుతోంది, యువతకు నైపుణ్య శిక్షణ, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం తదితర విషయాలపై దృష్టి సారించండి. రహదారుల కల్పన, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించాలి. ప్రభుత్వంద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలి. ఇందుకోసం ఒక్కోఅంశంపై ఒక్కో కమిటీ వేసుకుందాం. ఆరు వారాల్లోగా ఆయా కమిటీలు నివేదికలు అందించాలి." అని పవన్ తెలిపారు.

నవ తరంతో మాట్లాడండి

'జనసేన పార్టీకి మిలీనియల్స్ బలంగా నిలిచారు. వారిఆకాంక్షలు గ్రహించాలి. జెన్ జీ తరంతోనూ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, చర్చిస్తూ ఉండండి. వాళ్లు ప్రతి విషయాన్ని గమనిస్తూనే ఉంటారు. గత ప్రభుత్వం రుషికొండ ప్యాలెస్‌ను నిర్మించి, ఎన్ని రూ.వందల కోట్లు వృథాచేసిందో వారికి తెలుసు. మనం కచ్చితంగా రుషికొండ ప్యాలెస్‌ను సద్వినియోగపరచడంపై దృష్టిపెట్టాలి. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు ఈసమావేశంలో పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి ధన్యవాదాలు

జీఎస్టీ 2.0 సంస్కరణలు అమలు చేస్తున్న ప్రధాన మోదీకి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రవేశపెట్టగా, సుందరపు విజయ్‌కుమార్ బలపరిచారు. సమావేశంలో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత

- డ్రైవర్ల సమస్యలన్నీ పరిష్కరించాం
- ఆటోలపై కొటేషన్లు చదివి డ్రైవర్లను ఉత్తేజ పరిచిన లోకేశ్



డిప్యూటి సీఎం పవన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి లోకేశ్

విజయవాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోవాలాల సంక్షేమం, వారి పిల్లల భవిష్యత్తు బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర మంత్రి లోకేశ్ చెప్పారు. ఇంట్లో ఎన్ని ఇబ్బందులు ఉన్నా నవ్వుతూ ప్రయాణికులను పలుకరిస్తారని ఆటో డ్రైవర్లను కొనియాడారు. సామాన్యుడి కారు ఆటో అని అభివర్ణించారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రూ.10 వేలు ఆర్థిక సహాయంగా ఇచ్చినట్టే ఇచ్చి.. మరోరకంగా వెనక్కి లాక్కునేవారని చెప్పారు. యువగళం పాదయాత్ర సందర్భంగా డ్రైవర్లు నాటి సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే.. వారి నుంచి వివరాలు తెలుసుకున్నానని అన్నారు. వివిధ రకాల జరిమానాలతో పాటు, గుంతల రోడ్ల వల్ల మరమ్మతులకు చాలా డబ్బులు ఖర్చయ్యేవని చెప్పారు. ఆటోడ్రైవర్ల సమస్యలన్నింటినీ కూటమి ప్రభుత్వం వచ్చాక పరిష్కరించామన్నారు. గ్రీన్ ట్యాక్స్‌ను రూ. 3 వేలకు తగ్గించేలా చేశామని, రోడ్లపై గుంతలు పూడ్చించడంతో పాటు కొత్త రోడ్లు వేయిస్తున్నాం. ఇక గ్రామ స్థాయి నుంచి దేశ రాజకీయాల వరకు ఆటోల్లోనే చర్చ నడుస్తుందని, వైనాట్ 175 అంటే ఆటో డ్రైవర్ల మౌఖిక ప్రచారం కారణంగా 11 సీట్లకే పరిమితం అయ్యిందని గుర్తుచేశారు.

ఆలోచింపజేసేలా కొటేషన్లు

ఆటోల మీద కొటేషన్లను ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ చదివి వినిపించారు. 'వర్షం ఎలా పడుతుంది అని మీ పిల్లలు అడిగితే దేవుడు కురిపిస్తాడని చెప్పొద్దు.. ఒక మొక్క నాటితే చుక్క వర్షం పడుతుందని చెప్పండి' అన్న కొటేషన్‌తో పర్యావరణ పరిరక్షణకు ఒక ఆటో డ్రైవరన్న ప్రచారం చేస్తున్నాడన్నారు. మరో ఆటో డ్రైవరన్న 'అందరూ బాగుండాలి.. అందులో నేనుండాలి' అంటూ మంచితనాన్ని చాటుకున్నారని చెప్పారు. అలాగే మరో కొటేషన్ ' జరభద్రం భయ్యా.. మనం జాగ్రత్త'తో ఆటో డ్రైవర్లు రోడ్డుభద్రత గురించి ప్రచారం చేస్తున్నారని మెచ్చుకున్నారు. 'అప్పుచేసి కొన్నాను.. నన్ను చూసి ఏడవకండి' అన్న కొటేషన్ల గురించి ప్రస్తావిస్తూ ఆటో డ్రైవర్లతో సరదాను పంచుకున్నారు.

మహిళలకు గౌరవం దక్కాలి

అతివలు అంతరిక్షంలోకి వెళ్తున్నారని, ఆటోలు నడుపుతున్నారని అలాంటి ఆడవారిని అవమానించే మాటలు మాట్లాడకూడదని లోకేశ్ అన్నారు. మహిళలకు తగిన గౌరవం దక్కాలన్నారు. గతంతో కొందరు నేతలు బయటకు రావాలంటే పరదాలు, బారికేడ్లు పెట్టుకునేవారని ఇప్పుడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సామాన్యులు వలే ఆటోల్లో ప్రయాణం చేశారన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

- 'ఆటో డ్రైవర్ల సేవలో' మంత్రుల ఉద్ఘాటన
- రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా కార్యక్రమాలు
- స్వయంగా ఆటోలు నడిపిన మంత్రులు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

దేశంలోని మరే రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రులు ఉద్ఘాటించారు. 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమం ప్రారంభం సందర్భంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఖాకీ చొక్కాలు ధరించి పాల్గొన్నారు. విజయనగరంలో నిర్వహించిన కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఒంగోలులో నిర్వహించిన భారీ ఆటో ర్యాలీలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆటోను నడపగా, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆటోలో కూర్చుని ప్రయాణించారు. కడప జిల్లా పులివెందులలో మంత్రి సవిత స్వయంగా ఆటో నడిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి మంత్రి నిమ్మల రామానాయుడు, ఆటోడ్రైవర్లు క్షీరాభిషేకం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆటోలు నడిపారు. నెల్లూరు జిల్లాలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆటోడ్రైవర్లను నమూనా చెక్కును అందజేశారు. ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. గుంటూరులో మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌తో కలిసి ఆటోలో ప్రయాణించారు. బాషా సినిమాలోని ఒక్కసారి చెబితే వంద సార్లు చెప్పినట్లు అన్న డైలాగ్‌ను మంత్రి ఉదహరించారు. విశాఖపట్నం జిల్లా సిరిపురంలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌తో కలిసి ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. అల్లూరి జిల్లా పాడేరులో మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ నమూనా చెక్కు పంపిణీ చేశారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం పట్టణంలో మంత్రి పి.నారాయణ ఆటో నడిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో మంత్రి కొలుసు పార్థసారథి ఖాకీ డ్రస్ ధరించి ఆటో నడిపారు.



విజయనగరం సభలో మాట్లాడుతున్న అనిత

ఖద్దరు కన్నా ఖాకీ ఇచ్చిన ధైర్యమే ఎక్కువ: రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ "ఖద్దరు కన్నా.. ఖాకీ వేసుకుంటేనే ఎక్కువ ధైర్యం వస్తోంది. విమానయాన శాఖ మంత్రిగా విమాన కాక్ పిట్ వెళ్లేటప్పుడు ఇచ్చే ఆనందం కన్నా .. ఆటో క్యాబిన్‌లో ప్రయాణిస్తూ ఉంటే ఎక్కువ సుఖంగా ఉంటుంది' అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆటో నడిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామన్నారు. ఆటో డ్రైవర్లు తమ ప్రచారకర్తలన్నారు.







శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్, పులివెందులలో మంత్రి సవిత ఆటో నడుపుతున్న దృశ్యం, గుంటూరులో ఆటోలో ప్రయాణిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి దుర్గేశ్

యువతలో నైపుణ్యాభివృద్ధికి 'పీఎం-సేతు'

- కేంద్ర ప్రాయోజిత పథకాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- 1,000 ప్రభుత్వ ఐటీఐలను ఆధునికీకరించాలని యోచన

న్యూఢిల్లీ, అక్టోబరు 4: ప్రధాని మోదీ శనివారం రూ.62 వేల కోట్లకు పైగా విలువైన పలు యువత కేంద్రీకృత కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడితో కేంద్ర ప్రాయోజిత పథకమైన పీఎం-సేతు (ఆధునికీకరించిన ఐటీఐల ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి పరివర్తన)ను ప్రధాని ప్రారంభించారు. ఈ స్కీమ్ కింద 1,000 ప్రభుత్వ ఐటీఐలను 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో 200 హబ్ ఐటీఐలు, 800 స్పోక్ ఐటీఐలుగా ఆధునికీకరించనున్నారు. పథకం అమలు మొదటి దశలో బిహార్‌లో పాట్నా, దర్భంగాల్లోని ఐటీఐలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అదేవిధంగా బిహార్‌లో పునరుద్ధరించిన 'ముఖ్యమంత్రి నిశ్చయ్ స్వయం సహాయత భట్టా యోజన' పథకాన్ని కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ స్కీమ్ కింద దాదాపు 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు నెలకు రూ.వెయ్యి చొప్పున రెండేళ్ల పాటు భత్యం ఇవ్వనున్నారు. దీంతో పాటుగా వారికి ఉచిత నైపుణ్య శిక్షణ అందించనున్నారు. ఇంకా రీడిజైన్ చేసిన 'బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డు స్కీమ్'ను కూడా ప్రధాని ప్రారంభించారు. దీని కింద ఉన్నత విద్య అభ్యసించేందుకు ఆర్థిక భారం పడకుండా వడ్డీ రహితంగా రూ.4 లక్షల వరకు విద్యా రుణాలు అందించనున్నారు. ఈ స్కీమ్ కింద ఇప్పటికే 3.92 లక్షల మంది రూ.7,880 కోట్ల రుణాలు పొందారు. ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా శ్రామిక శక్తిని తయారు చేసేందుకు పరిశ్రమ ఆధారిత కోర్సులు, వృత్తి విద్యను ప్రోత్సహించేందుకు జన్‌నాయక్ కర్పూరీ ఠాకూర్ స్కిల్ వర్సిటీని ప్రధాని ఆవిష్కరించారు.

ప్రిలిమ్స్ పూర్తయిన వెంటనే 'కీ'ని ప్రచురిస్తాం


- సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో యూపీఎస్సీ

న్యూఢిల్లీ, అక్టోబరు 4: సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ముగిసిన వెంటనే తాత్కాలిక జవాబులతో 'కీ'ని ప్రచురించడానికి యూపీఎస్సీ సంసిద్ధత వ్యక్తం చేసింది. దానిపై అభ్యర్థులు తమ అభ్యంతరాలను దాఖలు చేసుకోవడానికి అంగీకరించింది. ఈ మేరకు జస్టిస్ పీఎస్ నరసింహ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు అఫిడవిట్ దాఖలు చేసింది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించే విషయమై సమగ్రంగా చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ప్రిలిమ్స్ ప్రశ్నపత్రంలో దొర్లిన తప్పులను సవాలు చేయడానికి కమిషన్ తమకు అవకాశం ఇవ్వడం లేదని సివిల్స్ ఆశావహులు ఏళ్ల తరబడి ఆరోపిస్తున్నారు. మొత్తం పరీక్ష ప్రక్రియ ముగిసిన తర్వాత కీని విడుదల చేసే ప్రస్తుత పద్ధతికి బదులుగా వాటిని తక్షణమే ప్రచురించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను ధర్మాసనం విచారిస్తోంది.

పిల్లల ఆధార్ అప్‌డేట్ రుసుముల రద్దు

న్యూఢిల్లీ, అక్టోబరు 4: పిల్లల ఆధార్ బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేసేందుకు రుసుములను రద్దు చేసినట్టు విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) శనివారం ప్రకటించింది. ఈ మాఫీ ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని, ఏడాది పాటు కొనసాగుతుందని తెలిపింది. అయిదేళ్ల లోపు పిల్లలకు ఫొటో, పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి వివరాలతో ఆధార్ కార్డు ఇస్తారు. ఆ సందర్భంగా పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. వారి వేలి ముద్రలు, ఐరిస్‌ను మాత్రం తీసుకోరు.

సీనియర్ జర్నలిస్ట్ టీజేఎస్ జార్జ్ కన్నుమూత



బెంగళూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్ట్ టీజేఎస్ జార్జ్ బెంగళూరులో శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. వయోభారం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న జార్జ్(97) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బెంగళూరులో ఆదివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమార్తె శిబా తెలిపారు. 1938, మే 7న కేరళలో జన్మించిన జార్జ్.. 1950లో ఫ్రీ ప్రెస్ జర్నల్ ద్వారా బొంబాయిలో పాత్రికేయ వృత్తిలో ప్రవేశించారు. సుదీర్ఘకాలం ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కొనసాగారు. సుమారు రెండున్నర దశాబ్దాలపాటు 'పాయింట్ ఆఫ్ వ్యూ' పేరిట కాలమ్స్ రాశారు. 2007లో కన్నడ రాజ్యోత్సవ పురస్కారం, 2011లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు.

'పూర్వోదయ'ను సద్వినియోగం చేసుకోవాలి

- 'డ్వాక్రా'లకు పశువుల సామూహిక షెడ్ల బాధ్యతలు: చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రారంభించిన 'పూర్వోదయ' పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. పూర్వోదయ మిషన్‌లో భాగంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో రూపొందించుకోవాల్సిన ప్రణాళికలపై శనివారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సమీక్షించారు. ఉద్యాన పంటలు, సూక్ష్మసేద్యం, మత్స్య, ఆక్వా, ఆహార శుద్ధి రంగాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఆయా రంగాల్లో అభివృద్ధి సాధించడంతోపాటు, వాటిపై ఆధారపడిన వారి జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా చూడాలన్నారు.

గాజాలో శాంతి వైపు అడుగులు!

ట్రంప్ శాంతి ప్రణాళికను కొన్ని షరతులతో అంగీకరించిన హమాస్.. బందీల అప్పగింతకు సిద్ధమని ప్రకటన

- గాజాలో దాడులు వెంటనే ఆపాలని ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచన



దేర్ అల్ బలా (గాజా), అక్టోబరు 4: గాజాలో శాంతి స్థాపన వైపు అడుగులు పడుతున్నాయి. శాంతి ఒప్పందానికి ముందుకు రావాలని, లేకుంటే నరకం చూపిస్తామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలతో హమాస్ కాస్త దిగొచ్చింది. ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల ప్రణాళికలో బందీల విడుదల సహా కొన్ని అంశాలకు అంగీకారం తెలిపింది. దీనిపై ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. శాశ్వత శాంతికి వారు సిద్ధంగా ఉన్నారని నమ్ముతున్నానని 'ట్రూత్' సోషల్‌లో పోస్టు పెట్టారు. గాజాలో బాంబు దాడులను వెంటనే ఆపేయాలని, అలాగైతేనే బందీలను సురక్షితంగా, వేగంగా విడుదల చేయించుకోగలమని ఇజ్రాయెల్‌కు సూచించారు. ట్రంప్ స్పందనపై హమాస్ హర్షం వ్యక్తం చేసింది. "ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచనలు శాంతికి మార్గం వేసేలా ఉన్నాయి. బందీల పరస్పర మార్పిడి, గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం ఉప సంహరణ, యుద్ధం ముగింపుపై వెంటనే చర్చలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని హమాస్ రాజకీయ విభాగం మీడియా సలహాదారు తాహిర్ అల్ నౌనూ ప్రకటించారు. ఇక ట్రంప్ శాంతి ప్రణాళిక ప్రకారం మొదటి దశ అమలు కోసం తాము సిద్ధమవుతున్నట్టు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. కానీ ఉన్నట్టుండి గాజా సిటీ, ఖాన్ యూనిస్‌లోని పలు ప్రాంతాలపై వైమానిక, డ్రోన్ దాడులు చేసింది. ఇందులో ఆరుగురు పౌరులు మృతి చెందారు. మరోవైపు, గాజాలో శాంతి కోసం ట్రంప్ నాయకత్వంలో నిర్ణయాత్మక ముందడుగు పడిందని ప్రధాని మోదీ 'ఎక్స్'లో ప్రశంసించారు. బందీల విడుదలకు హమాస్ అంగీకరించడం శాంతి స్థాపనలో కీలక పరిణామమన్నారు. కాగా, శాంతి ప్రణాళికపై హమాస్ వేగంగా చర్యలు చేపట్టాలని, ఏమాత్రం ఆలస్యమైనా దారుణ పరిస్థితులు తప్పవని ట్రంప్ మరోసారి హెచ్చరించారు.

రెండేళ్ల మారణ హోమం..

2023 అక్టోబరు 7న హమాస్ వేలాది రాకెట్లతో చేసిన మెరుపుదాడిలో 1,200 మంది ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. మరో 251 మందిని హమాస్ బందీలుగా తీసుకెళ్లింది. దీనితో తీవ్రంగా ఆగ్రహించిన ఇజ్రాయెల్.. గాజాపై భీకరదాడులకు దిగింది. ఇజ్రాయెల్ దాడులతో గత రెండేళ్లలో గాజాలో 67 వేల మందికిపైగా మరణించారని హమాస్ ఆరోగ్య విభాగం ప్రకటించింది.

హమాస్ చేస్తున్న డిమాండ్లు ఏమిటి?

గాజా రాజకీయ భవిష్యత్తు, పాలస్తీనా హక్కులపై పూర్తి స్పష్టత రావాలని.. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని హమాస్ కోరుతోంది. గాజా నుంచి ఇజ్రాయెల్ దళాలు సంపూర్ణంగా తొలగిపోవాలని డిమాండ్ చేస్తోంది. గాజా పరిపాలనను నిపుణులతో కూడిన స్వతంత్ర పాలస్తీనా సంస్థకు అప్పగించేందుకు సిద్ధమని.. అయితే అమెరికా చెప్పినట్టుగా కాకుండా అరబ్, ఇస్లామిక్ దేశాలు, పాలస్తీనావాసుల ఉమ్మడి అంగీకారంతో ఈ ఏర్పాటు జరగాలని కోరుతోంది. అయితే 20సూత్రాల ప్రణాళికలో కీలకమైన ఆయుధాలు వదిలేయాలన్న అంశంపై హమాస్ ఎలాంటి స్పందన వెల్లడించలేదు. హమాస్ ఇంకా 48 మంది బందీలను అప్పగించాల్సి ఉంది. అందులో 20 మందే జీవించి ఉన్నట్టు అంచనా. మరోవైపు ఇజ్రాయెల్ వద్ద బందీలుగా ఉన్న సుమారు 250 మంది పాలస్తీనీయులను విడుదల చేసే అవకాశం ఉంది.

శాంతికి అడ్డంకులు మరెన్నో..

ట్రంప్ 20 సూత్రాల శాంతి ప్రణాళికలో పాలస్తీనా దేశం ఏర్పాటు అంశం కూడా ఉంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ దీనికి తాము సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. ఒప్పందంలో ఈ అంశం లేదని, పాలస్తీనా దేశం ఏర్పాటుకు తాము ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. మరోవైపు ఆయుధాలు వదిలేసేందుకు హమాస్ సిద్ధంగా లేదు. ప్రస్తుతం పాలనను స్వతంత్ర పాలస్తీనా సంస్థకు అప్పగించేందుకు సిద్ధమని హమాస్ చెప్పినా.. అధికారంలో భాగస్వామ్యం కావొద్దన్న నిబంధననూ అంగీకరించడం లేదు. అంతేకాదు కీలక మధ్యవర్తులైన ఈజిప్ట్, ఖతార్ మాత్రం ట్రంప్ 20సూత్రాల ప్రణాళికలోని కొన్ని అంశాలపై లోతుగా చర్చించి, స్పష్టతకు రావాల్సి ఉందని ప్రకటించాయి.

పుట్టుకతో సంక్రమించే పౌరసత్వాన్ని రద్దుచేయలేరు

ట్రంప్ సర్కారుకు తేల్చి చెప్పిన ఫెడరల్ అప్పీళ్ల కోర్టు

బోస్టన్/సియాటెల్, అక్టోబరు 4: దేశంలో అక్రమంగా ఉంటున్న, లేదా తాత్కాలికంగా నివసిస్తున్న ప్రజలకు జన్మించే పిల్లలకు పుట్టుకతో సంక్రమించే పౌరసత్వాన్ని రద్దు చేయలేరని బోస్టన్‌లోని ఒక ఫెడరల్ అప్పీళ్ల కోర్టు ట్రంప్ సర్కారుకు తేల్చి చెప్పింది. ఫస్ట్ యూఎస్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌కు చెందిన ముగ్గురు జడ్జీల ప్యానెల్ శుక్రవారం ఈ మేరకు రూలింగ్ ఇచ్చింది. ట్రంప్ ఆదేశాన్ని నిలిపివేస్తూ, అలాగే ఆ ఆదేశాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు అనుమతిస్తూ కింది కోర్టు జారీ చేసిన ప్రిలిమినరీ ఇంజక్షన్ ఆర్డర్‌ను జడ్జీల ప్యానెల్ సమర్థించింది. దీంతో ఈ అంశంపై ట్రంప్ జారీ చేసిన ఆదేశాలకు చట్టపరంగా అవరోధాలు పెరిగినట్టైంది. ఈ అంశంపై ట్రంప్ ఆదేశాలను అడ్డుకున్న 5వ ఫెడరల్ కోర్టు ఇది. జనవరిలో ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రోజే ఈ వివాదాస్పద ఆదేశంపై సంతకం చేశారు. అమెరికాలో అక్రమంగా, లేదా తాత్కాలికంగా నివసిస్తున్న ప్రజలకు జన్మించే పిల్లలకు ఆటోమేటిక్‌గా సంక్రమించే పౌరసత్వ హక్కును నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

హెచ్1బీ వీసా ఫీజు పెంపును అడ్డుకోండి..

హెచ్1బీ వీసా ఫీజును రూ.88 లక్షలకు పెంచాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ కోర్టులో తాజాగా పిటిషన్ దాఖలైంది. ట్రంప్ నిర్ణయాన్ని అడ్డుకోవాలని కోరుతూ వైద్య సిబ్బంది, మత సంస్థల నాయకులు, ప్రొఫెసర్లు సంయుక్తంగా శుక్రవారం శాన్‌ఫ్రాన్సిస్కోలోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. 'ట్రంప్ నిర్ణయాన్ని అడ్డుకోకపోతే ఆస్పత్రులు వైద్య సిబ్బందిని, తరగతి గదులు టీచర్లను కోల్పోతాయి. దేశవ్యాప్తంగా పరిశ్రమలు కీలక ఆవిష్కర్తలను కోల్పోయే ముప్పు పొంచి ఉంది' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

చెల్లుబాటు కాని ఫాస్టాగ్ వాహనదారులకు ఊరట

- యూపీఐతో చెల్లిస్తే 1.25 రెట్ల టోల్ చార్జీనే
- నవంబరు 15 నుంచి అమలు

న్యూఢిల్లీ, అక్టోబరు 4: జాతీయ రహదారులపై ఉండే టోల్ ప్లాజాల వద్ద నగదు లావాదేవీలను తగ్గించి డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం చెల్లుబాటు కానీ, పనిచేయని ఫాస్టాగ్‌తో టోల్ ప్లాజాలోకి వాహనాలు ప్రవేశించినప్పుడు సాధారణ టోల్ మొత్తంకన్నా రెండు రెట్లు అధికంగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ మొత్తాన్ని నగదు రూపంలో కాకుండా యూపీఐని వాడి వాహనదారులు చెల్లింపులు చేస్తే మాత్రం 1.25 రెట్లు మాత్రమే వసూలు చేయనున్నారు. దీంతో ఆయా వాహనదారులకు కాస్త ఊరట లభించనుంది. తాజా నిబంధనను నవంబరు 15 నుంచి అమలు చేయనున్నారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ ఫీ (రేట్ల నిర్ణయం, వసూలు) నిబంధనలు, 2008ను కేంద్ర ప్రభుత్వం సవరించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది.

'మీ డబ్బు, మీ హక్కు'

- క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లపై క్యాంపెయిన్

అహ్మదాబాద్, అక్టోబరు 4: బ్యాంకులు, రెగ్యులేటరీల వద్ద క్లెయిమ్ చేయని (అన్‌క్లెయిమ్డ్) ఫైనాన్షియల్ ఆస్తులైన బీమా పాలసీ క్లెయిమ్‌లు, బ్యాంకు డిపాజిట్లు, డివిడెండ్‌లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన మొత్తం క్రమంగా పెరుగుతోంది. దీనిని హక్కుదారులు తిరిగి పొందడానికి సహకరించే లక్ష్యంతో 'మీ డబ్బు, మీ హక్కు' పేరుతో దేశవ్యాప్త క్యాంపెయిన్ శనివారం ప్రారంభమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఈ క్యాంపెయిన్‌ను గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ప్రారంభించారు. ఈ నెల నుంచి డిసెంబరు వరకు ఇది కొనసాగుతుంది. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రజలు తమ అన్‌క్లెయిమ్డ్ ఆస్తులను ఏవిధంగా వెదకాలి, వాటిని ఏవిధంగా క్లెయిమ్ చేసుకోవాలన్న దానిపై స్పష్టమైన సమాచారం ఇవ్వనున్నారు. వ్యక్తులు తమ రికార్డులు అప్‌డేట్ చేసుకోవడానికి, క్లెయిమ్ ప్రక్రియను పూర్తి చేయడానికి సహకరిస్తారు. ఈ క్యాంపెయిన్ ప్రారంభం సందర్భంగా నిర్మల మాట్లాడుతూ..బ్యాంకులు, రెగ్యులేటరీల వద్ద రూ.1.84లక్షల కోట్ల విలువైన అన్‌క్లెయిమ్డ్ ఫైనాన్షియల్ ఆస్తులున్నట్టు పేర్కొన్నారు.

అ..శాంతిలో ట్రంప్!

- శాంతి నోబెల్ కోసం తగని ఆరాటం
- తనను కాదంటే అమెరికాను అవమానించినట్టే అంటూ వింత వాదనలు



వాషింగ్టన్, అక్టోబరు 4: 'నాకు శాంతి నోబెల్ ఇవ్వాల్సిందే' అంటూ హూంకరింపు... 'అయినా, నాకెందుకు ఇస్తారులే..' అంటూ నిష్ఠూరాలు.. 'ఇన్ని యుద్ధాలు ఆపిన మరో మొనగాడు లేడు' అంటూ ప్రగల్భాలు.. 'కానీ, ఆ బహుమతి ఎప్పటికీ నాకివ్వరు' అంటూ నిరాశ పలుకులు.. ఇదీ కొన్ని నెలలుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వరస.. ప్రపంచంలో శాంతిని సాధించిన వారి కోసం ఏర్పాటుచేసిన శాంతి నోబెల్ విజేతను ఈ నెల 10వ తేదీన ప్రకటిస్తారు. ఆ టెన్షన్‌తో ట్రంప్ మరింత అశాంతితో రగిలిపోతున్నారు. ఏమైనా ఈసారి దానిని దక్కించుకోవాలని ఆరాటపడిపోతున్నారు. తాజాగా ట్రంప్ రూపొందించిన శాంతి ప్రణాళికకు ఇజ్రాయెల్, హమాస్ పాక్షికంగా తలూపడంతో ఆయనకు ఇక పట్టపగ్గాలు లేకుండాపోయాయి. 'శాంతి నోబెల్'పై ప్రకటనల్లో దూకుడు పెంచేశారు. "నాకు శాంతినోబెల్ ఇవ్వాల్సిందే. లేదంటే అమెరికాను ఘోరంగా అవమానించినట్టే"నని తాజాగా ట్రంప్ సెలవిచ్చారు. గాజా కూడా కొలిక్కి వస్తే, మొత్తం ఎనిమిది యుద్ధాలను తాను ఆపినట్టు అవుతుందని తెలిపారు. వర్జీనియాలోని క్వాంటికోలో సైనికాధికారులతో ట్రంప్ తాజా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంతి నోబెల్ ప్రస్తావన వచ్చింది. "గాజాలో శాంతి సాధించాం. అక్కడ వివాదం పరిష్కారమైయినట్టే" అని ట్రంప్ అభిప్రాయపడ్డారు. హమాస్, ఇజ్రాయెల్, అరబ్ రాజ్యాలు, ముస్లిం దేశాలు.. అన్నీ తన శాంతి ప్రతిపాదనకు అంగీకరించాయని తెలిపారు. ఒకవేళ హమాస్ తోక జాడిస్తే అదే ఆసంస్థకు ఆఖరిరోజు అవుతుందని చెప్పి దారికి తెచ్చానని పేర్కొన్నారు. 'ఇది అద్భుతం.. అమోఘం' అంటూ తన జబ్బ తానే చరుసుకున్నారు. అంతలోనే ఆయన దిగాలుపడిపోయారు. "ఇంత చేశాం. గతంలో ఎవరూ ఇన్ని యుద్ధాలు ఆపలేదు. నేను ఇంత గొప్ప పని చేశాను. మరి.. నాకు శాంతినోబెల్ వస్తుందా అంటే.. కచ్చితంగా రాదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇలాంటి చరిత్ర ఏదీ లేని ఎవరో అనామకుడికి, లేదంటే.. ఇన్ని యుద్ధాలు ఆపిన ట్రంప్ మెదడు పనితీరుపై పరిశోధన చేసే రచయితలకు శాంతి నోబెల్ ఇస్తారంటూ నిష్ఠూరాలాడారు. అయినా, చూద్దాం, ఏం జరుగుతుందోనంటూ ఒకింత ఆశాభావం కూడా ఈ భేటీలో ఆయన కనపరిచారు. "నా కోసం శాంతి నోబెల్ కోరడం లేదు. నాకు అవసరం లేదు కూడా. కానీ, అమెరికాకు ఈ గౌరవం దక్కాలి' అన్నారు. ఎనిమిదో యుద్ధం ఆగిపోతే సహజంగానే ఆ గౌరవానికి అర్హత పొందినట్టేనని ధీమా వ్యక్తంచేశారు. "నావి వట్టి నోటి మాటలు కాదు. ఇలాంటి వ్యవహారాలు ఎలా ముడిపడతాయనేది, జీవితమంతా వాటితోనే గడిపిన నాకే బాగా తెలుస్తుంది" అని ట్రంప్ సెలవిచ్చారు.

2018 నుంచే ట్రంప్ పోరాటం..

ప్రతిష్ఠాత్మకంగా భావించే నోబెల్ బహుమతుల ప్రదానోత్సవానికి వేళయింది. సాహిత్యం.. అర్థికశాస్త్రం.. భౌతిక శాస్త్రం.. రసాయన శాస్త్రం.. వైద్యశాస్త్రం.. శాంతి.. ఇలా ఆరు విభాగాల్లో అవార్డులను ప్రకటించే కార్యక్రమం వచ్చే వారం నుంచి మొదలుకానుంది. ప్రముఖ శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ నుంచి విశ్వమాత మదర్ థెరెసా వరకు.. గౌరవించి ఈ అవార్డులు తమ గౌరవం పెంచుకున్నాయి. ట్రంప్ 2018లో తొలిసారి అధ్యక్షుడు అయినప్పటినుంచీ శాంతి నోబెల్ కోసం ఆయన పేరును పలువురు అమెరికన్లు, విదేశీ నేతలు ప్రతిపాదిస్తూ వస్తున్నారు. చివరిగా గత డిసెంబరులో ఓ రిపబ్లికన్ సభ్యురాలు ఆయన పేరును ఈ అవార్డుకు సూచించారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య సంబంధాలను సులభతరంచేస్తూ..అబ్రహాం ఒప్పందాలను కుదర్చడంతో ఆయన కృషిని అవార్డు కమిటీ గుర్తించాలని ఆమె కోరారు. నోబెల్ అవార్డు నిబంధనల ప్రకారం.. ట్రంప్ శాంతి నోబెల్ కోసం తన పేరును నామినేట్ చేసుకోవడానికి వీలు ఉండదు. ఆయన పేరును ఎన్నిసార్లు అయినా ఇతరులు నామినేట్ చేయొచ్చు. గత ఏడాది కాలంలో జరిపిన శాంతి కృషిని మాత్రమే అవార్డు కమిటీ పరిగణనలోకి తీసుకుంటుంది. శాంతి అవార్డును నార్వేలోని ఓస్లోలో ప్రదానం చేస్తారు. సైన్స్ అవార్డులను స్టాక్‌హోమ్‌లో అందిస్తారు.

తారలకు 'ఏఐ' విలన్!

(మొదటి పేజీ తరువాయి)

కలకలం రేపుతున్నాయి. సినీతారలు స్వయంగా ప్రమోట్ చేస్తున్నట్టుగా గ్యాంబ్లింగ్, మోసపూరిత యాప్‌ల యాడ్స్‌తో పాటు అభ్యంతరకర, అశ్లీల కంటెంట్ దాకా సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. కొన్ని రోజుల క్రితం సినీనటి రష్మికను పోలినట్టుగా రూపొందిన ఒక డీప్‌ఫేక్ వీడియో కలకలం సృష్టించింది కూడా. అయితే సినిమాల్లో విలన్లను ఆటాడుకునే తారలు.. ఈ ఏఐ విలన్‌ను మాత్రం తట్టుకోలేకపోతున్నారు. యూట్యూబ్, ఇతర సోషల్ మీడియా వేదికల్లో ఇలాంటి ఏఐ వీడియోలు, చిత్రాలతో తమ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలుగుతోందని, వాటిని తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టులను ఆశ్రయిస్తున్నారు. నటి ఐశ్వర్యారాయ్, ఆమె భర్త అభిషేక్ బచ్చన్, నిర్మాత కరణ్ జోహార్, టాలీవుడ్ సీనియర్ హీరో నాగార్జున ఇటీవల ఢిల్లీ హైకోర్టులో ఇలాంటి పిటిషన్లు వేశారు. కొన్ని సినిమా వెబ్‌సైట్లు, బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు, కొన్ని డార్క్ వెబ్‌సైట్లలో తమ చిత్రాలను వాడుతూ అశ్లీల కంటెంట్ అప్‌లోడ్ చేస్తున్నారని.. బెట్టింగ్ యాప్స్‌లోనూ తమ ఏఐ ఆధారిత చిత్రాలు, వీడియోలు వాడుతున్నారని వారు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్, డీప్‌ఫేక్స్, ఫేస్ మార్ఫింగ్ సాంకేతికతల ద్వారా తమ చిత్రాలను, వీడియోలను రూపొందించి, వాడకుండా నిషేధించాలని కోర్టును కోరారు. తన చిత్రాలను వాడుతూ ఉగ్రవాద సంస్థలతో ముడిపెడుతున్నారని, అశ్లీల వీడియోలు రూపొందించారని నాగార్జున కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. తమ చిత్రాలతో కొందరు అశ్లీల వీడియోలను రూపొందించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారని.. తమకు కలిగిన పరువు నష్టానికి యూట్యూబ్, గూగుల్ కంపెనీలు రూ.4కోట్లు పరిహారం ఇచ్చేలా ఆదేశించాలని ఐశ్వర్యరాయ్, అభిషేక్ బచ్చన్ కోర్టును కోరారు.

కోర్టు ఆదేశించినా ఆగేనా?

సినీ సెలబ్రిటీల ఫిర్యాదుతో సదరు వీడియోలను, కంటెంట్‌ను తొలగించాలని యూట్యూబ్, ఇతర సంస్థలకు కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కానీ హైకోర్టు ఆదేశించినా వాటిని అడ్డుకోవడం సాధ్యమేనా అన్న దానిపై సైబర్ నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. యూట్యూబ్, ఇతర సోషల్ మీడియా వేదికల్లో అప్‌లోడ్ అవుతున్న నకిలీ కంటెంట్‌ను అడ్డుకునే అల్గారిథం ఆయా సంస్థల వద్ద లేదని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు. తప్పుడు, అశ్లీల కంటెంట్‌ను.. వీపీఎన్, ఆనియన్ రూటింగ్ వంటి సాంకేతికతల ద్వారా ఇతర దేశాల ఐపీ (ఇంటర్నెట్ ప్రొటోకాల్) అడ్రస్‌ల నుంచి అప్‌లోడ్ చేస్తున్నారని... వాటిని అడ్డుకోవడం కష్టమని అంటున్నారు. ఇక యూట్యూబ్‌లోని ఏదైనా వీడియోపై అభ్యంతరాలుంటే.. ఆ సంస్థను కోరితే తొలగిస్తుంది. కానీ వందలు, వేల సంఖ్యలో తప్పుడు వీడియోలు ఉన్నప్పుడు.. ఆటోమేటిగ్గా అడ్డుకునే అల్గారిథం (నియమాలతో కూడిన కోడ్) ఉండాలి. కానీ ఇందులో కొన్ని సమస్యలు ఉన్నాయని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు.

రివ్యూ లేక సమస్య: నల్లమోతు శ్రీధర్

ప్రముఖ తారలు, సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను రెండు విధాలుగా విశ్లేషించాల్సి ఉంటుందని సాంకేతిక నిపుణుడు నల్లమోతు శ్రీధర్ చెప్పారు. వాస్తవానికి యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికలన్నింటికీ కమ్యూనిటీ గైడ్‌లైన్స్ ఉంటాయని తెలిపారు. అయితే ఇది అభ్యంతరకర కంటెంట్ గుర్తించేందుకే పరిమితమని.. సున్నితమైన అంశాలను యంత్ర మేధ విస్మరిస్తుందని వివరించారు. ఉదాహరణకు అశ్లీలానికి సంబంధించి యూట్యూబ్ కమ్యూనిటీ గైడ్‌లైన్స్ అల్గారిథం కొన్ని శరీరభాగాలపై ఫోకస్ చేస్తుందని.. ఆ భాగాలు తప్పించి మిగతా శరీరమంతా నగ్నంగా చూపించినా అడ్డుకోదని తెలిపారు. ఎవరైనా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా అదే యంత్ర మేధ మరోసారి వీడియోను పరిశీలించి, తమకేమీ తప్పు కనిపించడం లేదని పేర్కొంటుందని వివరించారు. ఇలాంటి సున్నితమైన అంశాల విషయానికి వచ్చినపుడు మ్యాన్యువల్ రివ్యూ జరిగితే సమస్య పరిష్కారం అవుతుందని స్పష్టం చేశారు. కానీ యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటివి మ్యాన్యువల్ రివ్యూకు అనుమతించడం లేదని తెలిపారు. ఎవరైనా వ్యక్తి ప్రతిష్ఠను దెబ్బతీసేలా, మతాల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్న కంటెంట్‌ను యూట్యూబ్ అడ్డుకోగలదని చెప్పారు. అయితే ఈ కమ్యూనిటీ గైడ్‌లైన్స్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న నేరగాళ్లు.. ఆ ఒక్క అంశాన్ని వదిలేసి, మిగతా కంటెంట్ తాము అనుకున్నట్టుగా రూపొందిస్తున్నారని వెల్లడించారు. దీనిని అడ్డుకోవాలంటే కేంద్రమే కఠిన నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని శ్రీధర్ అభిప్రాయపడ్డారు. ప్రముఖ తారలే కాదు రాజకీయ నాయకులు, ఇతర రంగాలకు చెందినవారూ కృత్రిమ మేధ కంటెంట్ సమస్యను ఎదుర్కొంటున్నారని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.